



ESTD: 1999 10-09-2026 గురువారం www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 19-09-2026 శనివారం సంపుటి : 14 | సంచిక :268 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal Follow us on






# తెలంగాణకు 9.56 లక్షల ఇళ్లు

**వ్యవసాయ రంగానికి కేంద్ర సాయం వినతి**



- తెలంగాణ రబీ ప్రణాళికలు, పంట మార్పిడిపై కేంద్రంతో సీఎం చర్చలు
- హైదరాబాద్‌లో ఘనంగా దక్షణాది రాష్ట్రాల ప్రాంతీయ వ్యవసాయ సదస్సు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (వుదయం) :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల తలెత్తిన పరిస్థితులు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించిన సీఎం, వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రధాని ఆవాస్ యోజన ఇళ్ల కేటాయింపుపై చర్చ**

ప్రధాని ఆవాస్ యోజన గ్రామీణ్ (PMAYG) పథకం కింద మొదటి విడతలో తెలంగాణకు 2 లక్షల ఇళ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గత జూలైలో ఢిల్లీ పర్యటన సందర్భంగా రాష్ట్రంలోని 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా త్వరితగతిన కేటాయించాలని కోరారు.

**ఎల్ నినో ప్రభావం వ్యవసాయ సవాళ్లు**

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు, తాగునీరు మరియు విద్యుత్ కొరత ఏర్పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు కేంద్రం నుండి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

**సన్నబియ్యం బోనస్:** రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, సన్నరకం వరి సాగు చేసే రైతులకు క్వింటాలుకు ₹500 బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.

**పంట మార్పిడి:** ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

**అంతర్జాతీయ పండ్ల మార్కెట్:** 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న పండ్లు, కూరగాయల మార్కెట్ గురించి కేంద్ర మంత్రికి వివరిస్తూ, పంటల వైవిధ్యీకరణలో కేంద్ర సహకారం కోరారు.

**దక్షిణాది వ్యవసాయ సదస్సు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

భేటీకి ముందు హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అనంతరం ప్రాంతీయ వ్యవసాయ సదస్సులో మాట్లాడారు.

**ఎల్ నినో ఆందోళన:** దక్షిణాది రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉందని, తీవ్ర వర్షాభావం ఉన్న జిల్లాల కోసం ప్రత్యేక ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు.

> **"మన దేశంలో విభిన్న వాతావరణ మండలాలు, నేల స్వభావాలు, వనరులు ఉన్నాయి. కాబట్టి ఢిల్లీలో కూర్చొని దేశమంతటికీ ఒకే రకమైన వ్యవసాయ విధానాన్ని రూపొందించలేము. అందుకే ఆయా ప్రాంతాల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా రబీ ప్రణాళికలు సిద్ధం చేసేందుకు హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల సదస్సు నిర్వహిస్తున్నాం."**
> — శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి

**సదస్సు ప్రధాన అంశాలు:** రబీ వ్యూహాలు, పంటల వైవిధ్యీకరణ, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, పామాయిల్, ఉద్యానవన పంటలతో పాటు డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, నేల ఆరోగ్యం, నాణ్యమైన విత్తనాలు మరియు నకిలీ పురుగుమందుల నివారణపై సదస్సులో విస్తృతంగా చర్చిస్తామన్నారు.

**సేంద్రీయ సాగు:** రసాయనాలు, పురుగుమందుల విచ్చలవిడి వాడకం వల్ల నేల ఆరోగ్యం, మానవ ఆరోగ్యం దెబ్బతింటున్నాయని, ప్రకృతి సేద్యం (సేంద్రీయ సాగు) పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని స్పష్టం చేశారు. అన్నదాతల సంక్షేమం మరియు దేశ ఆహార భద్రతే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేస్తాయని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు.

## ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గం ఖాళీ



**ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటా..**

**అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లను : దానం నాగేందర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (వుదయం) :** ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్‌కు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం కలిగింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ ఇచ్చి తీర్పును తప్పుబడుతూ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం సంచలనాత్మక ఉత్తర్వులు వెలువరించింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తున్నట్లు స్పష్టం చేస్తూ, ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గం ఖాళీ అయినట్లు శాసనసభ సభాపతితో పాటు భారత ఎన్నికల సంఘానికి సమాచారం అందించింది. గత శాసనసభ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరపున విజయం సాధించిన దానం, అనంతరం అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడమే కాకుండా 2024 లోక్‌సభ పోరులో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈ క్రమంలో ఆయనపై అనర్హత వేటు వేయాలని ప్రతిపక్షాలు దాఖలు చేసిన ఫిర్యాదులను పరిశీలించిన స్పీకర్, ఆయన చట్టపరంగా పార్టీ మారలేదని పేర్కొంటూ మార్చి 11న పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై సమగ్ర విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, స్పీకర్ నిర్ణయం చట్టబద్ధం కాదని తేల్చిచెప్పింది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సమయం నుంచే ఈ అనర్హత వర్తిస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

అనర్హత వేటుపై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ తక్షణమే స్పందించారు. న్యాయస్థానం వెలువరించిన తీర్పును తాను పూర్తిగా గౌరవిస్తున్నానని, అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే ఆలోచన తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. నాయకుడిగా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని, రాజకీయాల్లో ఎన్నికలను ఎదుర్కోవడం, పోరాటాలు చేయడం తనకు కొత్తేమీ కాదని వ్యాఖ్యానించారు. పోరాటాల ద్వారానే ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్న ఆయన, రాబోయే ఎన్నికల్లో ప్రజల మధ్యకే వెళ్లి మళ్లీ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రతిపక్షాలను దొంగిలించడమే పని



**ప్రజాస్వామ్య పతనానికి సంకేతమని మండిపాటు**

**తృణమూల్ కాంగ్రెస్ గుర్తు వ్యవహారంలో ఈసీ**

**శివసేన, ఎన్సీపీల బాటలోనే తృణమూల్ కాంగ్రెస్**

**భాజపా, ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (ఏఎంఎస్) :** భారతీయ జనతా పార్టీ, భారత ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు, పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు ఆ పార్టీ పేరును, ఎన్నికల గుర్తును ఉపయోగించకూడదంటూ ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చే తీర్పును పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘం, అందుకు విరుద్ధంగా ప్రజాతీర్పును తారుమారు చేసే శక్తులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. రాజకీయ పార్టీలను ముక్కలు చేయడం, ఆ తర్వాత వాటి అధికారిక గుర్తును లాక్కోవడం భారతీయ జనతా పార్టీకి, ఎన్నికల సంఘానికి ఒక అలవాటుగా మారిపోయిందని ఆయన ఆరోపించారు. గతంలో శివసేన, ఆ తదుపరి జాతీయవాది కాంగ్రెస్ పార్టీల విషయంలోనూ ఇదే విధమైన వ్యూహాన్ని అమలు చేశారని, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ విషయంలోనూ అదే పద్ధతిని పునరావృతం చేస్తున్నారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. భాజపా, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఒక పార్టీని రెండుగా చీల్చడం, అనంతరం దాని గుర్తును హరించడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఏకంగా ఒక రాజకీయ పక్షాన్నే దొంగిలించే స్థాయికి దిగజారినప్పుడు, కోట్లాది మంది పౌరుల ఓట్లను చోరీ చేయడం వారికి పెద్ద విషయమేమీ కాదని వ్యాఖ్యానించారు. ఓట్లను, ప్రభుత్వాలను దొంగిలించే శక్తులు ఇప్పుడు ఏకంగా పార్టీలనే దొంగిలించే స్థాయికి చేరాయని, ఇటువంటి చర్యలు దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ క్షీణతకు స్పష్టమైన నిదర్శనాలని ఆవేదన వ్యక్తం చేశారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీని కాపాడుకోవడానికి జరుగుతున్న ఈ పోరాటం కేవలం ఒక నాయకురాలికి మాత్రమే పరిమితం కాదని, స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలను కోరుకునే ప్రతి ఓటరు మరియు ప్రతి రాజకీయ పక్షం యొక్క పోరాటమని రాహుల్ స్పష్టం చేశారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల నిర్వహణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (వుదయం) :** రాబోయే గోదావరి పుష్కరాలను ప్రసిద్ధ కుంభమేళా తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, అందుకనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి సంబంధిత అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం శాసనసభ కమిటీ ప్రాంగణంలో ఆయన అధ్యక్షతన "గోదావరి పుష్కరాలు 2027" కేబినెట్ ఉప సంఘం సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమీక్షలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొని పుష్కర ఘాట్ల నిర్మాణం, రవాణా సౌకర్యాలు, ఆధ్యాత్మిక క్షేత్రాల వద్ద మౌలిక వసతుల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. గతంలో పుష్కరాల సందర్భంగా ఎదురైన నష్టాలు, ఇబ్బందులు ఈసారి పునరావృతం కాకుండా ముందస్తుగా క్షేత్రస్థాయిలో లోతుగా అధ్యయనం చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పుష్కర నిర్వహణలో వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను బాధ్యులుగా నియమించినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన ప్రాంతాల్లో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఘాట్ల వద్ద పనులను నిశితంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్లతో అధ్యయనం చేయించామని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో పూర్తయ్యే పనులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సమగ్ర ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఇంజినీర్ల కొరత లేకుండా ఇతర శాఖల నుంచి సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించాలని, వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భద్రాచలం వద్ద వ్యర్థ జలాల శుద్ధి కర్మాగారం నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని ఆదేశిస్తూ, నిధుల కొరత లేదని, నాణ్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు.







## పాకిస్థాన్‌లోని మసీదులో ఆత్మాహుతి దాడి


**6 మంది మృతి, 50 మందికి గాయాలు**

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఒక మసీదు లక్ష్యంగా దారుణ ఆత్మాహుతి దళ దాడి జరిగింది. భక్తులు దైవ ప్రార్థనల్లో మునిగిపోయిన సమయంలో చోటుచేసుకున్న ఈ భయానక ఘటనలో పదహారు మంది అక్కడికక్కడే మృతి చెందగా, యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

## ఇంతే కదా...!




## రష్యన్ యురేనియం లేకపోతే విద్యుత్ కష్టాలు



**వాషింగ్టన్:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై వంద శాతం వరకు తీవ్రమైన సుంకాలు విధిస్తామని హెచ్చరిస్తున్న అమెరికా, తన సొంత ప్రయోజనాల విషయానికి వచ్చేసరికి మాత్రం ద్వంద్వ విధానాలను ప్రదర్శిస్తోంది. రష్యా, ఇరాన్, చైనా, భారత్‌లను లక్ష్యంగా చేసుకుంటూ అమెరికా కాంగ్రెస్ 'ద లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం2026' బిల్లును ఇటీవలే ఆమోదించి, అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంగీకారం కోసం పంపింది. ప్రపంచ దేశాలకు ఆంక్షల పాఠాలు చెబుతున్న అగ్రరాజ్యం, ఈ కొత్త బిల్లులో తనకు తాను ప్రత్యేక మినహాయింపులు ఇచ్చుకోవడం గమనార్హం. ఇతర దేశాలు రష్యన్ ఇంధనాన్ని కొనుగోలు చేయకూడదని నియమాలు విధిస్తూనే, తన సొంత అణు విద్యుత్ అవసరాల కోసం రష్యా నుంచి ప్రాసెస్ చేసిన యురేనియం దిగుమతులను యథేచ్ఛగా కొనసాగించేందుకు మార్గం సుగమం చేసుకుంది. అమెరికా పౌర అణు రంగానికి అవసరమైన యురేనియం శుద్ధి సేవల్లో దాదాపు ఇరవై ఆరు శాతం వరకు రష్యన్ ప్రభుత్వ సంస్థ 'రోసాటమ్' పైనే ఆధారపడుతోంది.

## పార్టీ మారిన మిగతా శాసనసభ్యులకూ ఇదే గతి



**ఖైరతాబాద్ తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ**

**న్యాయస్థానంలో ధర్మమే గెలిచింది**

**అనర్హత తీర్పుపై తుది వరకు పోరాడతామన్న బీఆర్ఎస్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (వుదయం)** ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై భారత రాష్ట్ర సమితి తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ సంచలనాత్మక తీర్పుపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ 'సత్యమేవ జయతే' అని పేర్కొన్నారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి పార్టీ మారిన మిగతా ప్రజాప్రతినిధులకు కూడా త్వరలోనే ఇదే రకమైన పరిణామాలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. న్యాయస్థానాల ద్వారా చివరకు ధర్మమే గెలుస్తుందనడానికి ఈ పరిణామం స్పష్టమైన నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పుపై పిటిషనర్, శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి స్పందిస్తూ ఇది తమ పార్టీకి లభించిన మహత్తర విజయమని అభివర్ణించారు. ఆశలకు లొంగి పార్టీలు మారే ప్రజాప్రతినిధులకు అనర్హత వేటు తప్పదని తాము ముందు నుంచే స్పష్టం చేస్తున్నామని, ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వులు అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరికి చెంపదెబ్బ లాంటివని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయించిన మిగిలిన ఎనిమిది మంది శాసనసభ్యులపై కూడా ఇలాగే అనర్హత వేటు పడేంత వరకు తమ చట్టపరమైన, రాజకీయ పోరాటాన్ని ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# గణేష్ విగ్రహాల నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన అధికారులు



**వుదయం మనూరు**

మనూరు,మండలం కమలాపూర్,చెరువు వద్ద ఉన్న, వినాయక విగ్రహాల నిమజ్జన,ప్రాంతాన్ని, శుక్రవారం సాయంత్రం,అధికారులు క్షేత్రస్థాయిలో,పరిశీలించారు.ఈ తనిఖీ కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్, నారాయణఖేడ్ మేడం, డిఎస్పీ సర్, సిఐపి సర్ తో పాటు ఫైర్ (అగ్నిమాపక), మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ (PR) శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రధానాంశాలు:** గణేష్ నిమజ్జనం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ దీపాలు, భద్రతా చర్యలు, అగ్నిమాపక యంత్రాలు మరియు నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పోలీసు మరియు రెవెన్యూ శాఖల సమన్వయంతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

- **TPCC వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లకు రజక సంఘం వినతిపత్రం అందజేత**
- **వెంటనే కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి స్థల పరిశీలనకు ఆదేశించిన జగ్గారెడ్డి**



**సదాశివపేట సెప్టెంబర్ 18 (వుదయం) :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, ధైర్యసాహసాలకు మరియు బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అయిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సదాశివపేట పట్టణంలో ప్రతిష్ఠించేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సదాశివపేట రజక సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు టీపీసీసీ (TPCC) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి) గారిని మరియు సదాశివపేట మున్సిపల్ కమిషనర్ గారిని రజక సంఘం బృందం కలిసి వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ విముక్తి పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసి చరిత్ర సృష్టించిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సదాశివపేట పట్టణంలో ఘనంగా ప్రతిష్ఠించాలని సంఘం తరపున ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం పట్టణంలో అనువైన స్థలాన్ని పరిశీలించి త్వరితగతిన కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

**విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రతిపాదించిన స్థలాలు:** సదాశివపేట బస్టాండ్ పరిసర ప్రాంతం మేస్త్రీ మల్లయ్య బిల్డింగ్ పక్కన (బైపాస్ రోడ్డు) సదాశివపేట బైపాస్ ఎంట్రీ రోడ్డు

**వెంటనే స్పందించిన జగ్గారెడ్డి:** రజక సంఘం విజ్ఞప్తిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గారు తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:** ఈ కార్యక్రమంలో రజక సంఘం గౌరవ అధ్యక్షులు పట్వారి గోవర్ధన్, అధ్యక్షులు పంచలింగాల హనుమాన్, ఉపాధ్యక్షులు గుర్రాల అమర్‌నాథ్, గార్లపల్లి వినయ్ కుమార్, మద్దికుంట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మచ్చారి కుమార్, కార్యనిర్వాహకులు గార్లపల్లి శ్రీనివాస్, పట్వారి రాజేష్, సహాధ్యక్షులు యు.ఎస్. మల్లేశం, పట్వారి మల్లేశం, సభ్యులు పట్వారి ప్రభు, గొల్లపల్లి రమేష్, గొల్లపల్లి కిరణ్, సి.హెచ్. దత్తు, మద్దికుంట రమేష్, పెద్దాపురం బాలకృష్ణ, తుంటి సంగమేశ్వర్, మీనపల్లి సాయికుమార్, మద్దికుంట యాదగిరి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం చేసిన దయాకర్ రెడ్డి

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 18)**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్ ఫేస్02లో మానవత్వం చాటుకున్న మాజీ టెలికామ్ బోర్డు సభ్యుడు డాకరెడ్డి దయాకర్ రెడ్డి, నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం అందించారు. కేసీఆర్ నగర్ ఫేస్02లోని 54వ బ్లాక్‌కు చెందిన కొత్తకొండ విజయలక్ష్మి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న మాజీ టెలికామ్ బోర్డు సభ్యుడు డాక్టర్ దయాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తనవంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో కేసీఆర్ నగర్ ఫేస్02 బీఆర్ఎస్ నాయకులు మల్లేష్ యాదవ్, కోటేష్ నాయక్, అజయ్, శంకర్, తిరంగా యూత్ సభ్యులు సాయి, మనోజ్, ప్రదీప్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ
# మృతదేహం లభ్యం

**వుదయం సిర్గాపూర్ మండల్ సెప్టెంబర్:18_**



శుక్రవారము నాడు ఉదయం సుమారు 07:00 గంటల సమయంలో, నల్లవాగు ప్రాజెక్టు నీటిలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక మహిళ మృతదేహం గుర్తు తెలియని స్థితిలో లభించింది.మృతురాలి వివరాలు/ గుర్తింపు ఇంకా తెలియరాలేదు. గత కొన్ని రోజులుగా తమ కుటుంబ సభ్యులు లేదా బంధువులు కనిపించకుండా పోయినట్లయితే, వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేయవలసిందిగా కోరారు మృతురాలిని గుర్తించేందుకు ప్రజలు సహకరించగలరు. మృతురాలి గుర్తింపు లేదా ఆచూకీకి సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసిన వారు వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించగలరు.

**పోలీస్ శాఖ**

# వినాయక మండపం వద్ద అన్నదానం

**నిర్వహించిన తుక్కాపురం చెన్నయ్య**



ఆందోల్ జోగిపేట్ వు దయం ఆందోల్ మండలం పరిధిలోని నేరడి గుంట గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సోత్సవ సందర్భంగా మల్లికార్జున యూత్ శ్రీరామ యూత్ శివశంకర్ యూత్ శివ యూత్ భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు తుక్కపురం చిన్నయ్య మాట్లాడుతూ విగ్నేశ్వరుడు కృప కక్షలు ఉండాలని ఆక్షించారు గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గణేష్ మండప భక్తులు శంకర్ వార్డ్ మెంబర్ తుకపురం నవీన్ శేఖర్ సురేష్ కోదండ నవీన్ నరసింహుల అంజి చింటూ మోషన్ మనీ సన్నిత్ రెడ్డి అంబిరెడ్డి శివ సాయి గొల్ల అర్జున్ కుమ్మరి సంగమేశ్వర్ మంగలి వీరేశం దశరథ్ శేఖర్ గౌడ్ కటింగ్ శ్రీకాంత్ బీరప్ప పాల్గొన్నారు

# వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి: సదాశివపేట సీఐ వెంకటేష్

- **చెరువులు, కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలి**
- **మద్యం సేవించి నీటిలోకి దిగితే కఠిన చర్యలు**
- **శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపు**



**సదాశివపేట సెప్టెంబర్ 18 (వుదయం):** వినాయక చవితి నిమజ్జనోత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా జరుపుకోవాలని సదాశివపేట సీఐ వెంకటేష్ పిలుపునిచ్చారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, కాలువలు, కుంటల వద్ద భక్తులు తీసుకోవాల్సిన పలు రక్షణ చర్యలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో భక్తులు ఈ క్రింది మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు: నీటి లోతు పరిశీలన: చెరువులు, కాలువలు, గుంటల వద్ద నిమజ్జనం చేసే సమయంలో ముందుగా నీటి లోతు, ప్రవాహ తీవ్రత తెలుసుకున్న తర్వాతే నీటిలోకి దిగాలి. లైఫ్ జాకెట్ల వినియోగం: నీటి వద్దకు వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలి. పిల్లలు, వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.మద్యం సేవనంపై నిషేధం: మద్యం సేవించి నిమజ్జన ప్రదేశాలకు రావడం, నీటిలోకి దిగడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాలకు దూరం: జారే బురద నేలలు, ప్రమాదకరమైన గుంటలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. పిల్లలపై పర్యవేక్షణ: చిన్నారులను ఒంటరిగా నీటి వద్దకు పంపకూడదని, పెద్దల పర్యవేక్షణలోనే ఉంచాలని సూచించారు. రక్షణ సామాగ్రి సిద్ధం: ప్రమాదాలను నివారించడానికి అవసరమైన రక్షణ వలయాలు, రింగులు, తాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలి. తోపులాటలు వద్దు: నీటిలోకి ఒకేసారి గుంపులుగా వెళ్లకుండా క్రమపద్ధతిలో ఒకరి తర్వాత ఒకరు నిమజ్జనం పూర్తి చేయాలి. పర్యావరణ పరిరక్షణ: జలాశయాల్లో ప్లాస్టిక్, నిరుపయోగ పూజా సామగ్రిని వేసి నీటిని కలుషితం చేయకూడదు. అత్యవసర వేళల్లో సమాచారం: ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వెంటనే అక్కడున్న పోలీసులకు సమాచారం అందించాలని లేదా డయల్ 112 కు కాల్ చేయాలని కోరారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు ప్రజలందరూ పోలీసు విభాగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని సీఐ వెంకటేష్ కోరారు.

# వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన



**దౌల్తాబాద్ సెప్టెంబర్ 18(వుదయం):** 9వ పోషణ మాసం వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు కీలకమైన వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై తల్లిదండ్రుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భధారణ నుంచి చిన్నారి రెండేళ్ల వయసు వరకు ఉన్న మొదటి వెయ్యి రోజులు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు అత్యంత కీలకమైనవని అవగాహన కల్పించారు. సమావేశంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, పిల్లలకు అందించాల్సిన సమతుల్య ఆహారం తదితర అంశాలపై వివరించారు. చిన్నారుల ఎదుగుదలలో పోషకాహారం, తల్లిపాలు, సమయానుకూల టీకాలు, ఆరోగ్య పరీక్షలు ఎంతో ముఖ్యమని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ హాజరై మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ సమస్య నుంచి తప్పించుకునేందుకే ఎర్రవల్లి అస్త్రం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 18(వుదయం):** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశాన్ని తెరపైకి తీసుకురావడం రాజకీయ దృష్టి మళ్లింపు వ్యూహంగా కనిపిస్తోందని దౌల్తాబాద్ మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 22ఏ జాబితాలో భూములు ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగక రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.22ఏ సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశాన్ని రాజకీయంగా తెరపైకి తీసుకురావడం వల్ల అసలు సమస్యలపై ప్రజల దృష్టి మళ్లే అవకాశం ఉందన్నారు.కేసీఆర్ ఫాంహౌస్ భూముల్లో అక్రమాలు జరిగి ఉంటే గతంలోనే రెవెన్యూ అధికారులు విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందని రహీమొద్దీన్ పేర్కొన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ వేదికగా భూముల వివరాలను ప్రస్తావించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులు, భూ యజమానుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. ఎర్రవల్లి భూముల అంశంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలు అధికారిక విచారణలో తేలాల్సి ఉందని, అయితే 22ఏ సమస్యను పక్కన పెట్టి రాజకీయ అంశాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని రహీమొద్దీన్ అన్నారు.గమనిక: 22ఏ భూముల సమస్య



# నిమజ్జన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి

**మహబూబ్‌నగర్**

- **వినాయక నిమజ్జనం, SIR-2026పై అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ సమీక్ష**



ఓటరు జాబితా సవరణలో తప్పులకు తావివ్వొద్దుజిల్లాలో చేపట్టిన వినాయక నిమజ్జన ఏర్పాట్లు, SIR2026 ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహశీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ పీడీలతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన క్రేన్లు, విద్యుత్, జనరేటర్లు, లైటింగ్, నైపుణ్యం కలిగిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.SIR2026 ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అర్హులైన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి పరిశీలనను సక్రమంగా నిర్వహించేలా తహశీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6, తొలగింపునకు ఫారం7, వివరాల సవరణకు ఫారం 8 ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు పూర్తి పారదర్శకంగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, ఇళ్ల కాలనీల్లో తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహశీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల పురోగతిపై క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని సూచించారు.ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ఉపేందర్ రెడ్డి, తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహిళా కుటుంబ సలహా కేంద్రం ప్రారంభ





- **"మహిళలకు అండగా.. కుటుంబ సమస్యలకు పరిష్కార బాట!**
- **"బాల్య వివాహాల నివారణకు విస్తృత అవగాహన అవసరం"**
- **"యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచాలి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్"**

**కోహీర్, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి)**

కోహీర్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా కుటుంబ సలహా కేంద్రాన్ని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి. కోహీర్. మున్సిపల్. చైర్మన్. ఎం. అశోక్ ప్రారంభించారు.మహిళలు ఎదుర్కొంటున్న కుటుంబ సమస్యలను సలహాలు, మార్గదర్శకత్వం ద్వారా పరిష్కరించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని వారు తెలిపారు. కుటుంబ కలహాలు తీవ్రమైన సమస్యలుగా మారకముందే పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని సూచించారు. మహిళలు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించి సలహా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మహిళల సమస్యలకు సత్వర పరిష్కారం దిశగా..**

మహిళలకు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేందుకు ప్రత్యేక వేదికగా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని రామలింగారెడ్డి పేర్కొన్నారు. కుటుంబాల్లో నెలకొనే సమస్యలను చర్చలు, అవగాహన, మార్గదర్శకత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**బాలికల రక్షణకు సమాజం బాధ్యత**

మహిళలు, బాలికలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని చైర్మన్ అశోక్ సూచించారు. బాలికల రక్షణ, మహిళా సాధికారత కోసం కుటుంబాలు, మహిళా సంఘాలు, అధికారులు సమష్టిగా పనిచేయాలని అన్నారు.

**యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచాలి**

పిల్లలు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్. అశోక్ సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై యువతలో చైతన్యం కల్పించి వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**అవగాహనతో కుటుంబాల్లో సామరస్యం**

కుటుంబాలు, మహిళా సంఘాలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మహిళల సమస్యలకు మెరుగైన పరిష్కారాలు లభిస్తాయని చైర్మన్ తెలిపారు. మహిళలకు అవసరమైన సలహాలు, సహకారం అందించడంలో సలహా కేంద్రం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనసూయ జగదీశ్. ఏపీఎం, సీసీలు, ఎంఎస్‌ఓలు, జెండర్ పాయింట్ పర్సన్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళలు తమ సమస్యలను నిర్భయంగా సలహా కేంద్రం దృష్టికి తీసుకువచ్చి అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, కోరారు.

# రైతులకు ఆహ్వానం – కిసాన్ మేళా

- **ఉర్కొండ మండల వ్యవసాయ అధికారి దీప్తి**

**ఊర్కొండ న్యూస్ 18 వుదయం ప్రతినిధి**



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రైతులందరికీ ముఖ్య సమాచారం.ఆర్ఏఆర్ఎస్, పాలెం నందు శనివారం ఉదయం 9:00 గంటలకు కిసాన్ మేళా నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, వ్యవసాయానికి సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం మరియు పంటలపై అవగాహన పొందగలరు. రైతుల సౌకర్యార్థం ఊర్కొండ నుండి పాలెం వరకు రవాణా సౌకర్యం( జీప్ )అందుబాటులోఉంటుంది.రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనగలరు. వేదిక: ఆర్ఏఆర్ఎస్, పాలెం 1909 2026 శనివారం సమయం: ఉదయం 9:00 గంటలకు ఊర్కొండ మండల వ్యవసాయ అధికారి దీప్తి


# 22(ఏ) భూములపై బీఆర్ఎస్‌ది దుష్ప్రచారం

- **కోటి ఎకరాలు 22(ఏ)లో ఉన్నాయనడం అవాస్తవం.. ప్రస్తుతం 3.75 లక్షల ఎకరాలే**
- **బీఆర్ఎస్ హయాంలోనే 22.93 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చారు**
- **బీఆర్ఎస్ నేతలు దోచుకున్న అసైన్డ్ భూముల వివరాలు బయటపెడతాం: సత్యం శ్రీరంగం**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 18:వుదయం:** 22(ఏ) భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆరోపించారు. కోటి ఎకరాలు 22(ఏ) జాబితాలో ఉన్నాయంటూ కేటీఆర్, హరీశ్‌రావు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చిన సమయంలో 22(ఏ) కింద ఏకంగా 22.93 లక్షల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చిందని సత్యం శ్రీరంగం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విస్తీర్ణాన్ని సుమారు ఏడు లక్షల ఎకరాలకు తగ్గించామని, ప్రస్తుతం 22(ఏ)లో కేవలం 3.75 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందని వివరించారు. 22(ఏ) సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు.

**బీఆర్ఎస్ హయాంలో భూదోపిడీ జరిగిందని ఆరోపణ**

తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధరణిని అడ్డుపెట్టుకొని అసైన్డ్ భూములను అక్రమంగా దోచుకున్నారని సత్యం శ్రీరంగం ఆరోపించారు. అడ్డగోలుగా పట్టాలు సృష్టించి బీఆర్ఎస్ నేతలు స్వాధీనం చేసుకున్న భూముల వివరాలను త్వరలో బయటపెడతామని ప్రకటించారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.దళితులను అవమానించారని విమర్శఫామ్‌హౌస్ ముందు డప్పులు కొట్టిన దళితులను అవమానించేలా రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేశారని సత్యం శ్రీరంగం ఆరోపించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు.



రఘునందన్‌రావుపై విమర్శలుబీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకొని ఎంపీగా గెలిచిన రఘునందన్‌రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని మాట్లాడటం విడ్డూరంగా ఉందని సత్యం శ్రీరంగం అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కారణంగానే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త విధానాలను తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు రఘుగౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల
# నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

**మహబూబ్‌నగర్**

- **అప్పనపల్లి లో కృత్రిమ బేబీ కుంటల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు.మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదు అడుగుల ఎత్తు వరకు ఉన్న వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం అప్పనపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు పెద్ద కృత్రిమ బేబీ కుంటలను, అలాగే పంచవటి స్కూల్ సమీపంలోని పార్కు స్థలంలో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృత్రిమ కుంటల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్యం, విద్యుత్, లైటింగ్, తాగునీరు, భద్రత తదితర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో స్టేషన్ రోడ్‌లోని చర్చి సమీపంలో కృత్రిమ బేబీ కుంటను ఏర్పాటు చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం వద్ద, బీసీ హాస్టల్ వెనుక ఉన్న మూడో వార్డు పార్కులో, 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్ తండాలోనూ కృత్రిమ బేబీ కుంటను ఏర్పాటు చేశారు.జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు





# గ్రేటర్ హైదరాబాద్





## జిల్లాలో రెండు అక్రమ క్లినిక్ లు సీజ్
## హఫీజ్ పేట్, నార్సింగిలో తనిఖీలు

**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 18(వుదయం)**

DMHO డా. స్వర్ణకుమారి గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ క్లినిక్ లపై తనిఖీలు ముమ్మరం చేశారు.ఈ రోజు DEMO గంగాసాని మంజుల, శ్రీనివాస్ బృందం ఆధ్వర్యం లోహఫీజ్ పేట్ లోని RIA CLINIC & DIAGNOSTIC CENTRE, Dr. Mahipal (9951884262) ను అనుమతులు లేకుండా అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నందుకు,నార్సింగి లోని ప్రియదర్శిని క్లినిక్ ను నిబంధన లకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నందుకు Dr. Sri Devi బృందం సీజ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా DMHO డా. స్వర్ణకుమారి గారు మాట్లాడుతూ" జిల్లాలో ఎవరైనా నిబంధనలకు మించి



వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అక్రమ క్లినిక్ లు, అక్రమ ల్యాబ్ లపై తనిఖీలు కొనసాగుతాయి" అని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ విలీనాన్ని గుర్తింపు ఎన్నికలతో ముడిపెట్టొద్దు

- **విలీన ఫలాలు అందకుండానే వందలాది మంది కార్మికుల రిటైర్మెంట్ విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి: తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 18(వుదయం)**

తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను గుర్తింపు ఎన్నికలతో ముడిపెట్టడం సరికాదని తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ డిమాండ్ చేసింది. విలీన ప్రక్రియలో జరుగుతున్న జాప్యం కారణంగా వందలాది మంది కార్మికులు విలీన ఫలాలు అందుకోకుండానే పదవీ విరమణ చేస్తున్నారని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది.

ఈ మేరకు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో వివిధ ఆర్టీసీ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వ హించారు. యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్,



గోలి రవీందర్, కె.ఎస్.పాల్ తదితరులు హాజరై మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకున్నప్పటికీ, చర్చల సందర్భంగా విలీన ప్రక్రియను గుర్తింపు ఎన్నికలతో ముడిపెట్టడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోందని కార్మిక సంఘాల నేతలు ఆరోపించారు. గుర్తింపు ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో విలీన అంశం కూడా పెండింగ్‌లో పడిందని పేర్కొన్నారు.

గుర్తింపు ఎన్నికల ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని వారు విమర్శించారు. ప్రభుత్వం ఇకనైనా ఆలస్యం చేయకుండా ఆర్టీసీ విలీనానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పన, అమలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

విలీన ప్రక్రియకు సంబంధించిన కమిటీలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విలీన ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి విలీన ప్రక్రియకు కార్యాచరణ ప్రారంభించాలని కోరారు.

విలీన ప్రక్రియను తక్షణమే ప్రారంభించకపోతే తెలంగాణ ఉద్యమం తరహాలో ఆర్టీసీ కార్మిక ఉద్యమాన్ని కూడా ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## SIR హియరింగ్‌ను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలి: రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా , సెప్టెంబర్ 18(వుదయం)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల అప్ లోడింగ్ లో ఏలాంటి తప్పులు జరగకుండా పటిష్టంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల ఆప్ లోడింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న SIR హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధిక గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు సిఈఓకు పుష్పగుచ్చం అందించారు.

ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైజర్లను, బిఎల్ఓలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు.

జిల్లాలో మ్యాపింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు మరియు ఓటర్ కార్డ్ లో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటిస్ అందిన ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలన లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిఎల్ఓలు నిర్వహిస్తున్నరిజిష్టర్లను, కంప్యూటర్లో ధవృపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహాసీల్దార్ పూల్ సింగ్, డిప్యూటి కమీషనర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్ వైజర్లు , బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌పై పుస్తకాన్ని నిరసిస్తూ విద్యాసంస్థల మూసివేత

- **పుస్తకాన్ని నిషేధించాలని ప్రజా సంఘాల డిమాండ్**
- **హమారా ప్రసాద్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలి**

**నంగునూరు, సెప్టెంబర్ 18: వుదయం**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ రాసిన పుస్తకాన్ని నిరసిస్తూ నంగునూరు మండలం మగ్ధూంపూర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. హమారా ప్రసాద్ రాసిన పుస్తకంలోని అంశాలపై దళిత సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ను అవమానించేలా ఉన్న పుస్తకాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు.నిరసనలో భాగంగా గ్రామంలోని పాఠశాలల్లో తరగతులను బహిష్కరించారు.విద్యాసంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు.మాల మహానాడు జిల్లా నాయకుడు అల్లిబిల్లి నర్సింగరావు మాట్లాడుతూ పుస్తకాన్ని ప్రభుత్వం వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు,




అభ్యంతరకర అంశాలను సహించేది లేదన్నారు. అంబేడ్కర్ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు చిట్యాల సురేశ్ మాట్లాడుతూ హమారా ప్రసాద్‌ను తెలంగాణ రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలు సామాజిక ఉద్రిక్తతలకు దారి తీయకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆయన రచించిన భారత రాజ్యాంగం సామాజిక న్యాయానికి పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మగ్దుంపూర్ వార్డు సభ్యులు పాకాల రాకేశ్, బత్తుల ప్రశాంత్, నాయకులు పాకాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ యూత్ గణనాధుని సన్నిధిలో మహిళల కుంకుమార్చన పూజలు



**జిన్నారం సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి )**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్ల పోతారం గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో గణనాధునికి భక్తిశ్రద్ధలతో పూజలు కొనసాగుతున్నాయి.

శుక్రవారం అయిదవరోజు మహిళలు పెద్ద ఎత్తున గణనాధుని సన్నిధిలో కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మహిళ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో మండపం వద్ద సందడి నెలకొంది. ఈ పూజల్లో రెండో వార్డ్ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి హోమం, అన్నదానం

**సదాశివపేట సెప్టెంబర్ 18 (వు దయ 0):**

సదాశివపేట 22వ వార్డు రాఘవేంద్ర నగర్ కాలనీ నవశక్తి గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు విశేష గణపతి హోమం మరియు అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఈ హోమ మహోత్సవం ఇప్పపల్లి నర్సింలులత, శివానంద్ గౌడ్, సర్పంచ్ విజయలక్ష్మి, శ్రీధర్‌సరిత, విజయ్ కుమార్‌రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ, వైస్ చైర్మన్ చిరు, కౌన్సిలర్ గారెల్ గౌరీ దేవితుల్జారాం, యూత్ కమిటీ సభ్యులు దినేష్, అభినవ్, శివ సాయి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద శంకరంపేట మోడల్ స్కూల్‌లో విద్యుత్ వినియోగం పై విమర్శలు

**పెద్ద శంకరంపేట సెప్టెంబర్ 18: వుదయం**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మోడల్ స్కూల్‌లో పాఠశాలకు సంబంధించిన విద్యుత్‌ను వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు తన కారును పాఠశాల విద్యుత్‌తో ఛార్జింగ్ చేస్తున్న దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.ప్రభుత్వ విద్యాసంస్థల విద్యుత్‌ను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం సరైనదేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల అవసరాల కోసం కేటాయించిన విద్యు



త్‌ను వ్యక్తిగత వాహనం ఛార్జింగ్‌కు ఉపయోగించడంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది

- **కేసీఆర్ వద్ద దళితుల భూములు లేవని తేలితే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధమా?**
- **ధైర్యం ఉంటే నా సవాల్ స్వీకరించండి**
- **తన భూమి కొనుగోలులో చిన్న తప్పు ఉన్నట్లు నిరూపించినా 13 ఎకరాల భూమిని ప్రభుత్వానికి రాసిచ్చేందుకు సిద్ధమని సవాల్**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి:**

ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. తన వ్యవసాయ భూమి వద్దకు కాంగ్రెస్ ఎంపీల బృందం పర్యటించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే (తన) క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. భూములు విక్రయించుకోలేక, రైతుబంధు వంటి పథకాల ప్రయోజనాలు పొందలేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. సిద్దిపేట పరిధిలోని రంగధాంపల్లి, ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, పొన్నాల తదితర ప్రాంతాల్లో సుమారు 3 వేల ఇళ్ల స్థలాలు 22ఏలో ఉన్నాయని పేర్కొన్నారు.తన భూమిపై ఆరోపణలను ఖండిస్తూ, వ్యవసాయ భూమిలో విలాసవంతమైన ఫామ్‌హౌస్ లేదని, కనీసం బాత్రూం కూడా లేదని హరీశ్‌రావు



తెలిపారు. తన భూమి కొనుగోలులో చిన్న తప్పు ఉన్నట్లు నిరూపించినా 13 ఎకరాల భూమిని ప్రభుత్వానికి రాసిచ్చేందుకు సిద్ధమని సవాల్ చేశారు. 2018 నుంచి 2024 వరకు విడతల వారీగా భూమిని కొనుగోలు చేసినట్లు, అధికారిక పత్రాలు ఉన్నాయని చెప్పారు.కాంగ్రెస్ ఎంపీల బృందం సిద్దిపేటకు వచ్చిన సందర్భంగా తన భూమితోపాటు 22ఏ బాధితులను, రైతుల సమస్యలను, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను చూపించాలని భావించానన్నారు. సిద్దిపేటలోని వెయ్యి పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల పనులు, రంగనాయకసాగర్ వద్ద నిలిచిపోయిన పర్యాటక ప్రాజెక్టు తదితర అంశాలను ఎంపీల దృష్టికి తీసుకెళ్లాలనుకున్నట్లు చెప్పారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా ప్రతిపక్ష గొంతును అణచివేశారని హరీశ్‌రావు ఆరోపించారు. సభలో ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే సస్పెన్షన్లు చేశారని అన్నారు.రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, గోదావరి జలాల అంశం, ప్రాంతీయ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మసాగర్ వంటి అంశాలపై కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంపై పోరాడాలని సూచించారు. రాజకీయ కక్షసాధింపుల కోసం యాత్రలు చేయకుండా రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై పోరాటం చేయాలని అన్నారు.

కేసీఆర్ 300 ఎకరాల దళితుల భూములను కబ్జా చేశారన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలను ప్రస్తావిస్తూ హరీశ్‌రావు సవాల్ విసిరారు. కేసీఆర్ వద్ద దళితుల భూములు లేవని తేలితే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధమా? తాము కూడా రాజీనామాకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం ఎన్ని ఎదురుదాడులు చేసినా ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## బొమ్మారెడ్డిగూడెం కెనాల్‌ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

**చౌట్ కూరు వుదయం**

చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులోని చెరువులకు కెనాల్ ద్వారా సాగునీరు అందించే అవకాశాలను ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ మధుసూదన్, ఏడబ్ల్యూయూ మధుసూదన్ అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మహేష్ రాథోడ్ తో కలిసి కెనాల్‌ను పరిశీలించారు.సింగూర్ కెనాల్ ద్వారా బొమ్మారెడ్డిగూడెం పరిధిలోని పోష్‌కుంట, ఏశ్వమ్ చెరువు, గొల్లకుంట, నాన్ చెరువు, కోమటి చెరువులకు నీటిని అందించే అవకాశాలపై అధికారులు ఆరా తీశారు. ఆయా చెరువులకు కెనాల్ ద్వారా నీటిని మళ్లించేందుకు అవసరమైన పనులు, చేపట్టాల్సిన వివరాలను సేకరించారు.త్వరలోనే పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించి కెనాల్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మహేష్‌రాథోడ్, హరి నాయక్, డీలర్ కిషన్, జాదవత్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE CUM XI ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DIST. AT. RAJENDRANAGAR.**
**O.S. No. 599 OF 2022**

**Between :**
Ameer Ali ...Plaintiff
**AND**
Syed Ayub Ali Hussaini and another ...Defendants

To,
Mohammed Suhail, (Def.No.2) S/o Late Sami Ullah, Aged about 49 yrs. Occ: Business, R/o. H.No.9-4-61/172, Meher Colony, Tolichowki, Hyderabad.

**PUBLIC NOTICE**

Please take notice that the plaintiff (Ameer Ali) herein has filed above suit for Permanent Injunction against this defendant No.2 and another in respect of the suit schedule property which is below mentioned clearly. The above suit is posted to 23-09-2026 for your appearance before the court on.23-09-2026 at 10.30 am, if you are anybody is having any objection or interest in the above suit that they should be appear before the above Hon'ble Prl.Junior Civil Judge Cum- XI Addl. Metropolitan Magistrate, Ranga Reddy Dist. At Rajendernagfar either in the person or through advocate or else the matter will be decided ex-parte and the matter will be decided according to the law.

**Suit SCHEDULE OF PROPERTY –A**

All that House bearing Municipal No.4-10-33/2PH/2 (PTI No.1060439173), on Plot bearing No.2, in Sy.No.335/1, 337/5, admeasuring 871.00 Sq.yards equallent to 728.15 Square Meters Situated at ATTAPUR VILLAGE, GHMC, Rajendranagar Circle, Ranga Reddy District, Telangana State, and bounded as follows: North: 25 Wide Road, South: 60 feet Wide Road East: Plot No.03, West: 33 Wide Road

**Suit SCHEDULE OF PROPERTY –B**

All that the Semi-furnished Flat bearing No.405 in Fourth Floor known as "MIR MAHMOOD APARTMENT", admeasuring 980 Square Feet including common area and two wheeler parking, Undivided Share of Land 18.00 Square Yards, (Out of 871 Square Yards) in the premises bearing House bearing Municipal No.4-10-33/2PH/2 (PTI No.1060439173), on Plot bearing No.2, in Survey No.337/5, Situated at ATTAPUR VILLAGE, GHMC,Rajendranagar Circle, Ranga Reddy District, Telangana State, and bounded as follows: North: Flat No.406, South: Open to Sky East: Open to Sky, West: Corridor

**(By order of the Hon'ble Court).**

**Sd/-**
**N.Bhavani Sankar**
**Advocate.**
**O/c.2-2-72, Upperpally, Hyderguda, Hyderabad-48.**
**Cell No.9000519567.**



**IN THE COURT OF HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE CUM XI ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DIST. AT. RAJENDRANAGAR.**
**I.A.No.538/2022 & I.A.No.539/2022 IN O.S. No. 599 OF 2022**

**Between :**
Ameer Ali ...Petitioner/Plaintiff
**AND**
Syed Ayub Ali Hussaini and another ...Respondents/Defendants

To,
Mohammed Suhail, (Res.No.2/Def.No.2) S/o Late Sami Ullah, Aged about 49 yrs. Occ: Business, R/o. H.No.9-4-61/172, Meher Colony, Tolichowki, Hyderabad.

**PUBLIC NOTICE**

Please take notice that the petitioner/ plaintiff (Ameer Ali) herein has filed above suit for Permanent Injunction against this respondent No.2/defendant No.2 and another in respect of the suit schedule property which is below mentioned clearly. In the above suit the petitioner/plaintiff filed two I.A's and those are posted to 23-09-2026 for your appearance before the court on.23-09-2026 at 10.30 am, if you are anybody is having any objection or interest in the above suit that they should be appear before the above Hon'ble Prl.Junior Civil Judge Cum- XI Addl. Metropolitan Magistrate, Ranga Reddy Dist. At Rajendernagfar either in the person or through advocate or else the matter will be decided ex-parte and the matter will be decided according to the law.

**PETITION SCHEDULE OF PROPERTY –A**

All that House bearing Municipal No.4-10-33/2PH/2 (PTI No.1060439173), on Plot bearing No.2, in Sy.No.335/1, 337/5, admeasuring 871.00 Sq.yards equallent to 728.15 Square Meters Situated at ATTAPUR VILLAGE, GHMC, Rajendranagar Circle, Ranga Reddy District, Telangana State, and bounded as follows: North: 25 Wide Road, South: 60 feet Wide Road East: Plot No.03, West: 33 Wide Road

**PETITION SCHEDULE OF PROPERTY –B**

All that the Semi-furnished Flat bearing No.405 in Fourth Floor known as "MIR MAHMOOD APARTMENT", admeasuring 980 Square Feet including common area and two wheeler parking, Undivided Share of Land 18.00 Square Yards, (Out of 871 Square Yards) in the premises bearing House bearing Municipal No.4-10-33/2PH/2 (PTI No.1060439173), on Plot bearing No.2, in Survey No.337/5, Situated at ATTAPUR VILLAGE, GHMC,Rajendranagar Circle, Ranga Reddy District, Telangana State, and bounded as follows: North: Flat No.406, South: Open to Sky East: Open to Sky, West: Corridor

**(By order of the Hon'ble Court)**

**Sd/-**
**N.Bhavani Sankar**
**Advocate.**
**O/c. 2-2-72, Upperpally, Hyderguda, Hyderabad-48.**
**Cell No.9000519567.**



**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM XIII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT AT RAJENDERNAGAR.**
**O.S. No.577 of 2026**

**Between :**
Chinnam Radha ...Plaintiff
**AND**
The Mandal Revenue Officer, Rajenderngar, R.R.District & Others ...Defendants

To
All Concerned

Please take notice that the above named plaintiff has filed the above suit for declaration to declare the plaintiff as Legal Heir of Late. Sulige Eshwar died on 24.03.2015 and Late. Sulige Anuradha died on 15.08.2013, seeking issuance of legal heir certificate in his favour being only legal heir.

If any person(s) have any interest in the above matter and having any kind of objection in issuance of legal heir certificate may filed their objections before the above court on 09.10.2026 at 10.30 AM in person or through an advocate, if no objection is received by the court the matter will be decided as exparte.

**// BY ORDER OF THE COURT //**

**Sd/-**
**IYELAIAH BADAM**
**Advocate**
**Office at 3-2-53, Hyderguda, Attapur, Hyderabad -048.**
**Cell : 9533519837**



**పేరు మార్పు**

సింధు లింగన్న S/o చిన్న లింగన్న అనే నేను నా పేరును గజ్జెల రాజలింగు S/o లింగన్న గా మార్చుకున్నాను. R/o కమల్ కోట్, మామడ మండలం, నిర్మల్ జిల్లా. ఇక నుండి అన్ని రికార్డులలో ఇదే పేరు పరిగణించగలరు.




"భాజపా, ఎన్నికల సంఘం కలిసి ఒక పార్టీని చీల్చడం, ఆపై దానికి సంబంధించిన గుర్తును లాక్కోవడం అలవాటుగా మార్చుకున్నాయి. మొదట ఓట్లను, ఆ తర్వాత ప్రభుత్వాలను దొంగిలించిన వారు, ఇప్పుడు ఏకంగా రాజకీయ పార్టీలనే చోరీ చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ విధానాలను నిరసించాలి."

- రాహుల్ గాంధీ ,కాంగ్రెస్ అగ్రనేత

## వే'మన' పద్యం

మేక కుతికబట్టి మెడచన్ను గుడువంగ
ఆకలేల మాను ఆశగాక
లోభివాని నడుగ లాభంబు లేదయా
విశ్వదాభిరామ! వినుర వేమ!



# సంపాదకీయం

## డిజైన్–ఇన్నోవేషన్ దేశం'గాభారత్!

నేటి ఆధునిక ఒకప్పుడు ఎలక్ట్రానిక్ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడిన భారత్.. ఇప్పుడు అదే రంగంలో ప్రపంచానికి తయారీ కేంద్రంగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. మొబైల్ ఫోన్ల నుంచి సెమీకండక్టర్ల వరకు విస్తరిస్తున్న ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగం భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త శక్తిని నింపుతోంది.భారత్‌లో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 2014-15లో రూ.1.9 లక్షల కోట్ల నుంచి 2024-25 నాటికి రూ.11.3 లక్షల కోట్లకు చేరింది. అంటే దాదాపు ఆరు రెట్లు పెరిగింది. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.38 వేల కోట్ల నుంచి రూ.3.27 లక్షల కోట్లకు చేరి దాదాపు ఎనిమిది రెట్లు వృద్ధి చెందాయి.

గత పదేళ్లలో ఈ రంగం సుమారు 25 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించడం మరో కీలక పరిణామం.భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో వచ్చిన మార్పుకు మొబైల్ ఫోన్ పరిశ్రమే అత్యుత్తమ ఉదాహరణ. 2014-15లో కేవలం రూ.18 వేల కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ ఉత్పత్తి 2024-25లో రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. ఇది ఏకంగా 28 రెట్ల వృద్ధి. 2014లో దేశంలో రెండు మొబైల్ తయారీ యూనిట్లు మాత్రమే ఉండగా, నేడు వాటి సంఖ్య 300కు పైగా ఉంది. ఏటా సుమారు 33 కోట్ల మొబైల్ ఫోన్లు భారత్‌లో తయారవుతున్నాయి. మొబైల్ ఫోన్ ఎగుమతులు కూడా రూ.1,500 కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్లకు పెరిగాయి.ఈఎస్డియం అంటే కేవలం మొబైల్ ఫోన్ల తయారీ కాదు. టెలికాం పరికరాలు, కంప్యూటర్లు, వినియోగ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ, ఏరోస్పేస్, సోలార్ ఫొటో వోల్టాయిక్ పరికరాలు, గత పదేళ్లలో ఈ రంగం సుమారు 25 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించడం మరో కీలక పరిణామం.భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో వచ్చిన మార్పుకు మొబైల్ ఫోన్ పరిశ్రమే అత్యుత్తమ ఉదాహరణ. 2014-15లో కేవలం రూ.18 వేల కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ ఉత్పత్తి 2024-25లో రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. సెమీకండక్టర్లు, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ , ఎంబెడెడ్ సిస్టమ్స్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల వరకు దీని పరిధి విస్తరించింది. విద్యుత్ వాహనాల నుంచి స్మార్ట్ కార్ల వరకు, ఆసుపత్రుల నుంచి పరిశ్రమల వరకు ఎలక్ట్రానిక్స్ కీలకంగా మారింది.ప్రపంచ కంపెనీలు తమ తయారీ సరఫరా గొలుసులను ఒక్క దేశంపై ఆధారపడకుండా విస్తరించేందుకు అనుసరిస్తున్న 'చైనా ప్లస్ వన్' వ్యూహం భారత్‌కు కొత్త అవకాశాన్ని తెచ్చిపెట్టింది. భారీ దేశీయ మార్కెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగవుతున్న మౌలిక వసతులు,ఈఎస్డియం అంటే కేవలం మొబైల్ ఫోన్ల తయారీ కాదు. టెలికాం పరికరాలు, కంప్యూటర్లు, వినియోగ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ, ఏరోస్పేస్, సోలార్ ఫొటో వోల్టాయిక్ పరికరాలు, విధానపరమైన ప్రోత్సాహకాలు భారత్‌ను అంతర్జాతీయ సంస్థలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుస్తున్నాయి. తమిళనాడు ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎగుమతుల్లో ముందంజలో ఉండగా, కర్ణాటక చిప్ డిజైన్, పరిశోధన-అభి వృద్ధిలో బలమైన కేంద్రంగా నిలుస్తోంది. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ కూడా సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాలుగా తమ స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్నాయి...అయితే ఉత్పత్తి, అసెంబ్లీ పెరగడం మాత్రమే సరిపోదు.. టెలికాం పరికరాలు, కంప్యూటర్లు, వినియోగ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ, ఏరోస్పేస్, సోలార్ ఫొటో వోల్టాయిక్ పరికరాలు, సెమీకండక్టర్లు, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ , ఎంబెడెడ్ సిస్టమ్స్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల వరకు దీని పరిధి విస్తరించింది. విద్యుత్ వాహనాల నుంచి స్మార్ట్ కార్ల వరకు, ఆసుపత్రుల నుంచి పరిశ్రమల వరకు ఎలక్ట్రానిక్స్ కీలకంగా మారింది.ప్రపంచ కంపెనీలు తమ తయారీ సరఫరా గొలుసులను ఒక్క దేశంపై ఆధారపడకుండా విస్తరించేందుకు అనుసరిస్తున్న 'చైనా ప్లస్ వన్' వ్యూహం భారత్‌కు కొత్త అవకాశాన్ని తెచ్చిపెట్టింది. భారత్ 'అసెంబ్లీ దేశం' నుంచి 'డిజైన్-ఇన్నోవేషన్ దేశం'గా మారాలి.

మొబైల్ ఫోన్లు తయారు చేయడం కంటే వాటిలో ఉపయోగించే చిప్స్, డిస్‌ప్లేలు, సెన్సర్లు, బ్యాటరీలు, ఇతర కీలక కాంపోనెంట్లను దేశీయంగా తయారు చేయడం ముఖ్యం. ముఖ్యంగా భారతీయ కంపెనీలు స్వంత సాంకేతిక పరిజ్ఞానం, పేటెంట్లు, డిజైన్లు, మేధో సంపత్తిని సృష్టించాలి. 2030-31 నాటికి 500 బిలియన్ డాలర్ల దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యం సాధించాలంటే విధాన స్థిరత్వం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, దేశీయ కాంపోనెంట్ తయారీ, సెమీకండక్టర్ సామర్థ్యం మరింత బలోపేతం కావాలి. భారత్ ఎలక్ట్రానిక్స్ విప్లవం ఇప్పటికే ప్రారంభమైంది. ఇప్పుడు ప్రశ్న ఉత్పత్తి ఎంత పెరుగుతుందన్నది కాదు.. ప్రపంచ సాంకేతికతను భారత్ ఎంతవరకు సృష్టించగలదన్నదే అసలు పరీక్ష.

### రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పేజీకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# రాయదుర్గం భూముల చిక్కుముడి వీడేనా?

హైదరాబాద్ నగరంలో భూమి విలువ కేవలం చదరపు గజాల్లో కొలవలేని స్థాయికి చేరింది. ముఖ్యంగా రాయదుర్గం, హైటెక్ సిటీ పరిసరాల్లోని భూమి దేశంలోనే అత్యంత విలువైన వాణిజ్య ప్రాంగణాల్లో ఒకటిగా మారింది. అందుకే అక్కడి ప్రతి ఎకరం వెనుక భారీ ఆర్థిక ప్రయోజనాలు మాత్రమే కాకుండా, చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ రికార్డులు, గత కేటాయింపులు, వారసత్వ పరిరక్షణ వంటి అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. ప్రస్తుతం రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1కి సంబంధించిన పరిణామాలు ప్రభుత్వ భూ నిర్వహణ తీరుపై, భూ రికార్డుల సమగ్రతపై కీలకమైన ప్రశ్నలను సమాజం ముందుకు తెచ్చాయి.

ఈ వ్యవహారాన్ని కేవలం వక్ఫ్ భూమి లేదా ప్రభుత్వ భూమి అనే రెండు పక్షాల వివాదంగా మాత్రమే చూడటం సరికాదు. ఈ భూమిపై చట్టబద్ధమైన హక్కు ఎవరిది, ఆ హక్కును నిర్ధారించే ప్రాథమిక మూల రికార్డులు ఏమిటి, ఆ ఆధారాల చట్రంలో ప్రభుత్వం వేలం నిర్వహించిందా అనే ప్రశ్నలు మౌలికమైనవి. హక్కులపై విభిన్న దావాలు ఉన్న సమయంలో వేలం ద్వారా మూడో పక్షానికి హక్కులను సృష్టించడం ఎంతవరకు సమంజసమనే చర్చ తీవ్రమవుతోంది. ఒక భూభాగంపై ఒకటి కంటే ఎక్కువ వ్యవస్థల రికార్డులు వేర్వేరు సమాచారాన్ని ఇస్తుంటే, అది పరిపాలనాపరమైన చిక్కులకు దారితీస్తుంది.

ఇటీవల తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన వేలంలో ఈ పరిసరాల్లోని భూభాగానికి ఎకరానికి రికార్డు స్థాయిలో సుమారు రూ.237 కోట్ల వరకు ధర పలికింది. అయితే ఆ భూమిలో తమకు చట్టబద్ధమైన కేటాయింపు ఉందంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 2010లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐదు ఎకరాలను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌కు కేటాయించిందని, దానికి సంబంధించిన పూర్తి సొమ్ము రూ.13.33 కోట్లు చెల్లించామని బ్యాంకు పేర్కొంది. ఈ విచారణలో తెలంగాణ హైకోర్టు వేలం తదుపరి చర్యలపై మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసింది. కేటాయించిన భూమిని నిర్ణీత ప్రయోజనం కోసం నిర్ణీత సమయంలో వినియోగించడంలో బ్యాంకు విఫలమైందని, అనేక అవకాశాలు ఇచ్చిన తర్వాతే కేటాయింపును రద్దు చేసి స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వం వాదించింది.

ఇదే సర్వే నంబరు పరిధిలో 10.63 ఎకరాల భూమిని రెండు ప్లాట్లుగా విభజించి వేలం వేసే ప్రక్రియ మరొక వివాదానికి కారణమైంది. ఈ భూమి వారసత్వ ప్రాంత పరిధిలో ఉందనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. 2003 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సర్వే నంబర్ 83లోని కొన్ని ప్రాంతాలకు చారిత్రక పరిరక్షణ హోదా ఉందని పిటిషనర్లు పేర్కొనగా, సదరు లేఅవుట్‌కు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ నుంచి, నాటి కన్జర్వేషన్ కమిటీ నుంచి క్లియరెన్స్ వచ్చిందని పారిశ్రామిక అభివృద్ధి సంస్థ వర్గాలు వివరణ ఇచ్చాయి. ఈ విరుద్ధ ప్రకటనలు హెరిటేజ్ నిబంధనల అమలులోని సమగ్రతను సైతం ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

మరోవైపు జామియా నిజామియా సంస్థ హక్కుల వాదన ఈ రికార్డుల చిక్కుముడిని మరింత పెంచింది. రాయదుర్గంలోని సుదీర్ఘమైన భూభాగానికి వక్ఫ్ సంబంధం ఉందని, పాత వక్ఫ్‌నామా, ముంతఖబ్, కితాబుల్ ఔఖాఫ్ వంటి పత్రాలు తమకు ఆధారమని సంస్థ తరపు వర్గాలు చెబుతున్నాయి. నవాబ్ ఘాజీ యార్ జంగ్ బహదూర్ కాలం నాటి ధార్మిక కేటాయింపుల ప్రకారం సర్వే నంబర్ 83లోని 510.35 ఎకరాలు జామియా నిజామియాకు చెందిన వక్ఫ్ ఆస్తిగా నమోదైందని వారి వాదన. అయితే 2022 నాటి తెలంగాణ హైకోర్టు తీర్పులో ఈ మొత్తం విస్తీర్ణంపై జామియాకు తుది యాజమాన్య హక్కులు ఖరారైనట్లు స్పష్టమైన ప్రకటన లేదు. ఆ కేసు గతంలో సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న అంశాలతో ముడిపడి ఉందని నమోదు కావడం వల్ల, ఈ వాదనను ఒక చట్టబద్ధమైన క్లెయిమ్‌గా చూడాల్సి ఉంటుంది.

ఇక్కడ ప్రాథమిక పరిపాలనా ప్రక్రియ తలకిందులైనట్లు కనిపిస్తోంది. ఒక భూమిపై చారిత్రక వక్ఫ్ నమోదు ఉందనే వాదన ఉన్నప్పుడు, లేదా గతంలో కేటాయింపు పొందిన ప్రభుత్వ రంగ బ్యాంకు దావా వేసినప్పుడు, ప్రాథమిక రికార్డుల ఆడిట్ పూర్తి చేయకుండా హడావుడిగా వేలం వేయడం వివాదాలను సంక్లిష్టం చేస్తుంది. పాత రికార్డులు, రెవెన్యూ నమోదులు, గెజిట్ ప్రచురణలు, కోర్టు ఆదేశాలను ఒకే వేదికపై ఉంచి సమగ్ర విచారణ జరపడం ప్రభుత్వాల బాధ్యత. వేలం ద్వారా మూడో పక్ష హక్కులు ఏర్పడితే, ఆ తరువాత జరిగే సుదీర్ఘ సివిల్ , పరిపాలనాపరమైన వ్యాజ్యాల్లో కొనుగోలుదారులు, ప్రభుత్వ సంస్థలు, ఇతర పక్షాలు ఏళ్ల తరబడి చిక్కుకుపోతాయి.

రాయదుర్గం వివాదం కేవలం ప్రభుత్వం, జామియా నిజామియా మధ్య పోరాటం మాత్రమే కాదు. ఇదే సర్వే నంబరు 83/1లో ప్రైవేటు వ్యక్తులు, ఇతర సంస్థలు తమ హక్కులను కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఒకే సర్వే నంబరులో విభిన్న కాలాల్లో విరుద్ధమైన కేటాయింపులు, రికార్డు నమోదులు వెలుగులోకి రావడం భూ పరిపాలనలోని లోపాలను వేలెత్తి చూపుతోంది. అత్యధిక విలువ కలిగిన భూములకు సంబంధించి రెవెన్యూ, వక్ఫ్, పారిశ్రామిక అభివృద్ధి సంస్థల వద్ద వేర్వేరు దస్త్రాలు ఉండటం వల్లనే ఈ గందరగోళం ఏర్పడుతోంది.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ అనేది భావోద్వేగాలతో, నినాదాలతో లేదా వీధి పోరాటాలతో సాధ్యమయ్యేది కాదు; అది కేవలం స్పష్టమైన చట్టబద్ధమైన ప్రక్రియలు, పక్కా రికార్డు నిర్వహణ ద్వారానే సాధ్యమవుతుంది. భూమి తమదేనని చెప్పే పాత ముంతఖబ్‌లు, వక్ఫ్‌నామాలు లేదా గెజిట్ నమోదులు ఉండటం ప్రాథమిక సాక్ష్యం మాత్రమే. అయితే ఆ పాత ఆధారాలను మాత్రమే నమ్ముకుని ఊరుకుంటే భూహక్కులు స్థిరపడవు. కాలక్రమంలో వచ్చిన రెవెన్యూ చట్టాలు, ప్రభుత్వ భూపరిమితి నిబంధనలు, డిజిటల్ భూ రికార్డులతో ఆ పాత పత్రాలను అనుసంధానించకపోతే చట్టపరంగా ఆ భూములపై పట్టు కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల ముస్లిం నాయకత్వం, వక్ఫ్ బోర్డు, సంబంధిత సంస్థలు కేవలం ఆస్తులు వేలానికి వచ్చినప్పుడో లేదా ఆక్రమణకు గురైనప్పుడో ప్రకటనలు చేయడం మాని, నిరంతర ఆస్తి పరిరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

దీని కోసం నాయకత్వం మొదటగా చేయాల్సింది తమ వద్ద ఉన్న చారిత్రక పత్రాలను నేటి ఆధునిక భూమి సర్వే మ్యాపులతో (Geo Tagging & GIS Mapping) సరిపోల్చి, ఆస్తి ఖచ్చితమైన హద్దులను డిజిటల్ రూపంలో నమోదు చేయించడం. ఆ వివరాలను ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో (ధరణి/UMEED పోర్టల్స్ వంటి అధికారిక డిజిటల్ వేదికలపై) వక్ఫ్ ఆస్తిగా అధికారికంగా నమోదయ్యేలా చట్టపరమైన ఒత్తిడి తీసుకురావాలి. మూల పత్రాలు, గెజిట్ నోటిఫికేషన్లు, రెవెన్యూ నమోదుల మధ్య ఎలాంటి తేడాలు లేకుండా పక్కాగా సరి చూసుకోవాలి. ఒకవేళ ప్రభుత్వ కేటాయింపులు లేదా వేలం ప్రక్రియలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే, ఆలస్యం చేయకుండా ప్రాథమిక రికార్డు ఆధారాలతో నిష్ణాతులైన న్యాయవాదుల ద్వారా కోర్టులలో బలమైన వాదనలు వినిపించి మధ్యంతర ఉత్తర్వులు పొందాలి. మీడియా, ప్రజల ముందుకు వచ్చినప్పుడు భావోద్వేగ వ్యాఖ్యలు కాకుండా, స్పష్టమైన సర్వే నంబర్లు, చట్టబద్ధ ఆధారాలను బహిరంగంగా ఉంచాలి. పాత రికార్డులను ఆధునిక చట్టాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, న్యాయస్థానాల్లో శాస్త్రీయంగా పోరాడడమే వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడానికి ముస్లిం సమాజం ముందున్న ఏకైక, అత్యంత సమర్థవంతమైన మార్గం. ఈ పరిణామాల్లో ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న నష్టాన్ని కూడా విశ్లేషించాల్సి ఉంది. విద్యా, వైద్య, సామాజిక సాధికారతకు ఉపయోగపడాల్సిన అనేక వక్ఫ్ ఆస్తులు సరైన నిర్వహణ, పక్కా రికార్డుల రక్షణ లేక వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సంస్థాగత నాయకత్వం వహిస్తున్నవారు భూములు వేలానికి వచ్చి చేతులు మారే దశ వరకు వేచి చూసి ప్రకటనలు చేయడం కంటే, ఆరంభంలోనే రికార్డులను సమగ్రంగా నిర్వహించడం, ప్రభుత్వ దస్త్రాలతో సరిపోల్చుకోవడం, చట్టపరమైన నివారణ చర్యలు తీసుకోవడం అవసరం. విలేకరులు లేదా మీడియా ప్రతినిధులు ప్రశ్నించినప్పుడు మౌనం వహించడం లేదా కోర్టు పరిధిలోని అంశమంటూ సమాధానం దాటవేయడం వల్ల నమ్మకలేమి పెరుగుతుంది. విచారణాధికారం లేని వక్ఫ్ బోర్డు, లోపభూయిష్టమైన నమోదుల మధ్య రక్షణ వ్యవస్థ బలహీనపడుతోంది.

దీనికి ఏకైక పరిష్కార మార్గం సమగ్ర పారదర్శక పరిశీలన మాత్రమే. ప్రభుత్వం సర్వే నంబర్ 83, 83/1కి సంబంధించిన అసలు భూ రికార్డులను, యుఎల్‌సి భూముల వివరాలను, ఎప్పుడు, ఏ చట్టం ప్రకారం భూమి స్వాధీనమైందో తెలిపే పత్రాలను, పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు బదిలీ అయిన తీరును సమగ్రంగా బహిరంగపరచాలి. అలాగే జామియా నిజామియా, వక్ఫ్ బోర్డులు తమ వద్ద ఉన్న ఒరిజినల్ ముంతఖబ్, వక్ఫ్‌నామా, సర్వే మ్యాపులు, డిజిటల్ పోర్టల్ నమోదులను అధికారిక విచారణకు ఉంచాలి.రాయదుర్గం భూముల వ్యవహారం రాష్ట్రంలోని భూ పరిపాలనా విశ్వసనీయతకు ఒక ఉదాహరణగా నిలిచింది. డిజిటల్ యుగంలో ప్రతి సర్వే నంబరుకు సంబంధించిన రెవెన్యూ, వక్ఫ్, పట్టణాభివృద్ధి శాఖల దస్త్రాలు అనుసంధానమై ఉంటే ఇలాంటి చిక్కులు వచ్చేవికావు. భూమి ప్రభుత్వానిదైతే ఆధారాలతో నిరూపించి స్పష్టత ఇవ్వాలి, వక్ఫ్ ఆస్తి అని తేలితే చట్టప్రకారం పరిరక్షణ కల్పించాలి, వారసత్వ పరిమితులు ఉంటే వాటిని అమలు చేయాలి. ప్రకటనలు, వేలం నిర్ణయాలు కాకుండా, పాత ఆధారాల సంపూర్ణ ఆడిట్,



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645

> బంధాలు బలహీనపడితే సమాజం బలహీనపడుతుంది.
> కుటుంబం బలహీనపడితే మనిషి ఒంటరివాడవుతాడు.
> మాటలు తగ్గితే మనసుల మధ్య దూరం పెరుగుతుంది.
> మానవీయత మాయమైతే నాగరికతకు అర్థమేంటి?

# మాయమైపోతున్న.. బంధాలు!

మనిషి ఒంటరిగా బతకడం కంటే.. ఒకరికి ఒకరు తోడుగా ఉండటమే ముందుగా నేర్చుకున్నాడు. అక్కడి నుంచే కుటుంబం బలపడింది. ఉమ్మడి ఇంట్లో తాత, నానమ్మ, తల్లిదండ్రులు, పిల్లలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు కలిసి ఉండేవారు. పండుగంటే ఇల్లంతా సందడి. పెళ్లంటే బంధువులంతా ఒకచోట. కష్టమొస్తే పిలవకముందే వచ్చేవాళ్లు. ఇంట్లో విషాదం చోటుచేసుకుంటే కన్నీరు పంచుకునే భుజాలు ఉండేవి. డబ్బు తక్కువైనా.. మనుషుల మధ్య ఆప్యాయత మాత్రం పుష్కలంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. చదువు, ఉద్యోగం, ఉపాధి కోసం ఊరు దాటాల్సి వస్తోంది. చిన్న కుటుంబాలు పెరిగాయి. పిల్లలు విదేశాల్లో.. తల్లిదండ్రులు స్వగ్రామాల్లో ఉండటం సాధారణమైంది. ఈ మార్పును తప్పుపట్టలేం. కానీ దూరం పెరిగేకొద్దీ అనుబంధం కూడా తగ్గిపోవడమే అసలు ఆందోళన. ఒకప్పుడు పండుగంటే ఇంట్లో అందరూ కలుసుకునేవారు. ఇప్పుడు ఫోన్‌లో ఒక సందేశం పంపితే బాధ్యత పూర్తయినట్టవుతోంది. కలిసి ఉండే ఇల్లు తగ్గింది.. కనెక్ట్ అయ్యే ఫోన్ మాత్రం పెరిగింది.సెల్‌ఫోన్ ప్రపంచాన్ని మన చేతిలోకి తెచ్చింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని క్షణాల్లో పలకరించే అవకాశం ఇచ్చింది. కానీ పక్కనే కూర్చున్న మనిషితో మాట్లాడే సమయం మాత్రం కరువవుతోంది. ఒకే ఇంట్లో నలుగురు.. నాలుగు ఫోన్లు. ఒకే భోజన బల్ల.. మాటలు మాత్రం తక్కువ. భార్యాభర్తలు ఎదురెదురుగా కూర్చున్నా చూపులు తెరపైనే. తల్లి పిలుపు కంటే ఫోన్‌లో వచ్చే శబ్దమే ముందుగా వినిపిస్తే.. మన జీవనశైలిని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిందే.పిల్లల పెంపకంలోనూ ఇదే పరిస్థితి. గోరుముద్ద తినిపించాలంటే ఫోన్‌లో బొమ్మ చూపించాలి. పిల్లతో మాట్లాడటానికి సమయం ఉండదు.. కానీ చేతిలో మొబైల్ పెట్టడానికి మాత్రం సమయం దొరుకుతుంది. పరికరం పిల్లను కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉంచొచ్చు. కానీ తల్లిదండ్రుల ప్రేమను మాత్రం భర్తీ చేయలేదు. పిల్లకు ఫోన్ ఇవ్వడం సులభం.. సమయం ఇవ్వడమే అసలు బాధ్యత.

దాంపత్య జీవితంలో విభేదాలు కొత్తవి కావు. ఒకప్పుడు కుటుంబ పెద్దలు కూర్చొని మాట కలిపేవారు. ఇప్పుడు చిన్న అపార్థం కూడా పెద్ద గోడగా మారుతోంది. హింస, వేధింపుల విషయంలో చట్టం తన పని తాను చేయాలి. బాధితులకు న్యాయం జరగాలి. అదే సమయంలో బంధం పూర్తిగా తెగిపోయే ముందు పరస్పరం మాట్లాడుకునే అవకాశం కూడా ఉండాలి. ప్రతి సమస్యకు మౌనం పరిష్కారం కాదు.. ప్రతి సమస్యకు గొడవ కూడా పరిష్కారం కాదు. అన్నదమ్ముల మధ్య ఆస్తి గీతలు.. అక్కచెల్లెళ్ల మధ్య అపార్థాలు.. బాల్యంలో పంచుకున్న అనుబంధాల కంటే పెద్దవవుతున్నాయి. ఒకప్పుడు ఒకే గిన్నెలో తిన్నవాళ్లు.. ఇప్పుడు ఒకరి ఇంటికి మరొకరు వెళ్లడానికి కూడా కారణం వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆస్తి పంచుకోవచ్చు.. కానీ అనుబంధాన్ని పంచిపెట్టలేం. బంధం పత్రాల్లో కాదు.. మనసుల్లో నిలుస్తుంది.వృద్ధుల ఒంటరితనం మరింత బాధాకరం. జీవితమంతా పిల్లల కోసం గడిపిన తల్లిదండ్రులు.. వృద్ధాప్యంలో వారి రాక కోసం ఎదురుచూస్తున్నారు. విదేశాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రుల అంత్యక్రియలకు సకాలంలో చేరుకోలేక.. వీడియో కాల్‌లో చివరి కార్యక్రమాలను చూడాల్సిన సందర్భాలు కలచివేస్తున్నాయి. సాంకేతికత ముఖాన్ని చూపించగలదు.. కానీ చివరి క్షణంలో భుజం ఇవ్వలేదు. స్వరం వినిపించగలదు.. కానీ కన్నీటిని తుడవలేదు. చివరి చూపు కూడా తెరపైనే మిగిలితే.. మన అభివృద్ధి ఏం సాధించింది?ఉపాధ్యాయుడు-విద్యార్థి బంధం విషయంలోనూ కొత్త ప్రశ్నలు ఎదురవుతున్నాయి. విద్యార్థుల మధ్య గొడవను ఆపే క్రమంలో బెత్తంతో మందలించినందుకు ఓ ఉపాధ్యాయుడిని రెండు రోజులు పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న ఘటన దీనికి ఉదాహరణగా చర్చకు వచ్చింది. ఆ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉన్నప్పటికీ.. అసలు ప్రశ్న మాత్రం మన ముందుంది. విద్యార్థులను శారీరకంగా శిక్షించడం సమర్థనీయం కాదు. అదే సమయంలో తప్పుదారి పడుతున్న పిల్లలను సరిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయుడి నుంచి పూర్తిగా తీసేయలేం. పిల్లల హక్కులను కాపాడుతూనే.. గురువు మాటకు గౌరవం, క్రమశిక్షణకు విలువ ఉండే సమతుల్యత అవసరం.అయినా మానవీయత పూర్తిగా మాయమైపోలేదు. ప్రమాదం జరిగినప్పుడు అపరిచితుడిని ఆసుపత్రికి తీసుకెళ్లే చేతులు ఉన్నాయి. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టే మనసులు ఉన్నాయి. అవసరంలో రక్తం ఇచ్చే మనుషులు ఉన్నారు. అంటే మనలోని మంచితనం ఇంకా బతికే ఉంది. దానికి కొంచెం చోటిస్తే చాలు. దానికి పెద్ద ఉద్యమాలేమీ అవసరం లేదు. రోజులో కొంతసేపు ఫోన్‌ను పక్కన పెట్టి తల్లిదండ్రులతో మాట్లాడాలి. పిల్లలతో కూర్చోవాలి. భార్యాభర్తలు ఒకరి మాట మరొకరు వినాలి. అన్నదమ్ములను పలకరించాలి. పండుగను సందేశంగా కాక.. కలయికగా మార్చాలి. పక్కింట్లో ఒంటరిగా ఉన్న వృద్ధుడిని చూసి ఒక్కసారి "బాగున్నారా?" అని అడగాలి. ఆ ఒక్క మాట కూడా ఒక మనిషికి రోజంతా తోడుగా నిలవొచ్చు.అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు, సాంకేతికత మాత్రమే కాదు. మనిషి పక్కన మనిషి నిలబడే సంస్కారం కూడా అభివృద్ధిలో భాగమే. ప్రపంచం మొత్తం ఒక తెరపైకి వచ్చినా.. ఇంట్లోని మనుషుల మధ్య మాట లేకపోతే ఆ అనుసంధానానికి అర్థం ఏముంది?కాలం మారడం సహజం.. మనసులు దూరం కావడం మాత్రం ప్రమాదం.తెరను కాసేపు పక్కనపెట్టి మనిషిని చూడాలి. సందేశాన్ని ఆపి మనసు విప్పి మాట్లాడాలి. బంధం తెగిపోయిన తర్వాత బాధపడటం కంటే.. అది తెగకముందే ఒక అడుగు ముందుకు వేయాలి. కుటుంబం నిలిస్తే సమాజం నిలుస్తుంది. మానవీయత నిలిస్తేనే మన నాగరికతకు విలువ ఉంటుంది.



శ్రీశైలం దూడం

# అన్య భాషా మాధ్యమం వద్దు... తెలుగు మాధ్యమమే ముద్దు

> తెలుగు మాధ్యమాల దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబరు 19న నిర్వహించబడుతుంది. తెలుగు మాధ్యమాలలో వాడుక భాషను విజయవంతంగా ప్రవేశ పెట్టిన తాపీ ధర్మా రావు గుర్తుగా ఆయన జన్మదినం రోజున ఈ దినోత్సవం జరుప బడుతుంది.



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమం అనివార్యమైన అవసరమని భారత రాజ్యాంగం (అధికరణం 350 ఎ), కొఠారీ కమిషన్ చెప్పింది. 2010లో భారత ప్రభుత్వం తెచ్చిన విద్యాహక్కు చట్టం విభాగం 29(2)లో ఎలిమెంటరీ స్థాయిలో వీలైనంత వరకు మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని నిర్దేశించింది. నూతన జాతీయ విద్యా విధానం (2020) కూడా ఐదవ తరగతి వరకు మాతృభాష లోనే బోధన జరగాలి అని చెబుతోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ యునెస్కో, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ డిక్లరేషన్ ఆన్ ఎడ్యుకేషనల్ ఫరాల్ (ఎఫ్ఎఫ్ఏ) జనరల్ అసెంబ్లీ లాంటి సంస్థలన్నీ పిల్లలకు ప్రాథమిక విద్యని మాతృభాషలో నేర్చుకునే హక్కుందని నిర్ధారించాయి. ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమంలోనే విద్యాబోధన చేసి 6వ తరగతి తరువాత ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ కొనసాగిస్తే ఎవరికి ఇష్టమైన మాధ్యమంలో వాళ్లు విద్యాభ్యాసం చేస్తారనేది అనేకమంది వాదన. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టీ పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికీ అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతా యని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత తాజా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# జాతీయం-అంతర్జాతీయం

## జెఎన్‌యులో శరవేగంగా కాషాయీకరణ

**దిల్లీ ,(ఏ.ఎం.ఎస్)**

భారతదేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా, ముఖ్యంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయనాలు, పరిశోధనలకు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) ప్రసిద్ధి. ఆ యూనివర్సిటీ అధ్యాపకుల నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై రిపోర్టర్స్ కలెక్టివ్ (ఆర్‌సి) ఇటీవల వెలువరించిన ఒక నివేదిక ప్రజల దృష్టిని విస్తృతంగా ఆకర్షించింది. నియామక ప్రక్రియలో నిబంధనలను దారుణంగా, ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన ఏడు ఉదంతాలను ఆర్‌సి బహిర్గతం చేసింది. అయితే, అసలు కథ ఈ ఏడు కేసులకు మాత్రమే పరిమితం కాదు, లేదా ప్రత్యేకంగా వాటికి సంబంధించినది కూడా కాదు. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన గురించి మాత్రమే కాదు, ఒక ప్రముఖ ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల నియామకాలను నియంత్రించే నిబంధనల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలను పద్ధతి ప్రకారం దెబ్బతీయడం గురించినది. ఈ ఏడు ఉదంతాలు జెఎన్‌యు లోని అధ్యాపకుల నియామక ప్రక్రియలో పాతుకుపోయిన ఒక లోతైన రుగ్మతకు కేవలం లక్షణాలు మాత్రమే. ఇది ఒక ప్రముఖ విశ్వవిద్యాలయం నాశనమయ్యే ప్రక్రియలో ఒక ముఖ్యమైన అంశాన్ని సూచిస్తుంది. నివేదించిన ప్రతి కేసులోనూ నియమితులైన వారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలలో నిర్దేశిత కనీస అర్హత షరతులను నెరవేర్చలేదనేది ఆరోపణ. ఇది కేవలం పొరపాటు కాదు. అభ్యర్థుల దరఖాస్తులు సమర్పించినప్పటి నుంచి ఎంపిక కమిటీ వారిని ఇంటర్వ్యూ చేసే వరకు జరిగిన ప్రక్రియలో, ఈ అభ్యర్థుల అర్హతకు సంబంధించిన సమస్యలు గుర్తించబడినవి. అయినప్పటికీ, వాటిని పక్కనపెట్టి, ఆ తర్వాత దరఖాస్తుదారులను వారి అర్హత కారణాలతో ఇంటర్వ్యూకు హాజరు కాకుండా నిరోధించినప్పటికీ, ఈ అభ్యర్థులను వివరించలేని విధంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అనుమతించారు. ప్రశ్న ఏమిటంటే, ఒక విశ్వవిద్యాలయ పరిపాలన కొందరు నిర్దిష్ట అభ్యర్థులను 'సర్దుబాటు' చేయటానికి ఎందుకంతగా ప్రయత్నిస్తుంది? దీనికి ఉన్న ఏకైక హేతుబద్ధమైన వివరణ ఏమిటంటే, విశ్వవిద్యాలయ అధికారులు ఈ అభ్యర్థుల పట్ల తమ ప్రాధాన్యతను ముందుగానే నిర్ణయించుకుని, వారిని ఎంపిక చేయడానికి నియామక ప్రక్రియను తమకు అనుగుణంగా మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ మార్పు ఆ తర్వాత జరిగిన ప్రక్రియకు కూడా విస్తరించింది. అనర్హులైన ఈ అభ్యర్థులు ఇతర అర్హులైన అభ్యర్థులను 'దాటుకొని', వారి వారి ఎంపిక కమిటీలకు మొదటి 'ఎంపిక'గా నిలిచేలా చేసింది. ఈ పక్షపాతం కొందరికి అనుకూలంగా, మరికొందరికి వ్యతిరేకంగా రెండు వైపులా పనిచేస్తోందని సూచిస్తుంది. జెఎన్‌యు టీచర్స్ అసోసియేషన్ ప్రకారం, 150 సందర్భాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పటికీ, ఎంపిక కమిటీలు ఎవరినీ 'నియామకానికి తగినవారు' కాదని ఎందుకు గుర్తించలేకపోయాయి. ప్రత్యేకించి అనేక రిజర్వ్‌డ్ పోస్టుల విషయంలో ఇది జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి.

నిజానికి, స్పష్టంగా ఉన్న నియమాలను దాటవేయడం కంటే, అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, వారిలో ఎవరిని ఎంపిక చేయాలో తుది నిర్ణయం తీసుకునే ఎంపిక కమిటీని వైస్ ఛాన్సలర్ స్వయంగా ఎంపిక చేసుకోవడం సులభం. అదనంగా ప్రతి ఎంపిక కమిటీకి వైస్ ఛాన్సలర్ అధ్యక్షుడిగా ఉంటారనేది వాస్తవం. కమిటీలోని ముగ్గురు విషయ నిపుణులైన సభ్యులను ఎంపిక చేసే అధికారాన్ని కూడా ఈ 'నియమాలు' వైస్ ఛాన్సలర్‌కు కట్టబెడతాయి. వారిని విశ్వవిద్యాలయ శాసనబద్ధ సంస్థలో ముందుగా ఆమోదించబడిన ఒక ప్యానెల్ నుండి ఎన్నుకోవాలి. ఈ సంస్థలకు కూడా వైస్ ఛాన్సలర్ అధ్యక్షత వహిస్తారు. ప్రస్తుతం జెఎన్‌యులో, విసి ఇప్పటికే తీసుకున్న అన్ని ని



ర్ణయాలను 'ఆమోదించడానికి' ఈ సమావేశాలన్నీ ఆన్‌లైన్‌లో జరిగి, త్వరితగతిన ముగుస్తాయి.

జెఎన్‌యు వైస్ ఛాన్సలర్‌గా ఎం.జగదీశ్ కుమార్ ఉన్నప్పటి నుండే, నియామకాలు జరగాల్సిన సంబంధిత కేంద్రా లు లేదా విభాగాల అధ్యాపకులు సిఫార్సు చేసిన పేర్లతో మాత్రమే నిపుణుల 'ఆమోదిత' జాబితాను రూపొందించే పద్ధతి ఆగిపోయింది. తద్వారా ఆ సమతుల్యతను కాపాడే విధానం తొలగించి, వైస్ ఛాన్సలర్లు (విసిలు) తమకు నచ్చి న పేర్లను ప్యానెళ్లలో చేర్చడం ప్రారంభించారు. విశ్వవిద్యాలయానికి వెలుపలి నుంచి ఉండాల్సిన విషయ నిపుణులతో పాటు, సంబంధిత కేంద్రం/విభాగం చైర్‌పర్సన్, సంబంధిత డీన్ ఆఫ్ స్కూల్స్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. అయితే, గత విసి కాలం నుంచే ఈ పదవుల్లో ఉండేవారిని విసి స్వయంగా ఎంపిక చేయడం, వారి పదవీకాలం పూర్తిగా విసి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండటం మొదలైంది. అంతకుముందు దశాబ్దాల పాటు, అర్హులైన అధ్యాపకుల సీనియారిటీ ఆధారంగా ఈ పదవులు రొటేషన్ పద్ధతిలో (వారీగా) కేటాయించబడేవి.నిపుణుల ప్యానెళ్లను ఆమోదించే, ఎంపిక కమిటీల సిఫార్సులను స్వీకరించే చట్టబద్ధమైన సంస్థలలో కూడా ఈ విభాగ అధిపతులు, డీన్‌లే అత్యధిక సంఖ్యలో సభ్యులుగా ఉంటారు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో భాగమైన 'ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్' (ఐక్యూఏసి) డైరెక్టర్ వంటి ఇతర పదవులకు కూడా విసియే నియామకాలు చేపడతారు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో వచ్చిన ఈ మార్పులన్నీ ఎంపిక ప్రక్రియపై నియంత్రణను పూర్తిగా విసి చేతుల్లోకి కేంద్రీకరించాయి. నియామకాలపై విసి తన ఇష్టాయిష్టాలను రుద్దడానికి వీలు కల్పించాయి.

నియామకాలకు సంబంధించిన ప్రస్తుత యుజిసి నిబంధనలు 2018లో జారీ చేయబడ్డాయని, ఎం. జగదీశ్ కుమార్ విసిగా ఉన్న సమయంలోనే జెఎన్‌యు వాటిని అమలులోకి తెచ్చిందని కూడా గమనించాలి. ప్రస్తుత విసి శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ లాగే, ఆయనను కూడా మోదీ ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత ఆయన యుజిసి చైర్మన్ పదవికి పదోన్నతి పొందారు. ప్రతి ఎంపిక కమిటీలోని చివరి సభ్యుడైన 'విజిటర్ నామినీ'ని కూడా ప్రభుత్వమే నియమిస్తుంది. అయినప్పటికీ, అధ్యాపకుల నియామక ప్రక్రియపై జెఎన్‌యు విసికి ఉన్న సంపూర్ణ నియంత్రణను అదుపు చేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ చర్యలు తీసుకోలేదు. పైగా నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు కూడా మౌనం వహించింది.

కొన్ని నెలల క్రితం ఒక పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యల కారణంగా జెఎన్‌యు విసిని తొలగించాలన్న డిమాండ్లను కూడా మోదీ ప్రభుత్వం తోసిపుచ్చింది. ఆ పాడ్‌క్యాస్ట్‌ల్లో ఆమె యుజిసి నిబంధనలను బహిరంగంగా ప్రశ్నించడమే కాకుండా, అత్యంత కులతత్వపూరితమైన వ్యాఖ్యలు కూడా చేశారు. జెఎన్‌యు మాజీ, ప్రస్తుత వైస్‌ఛాన్సలర్ల వ్యవహారశైలికి లభించిన ఈ మౌన ఆమోదానికి ఒకే ఒక కారణం ఉండవచ్చు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో ప్రభుత్వం కోరుకున్న విధంగానే వారు వ్యవహరించడం. విద్యాపరమైన అర్హతలు లేదా సామర్థ్యానికి బదులుగా, అభ్యర్థుల రాజకీయ సైద్ధాంతిక ధోరణి లేదా ప్రభుత్వం, జెఎన్‌యు యంత్రాంగంలోని శక్తివంతమైన వ్యక్తులతో వారికి ఉన్న వ్యక్తిగత సంబంధాలే నియామకానికి ప్రాతిపదికగా మారా యి. జెఎన్‌యులో, బోధనేతర ఉద్యోగాలు అమ్ముడుపోవడం, అవి జెఎన్‌యు యంత్రాంగంలోని వ్యక్తులకు ఆర్థిక లాభం చేకూర్చే వనరులుగా మారడం అనే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేము.

గత పదేళ్లలో జెఎన్‌యులో జరిగిన పరిణామాల ప్రాముఖ్యతను ఈ క్రింది అంశాల ద్వారా అంచనా వేయవచ్చు. జెఎన్‌యు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న వివరా ల ప్రకారం (2026 ఆగస్టు 8 నాటికి), జెఎన్‌యులోని మొత్తం 705 మంది రెగ్యులర్ అధ్యాపకులలో 322 మంది (దాదాపు 46 శాతం) ప్రస్తుత, మాజీ వైస్‌ఛాన్సలర్ల హయాంలోనే నియమితులయ్యారు. వీరిలో 189 మంది శాంతిశ్రీ పండిట్ పదవీకాలంలో (ఇది ఇంకా కొనసాగుతోంది)నియమితులైన వారే. ఈ కొత్త నియామకాలలో 246 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లలో 146 మంది, 182 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో 111 మంది ఉన్నారు. ప్రొఫెసర్ల విభాగంలో వీరి సంఖ్య సాపేక్షంగా తక్కువగా ఉంది. -మొత్తం 277మందిలో కేవలం 65 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో తక్కువ స్థాయి పోస్టుల్లో మొదట నియమితులై, ఆ తర్వాత పదోన్నతి ద్వారా ప్రొఫెసర్లుగా మారిన వారు కూడా ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే, నేరుగా ప్రొఫెసర్లుగా నియమితులైన వారి కంటే, ఈ కొత్తగా నియమితులైన వారిలో ఎక్కువమందికి విశ్వవిద్యాలయంలో సుదీర్ఘ పదవీకాలం లభిస్తుంది. 2016కు ముందు నియమితులైన వారు ఇప్పటికీ మొత్తం ప్రొఫెసర్ల సంఖ్యలో నాలుగింట మూడు వంతుల వాటాను కలిగి ఉన్నప్పటికీ, పదవీ విరమణలు, కొత్త నియామకాల కారణంగా ఆ నిష్పత్తి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఫ్యాకల్టీ నియామకాలే కాకుం డా, పదోన్నతుల ప్రక్రియ, ఈ కాలంలో నియమితులైన వారి ప్రొబేషన్ తర్వాత నియామకాలను ధృవీకరించడం వంటివి కూడా వివక్షాపూరిత సాధనాలుగా మార్చబడ్డాయి. 2016కు ముందు నియమితులైన వారిలో 100 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 71 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో చాలామంది ఇప్పటికీ అదే పదవుల్లో కొనసాగుతున్నారు. ఎందుకంటే, వారు కూడా విసి, ఆమె అధిపతుల నియంతృత్వానికి లొంగేంత వరకు వారి పదోన్నతులను నిలిపివేశారు.జెఎన్‌యు ఫ్యాకల్టీ నియామకాలలో జరుగుతున్న దానిని, గతంలో వామపక్షాలు చేశాయని ఆరోపించబడిన దానిని సరిదిద్దడం లేదా తిప్పికొట్టడమేనని బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ కూటమి సమర్థిస్తోంది. జెఎన్‌యుకు సొంత ప్రవేశ పరీక్షలు ఉండటం, వాటిలో ప్రశ్నపత్రాల రూపకల్పన, మూల్యాంకనం ఫ్యాకల్టీ చేతుల్లోనే ఉండటం వల్ల, విద్యార్థుల కూర్పును, భావజాలాన్ని కూడా ఫ్యాకల్టీయే నియంత్రిస్తోందని వారు వాదించారు. ఈ వాదనలలోని అసంబద్ధత ఇప్పుడు ప్రభుత్వ చర్యల ద్వారానే రుజువైంది. ఫ్యాకల్టీ కూర్పును మార్చడమే కాకుండా, విశ్వవిద్యాలయం సొంత ప్రవేశ పరీక్షల స్థానంలో సియుఇటి, నెట్‌లను ప్రవేశపెట్టారు.జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలో ఇప్పటికీ వామపక్షం ఆధిపత్యమే ఉంది. అంతేకాకుండా, జెఎన్‌యుకు చెందిన గత వైస్‌ఛాన్స్‌లర్‌లలో ఎవరినీ ఏమాత్రం వామపక్షవాదిగా పరిగణించలేనప్పటికీ, గత ఇద్దరు విసిలు ఆర్‌ఎస్‌ఎస్, దాని సిద్ధాంతం పట్ల తమ విధేయతను, అనుబంధాన్ని ఎన్నడూ రహస్యంగా ఉంచలేదు. వారి ఆదేశాల మేరకే అధ్యాపకుల నియామకాలు పూర్తిగా విసి నియంత్రణలోకి వచ్చాయి. స్వతంత్ర ఆలోచనను, అధ్యయనాన్ని ప్రోత్సహించే ఒక విద్యాసంస్థగా విశ్వవిద్యాలయాన్ని నాశనం చేయడానికి, దాని అధ్యాపకులను పైనుంచి వచ్చే ఆదేశాల కు విధేయులుగా మార్చడానికి మోదీ ప్రభుత్వ హయాంలో జెఎన్‌యు అధ్యాపకుల నియామకాలు ప్రధానంగా ఒక ప్రక్రియలో భాగమనే నిజాన్ని, దాని బూటకపు సమర్థన ఏదీ తొలగించలేదు.

## ఉద్రిక్తతల నడుమే కీలక పరిణామం
## ఇరాన్ నేతలకు అమెరికా వీసాలు



పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచాన్ని తీవ్ర కలవరానికి గురిచేస్తోన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. యుద్ధం వేళ.. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, ఇతర కీలక నేతలు అమెరికాలో పర్యటించనున్నారు ఆ నేతల వీసాలకు అమెరికా ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని యూఎస్ విదేశాంగశాఖ ధ్రువీకరించింది. వచ్చేవారం న్యూయార్క్ నగరంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్‌జీఏ) 81వ సమావేశాలు జరగనున్నాయి. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ( సహా ఇతర బృందం పాల్గొనేలా అమెరికా అనుమతులిచ్చింది. ''ఒక ఆతిథ్యదేశంగా మాకున్న బాధ్యతలకు అనుగుణంగా.. ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి బృందం సమావేశాల్లో పాల్గొననుంది'' అని విదేశాంగ శాఖ ప్రతినిధి వెల్లడించారు. అయితే గతేడాదితో పోలిస్తే ప్రతినిధుల సంఖ్య తక్కువగా ఉంటుందని చెప్పారు. వారిపై ప్రయాణ ఆంక్షలు ఉంటాయని, విలాస వస్తువులు, ఇతర వుస్తువుల కొనుగోలుపై నిషేధం ఉంటుందని వెల్లడించారు.

అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ కోరుకుంటోందని, అయితే అందుకు అవసరమైన షరతులను అంగీకరించడానికి మాత్రం సిద్ధంగా లేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ) వెల్లడించారు. ''మనం చేసుకుంటే మంచి ఒప్పందం చేసుకుందాం. లేకపోతే లేదు'' అని ట్రూత్ పోస్ట్ పెట్టారు. ఇదిలా ఉంటే.. ఇరాన్ ప్రతినిధులకు వీసాలు ఆమోదించిన అమెరికా.. పాలస్తీనా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందానికి మాత్రం వీసాలను తిరస్కరించింది. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం విషయంలో తమ వాగ్దానాలను నిలుపుకోవడంలో పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ సహా ఇతర ఉన్నతాధికారులు విఫలయ్యారని అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. మరోవైపు, ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశాల నేపథ్యంలో ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భద్రతా మండలిలో తిష్ఠవేసిన అగ్రదేశాలే అంతర్జాతీయ చట్టాలను ఇష్టారీతిగా ఉల్లంఘిస్తున్నాయని, అందువల్లే ఈ ఉమ్మడి వేదిక నిస్తేజంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంతర్జాతీయ వేదికను తక్షణమే సంస్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## విమానంలో ప్రయాణికుల తీవ్ర వివాదం



ఇద్దరు ప్రయాణికులు దాడి చేసుకున్న ఘటన బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ విమానంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.లండన్ నుంచి ఢాకాకు ప్రయాణిస్తోన్న విమానంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్త ఘర్షణకు దారితీసింది. ఆగ్రహంతో ఇరువురు ముష్టిఘాతాలు కురిపించుకోవడంతో ఓ వ్యక్తి షర్టు చిరిగిపోయింది. దీంతో తోటి ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. క్యాబిన్ సిబ్బంది, ఇతర ప్రయాణికులు జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అయితే ప్రయాణికుల మధ్య గొడవకు కారణం ఏంటనే విషయం తెలియరాలేదు. ఈ ఘటన నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టనున్నట్లు బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ జనరల్ మేనేజర్ మహబూబుద్దీన్ అహ్మద్ తెలిపారు.



## అణచివేత నీడలో ఉన్నత విద్య

**న్యూఢిల్లీ (ఏ.ఎం.ఎస్) :**

: భారత్‌లో విద్యా స్వేచ్ఛ మరింత క్షీణించిందని ఎస్ఏఆర్ సంస్థ అధ్యయనం వెల్లడించింది. 2026లో భారత అకడమిక్ ఫ్రీడమ్ ఇండెక్స్ (ఏఎఫ్ఐ) స్కోరు 0.14గా నమోదైంది. 2024లో ఉన్న 0.16తో పోలిస్తే తగ్గుదలను నమోదు చేయడం గమనార్హం. ఉన్నత విద్యా సంస్థల పాలన, నియామకాలు, విద్యా ప్రాధాన్యాలపై కేంద్ర ప్రభుత్వ ప్రభావం పెరుగుతోందని నివేదిక పేర్కొంది. యూజీసీని ప్రభుత్వ ప్రభావానికి ప్రధాన సాధనంగా ఉపయోగి స్తున్నారనే విమర్శలను కూడా ఇది ప్రస్తావించింది. 2025 జులై 1 నుంచి 2026 జూన్ 30 వరకు ప్రపంచవ్యాప్తంగా 59 దేశాలు, ప్రాంతాల్లో ఉన్నత విద్యా సంస్థలు, విద్యా ర్థులు, అధ్యాపకులపై 382 దాడులు జరిగి నట్టు ఎస్ఏఆర్ వార్షిక సర్వే తెలిపింది. విద్యా ర్థుల భావప్రకటనపై హింసాత్మక పోలీసు, సైనిక చర్యలు భారత్‌తో పాటు మరికొన్ని దేశాల్లో నమోదయ్యాయి.

ప్రభుత్వాల హింసాత్మక అణచివేత, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిలో జోక్యం ప్రపంచవ్యాప్తంగా అకడమిక్ ఫ్రీడమ్ క్షీణతకు ప్రధాన కారణాలని నివేదిక గుర్తించింది. ప్రభావం పెరుగుతోందని వివరించింది. అధికార బీజేపీ యూజీసీని ఉన్నత విద్యపై ప్రభుత్వ ప్రభావాన్ని చూపే ప్రధాన సాధనంగా ఉపయోగిస్తోందనే విమర్శలను నివేదిక ప్రస్తావించింది. విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ ఆర్థిక సహకారం పొందుతున్నప్పటికీ, వాటి విద్యా సంబంధ నిర్ణయాలు, పరిశోధన అంశాలు, అధ్యాపక నియామకాలు రాజకీయ జోక్యం లేకుండా సాగాల్సిన అవసరం ఉందని మేధావులు చెప్తున్నారు.స్కాలర్స్ ఎట్ రిస్క్ నివేదికలో వెల్లడి విద్యార్థుల గొంతుకకు అడ్డుకట్టక్యాంపస్‌లలో స్వేచ్ఛాయుత చర్చలను అడ్డుకునే చర్యలు చోటుచేసుకున్నాయని నివేదిక వివరించింది. అధ్యాపకుల తొలగింపులు, విద్యా కార్యక్రమాల వివాదాస్పద నిర్ణయాల ప్రస్తావనభారత్‌లో విద్యా స్వేచ్ఛపై పరిమితులకు ఉదాహరణలుగా కొన్ని ఘటనలను ఎస్ఏఆర్ గుర్తించింది. వీటిలో ఎన్‌సీ ఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో న్యాయ వ్యవస్థలో అవినీతిపై అధ్యాయం రూపొందించిన ముగ్గురు విద్యా వేత్తలపై సుప్రీంకోర్టు మార్చిలో ఇచ్చిన జీవిత కాల నిషేధ ఉత్తర్వు, తరువాత ఉపసంహరణ, విశ్వవిద్యాలయాల్లో విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల రద్దు, విద్యార్థి నిరసనలపై అధి కారుల ఒత్తిడి వంటివి ఉన్నాయి. ఈ ఘట నలు పరిశోధన స్వేచ్ఛ, భావప్రకటన హక్కు, సంస్థల స్వయంప్రతిపత్తిపై చర్చకు దారితీ స్తున్నాయని నివేదిక పేర్కొంది.

## అమెరికాలో కూలిన ఎఫ్16 యుద్ధ విమానం

హైదరాబాద్ : అమెరికాలోని మిషిగన్‌లో శిక్షణలో ఉన్న ఎఫ్ 16 యుద్ధ విమానం గురువారం కుప్పకూలింది. టెక్సాస్ ఎయిర్ నేషనల్ గార్డ్‌కు చెందిన 149వ ఫైటర్ వింగ్ విమానం ట్రావర్స్ సిటీ సమీపంలో సాధారణ శిక్షణ మిషన్‌లో ఉండగా ప్రమాదానికి గురైనట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి ముందే పైలట్ విమానం నుంచి సురక్షితంగా బయటకు దూకినట్లు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

- ప్రపంచ పటాలు పరిశీలించండి
- రోడ్డునపడుతున్న ఉద్యోగులు
- కుటుంబాలపై తీవ్ర ప్రభావం
- కార్పొరేట్ ఇండియా ఉద్యోగ మార్కెట్‌లో కటాఫ్ ?
- కృత్రిమ మేధ, ఆటోమేషన్‌తో ఉపాధికి ఎసరు

## 45 ఏండ్లకే లేఆఫ్..!

**న్యూఢిల్లీ (ఏ.ఎం.ఎస్) :**

ఇటీవల ఒరాకిల్, అడిడాస్, ఇతర ప్రముఖ కంపెనీలలో ఉద్యోగుల తొలగింపులు దేశంలోని మధ్యవయస్సు వృత్తి నిపుణులలో ఆందోళనలను తీవ్రతరం చేశాయి. ఈ సమస్య ఒక నిర్దిష్ట వయస్సుకు సంబంధించినది కాదు. ఏఐ పునర్‌వ్యవస్థీకరణ కార్పొరేట్ నియామకాలను మారుస్తున్న తరుణం లో నైపుణ్యాలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్చు కోకతప్పని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కార్పొ రేట్ ఇండియాలో 'ఉద్యోగ భద్రత' అనే భావన పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు సంవ త్సరాల తరబడి ఉండే స్థిరత్వం ఇప్పుడు లేకుండా పోయింది. ఒక్క మెయిల్‌తో ఉద్యోగులను తొలగించడమే కాదు.. వారికి వారి మేనేజర్ల నుంచి ఎలాంటి ముందస్తు హెచ్చరిక సైతం ఉండడం లేదు. 4045 ఏండ్ల వయసులో ఉన్న ఒక వృత్తి నిపుణుడికి 15 లేదా 20 సంవత్సరాల అనుభవం ఉంటుంది. వారికి సీనియర్ హోదా, అధిక జీతం , అనుభవంతో వచ్చే బాధ్యతలు కూడా ఉండవచ్చు. కానీ పునర్‌వ్యవస్థీకరణ సమయంలో అవే అంశాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి.

ఖర్చులను తగ్గించుకోవాల నుకునే కంపెనీలు యాజమాన్య శ్రేణులను తొలగిస్తున్నాయి. బృందాలను విలీనం చేయడం లేదా బాధ్యతలను చిన్న సమూహాలకు బదిలీ చేస్తున్నాయి. ఇందుకు కొన్ని పనులను ఆటోమేట్ లేదా ఏఐ సాధనాలతో నిర్వహిస్తున్నాయి.

దీంతో 45 ఏండ్ల వయస్సులో తదుపరి ఉద్యోగ కోత విధిస్తే..తమ పరిస్థితి ఏంటనే ఆందోళన ఉద్యో గుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు 'కార్పొరేట్ ఇండియా'లో 45 ఏండ్లకే 'ఉద్యోగ విరమణ' అనే చర్చ సైతం నడుస్తోంది. అయితే కంపెనీలు ఉద్యోగ కోతలకు ఒక స్థిరమైన వయస్సును నిర్ణయించాయని సూచించడానికి ఎటువంటి డేటా లేదు. కానీ 40 ఏండ్ల వయస్సులో ఉన్న నిపుణులకు, మారుతున్న ఉద్యోగ మార్కెట్ ఒక కొత్త రకమైన ఆందోళనను సృష్టిస్తోంది. అధిక జీతాలు, ఉన్నత పదవులు, తక్కువ యాజమాన్య శ్రేణులు, ఏఐ, ఆటోమేషన్ , మారుతున్న నైపుణ్య అవసరాలు అన్నీ కంపెనీలు తమ శ్రామిక శక్తిని నిర్మించుకునే విధానాన్ని పునర్నిర్మిస్తున్నాయి.

**ఒరాకిల్ తో షురూ..**

ఉద్యోగ కోతల తాజా పరంపరకు ఒరాకిల్ ఒక ప్రధాన ఉదాహరణగా నిలిచింది. ఈ కోతలు ఇప్పుడు భారతదేశానికీ చేరాయి. ప్రభావితమైన వారిలో ప్రొడక్ట్ ఇంజనీరింగ్ బృందాలూ ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. అయితే ఎంతమంది ఉద్యోగులు ప్రభావితమయ్యారనే కచ్చితమైన సంఖ్యను మాత్రం ఒరాకిల్ వెల్లడించలేదు. గత ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ వేలాది ఉద్యోగాలను తొలగించడంతో, దాని ప్రపంచవ్యాప్త ఉద్యోగుల సంఖ్య ఏడాది క్రితం సుమారు 1,62,000 ఉండగా 2026 మే 31 నాటికి దాదాపు 1,41,000కు పడిపోయింది. మారుతున్న సాంకేతికత, వ్యాపార అవసరాలు, కంపెనీలకు కావలసిన నైపుణ్యాలు, బృందాలను పునర్‌రూపకల్పన చేస్తున్నందున, కంపెనీలు ఇతర రంగాలలో వృద్ధి చెందుతున్నప్పటికీ ఉద్యోగాలను ఎలా తగ్గించగలవో ఈ ధోరణి స్పష్టం చేస్తుంది.

గింపులు అనేవి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఒక భారీ కార్మిక శక్తి మార్పులో భాగం. Layoffs.fyi డేటా ప్రకారం, సెప్టెంబర్ 10, 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా 299 కంపెనీలలోని 1,28,536 మంది టెక్నాలజీ ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఈ సంఖ్య ఇప్పటికే, 2025 సంవత్సరం మొత్తం మీద 278 కంపెనీలలో నమోదైన 1,22,606 టెక్నాలజీ ఉద్యోగ కోతలను దాటింది. దీనికి కారణాలు కంపెనీని బట్టి మారుతూ ఉంటాయి. కొన్ని కంపెనీలు పునర్‌వ్యవస్థీకరణ చేస్తున్నాయి. కొన్ని ఖర్చులను తగ్గిస్తున్నాయి. మరికొన్ని వ్యాపార ప్రాధాన్యతలను మారుస్తున్నాయి లేదా ఏఐ , ఆటోమేషన్‌లో మరింత ఎక్కువగా పెట్టుబడులు పెడుతున్నాయి.

**కుటుంబాలపై ఉద్యోగ తొలగింపు ప్రభావం**

మరో సోషల్ మీడియా ఖాతా, రెండు నెలల క్రితం ఉద్యోగం కోల్పోయినట్టుగా చెప్పిన 42 ఏండ్ల ఒరాకిల్ మాజీ ఉద్యోగి గురించి వివరించింది. ఆ వ్యక్తికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, అతని భార్యకు శస్త్రచికిత్స జరుగుతోందని తెలిపింది. జీవితంలోని ఈ దశలో నిరుద్యోగం అంటే కేవలం మరో జీతం వెతుక్కోవడం మాత్రమే కాదు. ఇది పొదుపు, గృహ రుణాలు, పిల్లల విద్య , దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలను ప్రభావితం చేయగలదు. సంవత్సరాలుగా కార్పొరేట్ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారికి, అదే స్థాయిలో అదే జీతంతో మళ్లీ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం కూడా ఒక సవాలుగా మారుతోంది.

## చమురు కంపెనీలకు ఎగుమతి పన్ను తగ్గింపు

**న్యూఢిల్లీ (ఏ.ఎం.ఎస్) :**


పెట్రోల్, డీజిల్ మరియు ఏవియేషన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)లపై ఎగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి తగ్గించింది. కొత్త రేట్లు బుధవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి.

ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు పెరిగినప్పుడు చమురు కంపెనీలు ఆర్జించే అదనపు లాభాలలో కొంత భాగాన్ని రాబట్టుకోవడానికి ప్రవేశపెట్టిన విండ్‌ఫాల్ పన్నును ఇప్పుడు మళ్లీ తగ్గించారు. సవరించిన రేట్ల ప్రకారం, డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ.25 నుంచి రూ.20కి తగ్గించారు. అదేవిధంగా, పెట్రోల్‌పై ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ.1.5 నుంచి రూ.0.5కు తగ్గించారు. జెట్ ఫ్యూయల్‌పై సుంకాన్ని కూడా లీటరుకు రూ.19 నుంచి రూ.15కు తగ్గించారు.

దేశీయ మార్కెట్లో ఇంధన ధరను తగ్గించకుండానే చమురు కంపెనీలు అదనపు లాభాలు ఆర్జించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోంది. ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరను బట్టి



ప్రతి పక్షం రోజులకు పన్నులు మారుస్తుంటారు. భారతదేశ మొత్తం ఇంధన ఎగుమతులలో 85 శాతానికి పైగా ప్రైవేట్ రంగ కార్పొరేట్ కంపెనీల ద్వారానే జరుగుతున్నాయి. కేంద్రం మరోసారి పెద్ద కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు ఇస్తూ, ఇంధన ధరల భారాన్ని కోట్లాది సామాన్య ప్రజలపై మోపుతోంది.



## టెహ్రాన్‌లో 'ఇరాన్ కోసం త్యాగం' పరేడ్

అమెరికాతో యుద్ధంలో అనేక మంది ఇరాన్ సైనికులు అమరులైనారు. వారి త్యాగాలకు జ్ఞాపకార్థంగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో 'ఇరాన్ కోసం త్యాగం' పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడిన అధ్యక్షుడు.. దేశం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇరాన్ దేశ గౌరవాన్ని కాపాడడమనేది పౌరులందరికీ చెందుతుంది. ఇందుకు ప్రజల భాగస్వామ్యం, ఐక్యత చాలా అవసరం అని పెజెష్కియాన్ అన్నారు. ప్రతీ విషయంలోనూ ఇరాన్ ప్రజలు చూపే ఐక్యతే శత్రు దేశాల కుట్రలను భగ్నం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశ భద్రత, సార్వభౌమాధికారం, ఐక్యత ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

## కొత్త గుర్తును దక్కించుకున్న దీదీ వర్గం



పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం పార్టీ పేరు ఖరారైంది. ఆమె నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరును ఎన్నికల సంఘం ఖరారు చేసింది. వీరికి ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తును కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అరుప్ రాయ్ నేతృత్వంలోని రెబల్స్ గ్రూప్‌నకు డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరుతోపాటు ఎన్వెలప్ ను చిహ్నంగా కేటాయించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అయితే, తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల రెండుగా చీలిపోవడం.. తమదే అసలైన పార్టీ అని ప్రకటించుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో పార్టీ పేరు, దాని ఎన్నికల చిహ్నమైన ''పూలు గడ్డి''ని ఉపయోగించరాదని ఇరువర్గాలకు ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. చీలిక వర్గాలు ఉపయోగించ దలచిన ఎన్నికల చిహ్నాలను, పేర్లను శుక్రవారం ఉదయం లోగా తెలియజేయాలన్న తాజాగా కొత్త పేర్లను ఖరారు చేసింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పాఠశాలల అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**నడికూడ, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. శుక్రవారం నడికూడ మండలంలోని రామకృష్ణాపూర్, కంఠాత్మకూర్ గ్రామాల్లో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి, వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులను పరిశీలించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన: జడ్పీ ఉన్నత పాఠశాలలోని 6, 8, 10 తరగతుల గదులను సందర్శించి, ఇంగ్లీష్, తెలుగు భాషలలో విద్యార్థుల చదువును స్వయంగా ప్రశ్నించి పరిశీలించారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. పాఠశాల వంటశాలను సందర్శించి మెనూ అమలు తీరును, గుడ్లు మరియు నిల్వ పదార్థాలను పరిశీలించారు. భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న సేవలు, వివో (VO) భవన నిర్మాణ పురోగతిని సమీక్షించారు.తాగునీరు, గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు లేకుండా నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరాను అందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మహ్మద్ షరీఫ్ కుంటను పరిశీలించిన కలెక్టర్, దాని పరిరక్షణ కోసం వీబీజీ రాంజీ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ అంశాలను సమీక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు పెండ్లి లక్ష్మి, కొంగంటి తిరుపతిలతో పాటు తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారులు, నవజాత శిశువుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం

**– హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు ప్రతి నెల మూడవ గురువారం వరంగల్ నగరంలో ప్రజలకు వైద్య సేవలు**

**– వివరాలు వెల్లడించిన డాక్టర్ జి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ శతాబ్ది గిరి**

**హనుమకొండ సిటీ, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**



వరంగల్ ఉమ్మడి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రుల కోసం ఒక అద్భుతమైన అవకాశం అందుబాటులోకి వచ్చిందని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ వైద్యులు జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ శతాబ్ది గిరి కార్డియాలజిస్ట్ తెలిపారు. నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్య సమస్యల నివారణార్థం ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను అందించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని యశోద క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వివరించారు. ఈ వైద్య శిబిరంలో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని వైద్య సలహాలు, సంప్రదింపులు అందించనున్నారు. ప్రతి నెల మూడవ గురువారం రోజున హనుమకొండ లో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్, డాక్టర్ శతాబ్ది గిరి వైద్యులు అందుబాటులో ఉంటారు. ఈ క్రింది సెల్ నెంబర్లను 9618328673, 9247565105 సంప్రదించగలరునవజాత శిశువుల సమస్యలు, నెలలు నిండకుండా పుట్టడం (ప్రీమెచ్యూరిటీ), పుట్టుకతో వచ్చే శ్వాసకోశ సమస్యలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంరక్షణపై ప్రత్యేక వైద్య సలహాలు, పిల్లల గుండె సంబంధిత సమస్యలు, చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, ఇతర కార్డియాక్ సమస్యల నిర్ధారణ, నిపుణులైన కార్డియాలజిస్ట్ చేత వైద్య సేవలు పొందవచ్చునని వారు తెలిపారు. వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని,

తమ పిల్లల ఆరోగ్య భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సిబ్బంది వికె రెడ్డి, చంద్రకాంత్, మహేష్, విజయ్, అనుదీప్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం



**రూ.1.50 కోట్లతో జనగామ జిల్లా రికార్డు**

**జనగామ (సెప్టెంబర్ 18):**

రాష్ట్రంలోనే తొలిసారిగా జనగామ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌లతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మొత్తం నిధులు గ్రామాల్లో భద్రత, నేరాల నియంత్రణే లక్ష్యంగా రూ. 1.50 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. ఎంట్రీఎగ్జిట్ పాయింట్లు ప్రతి గ్రామంలోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో రెండు సీసీ టీవీ కెమెరాలను అమర్చుతారు. పారదర్శకంగా టెండర్లు జి.ఓ .నెం.52 నిబంధనలకు అనుగుణంగా, ఈటెండర్ విధానం ద్వారా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతికతకు ప్రాధాన్యం కేబుల్ నెట్‌వర్క్, ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్, వీడియో వాల్స్ ద్వారా జాతీయ రహదారులు, మండల కేంద్రాల పరిసరాల్లో పటిష్ట పర్యవేక్షణ ఉంటుంది.

మండలాల వారీగా కెమెరాల కేటాయింపు మొదటి దశ

బచ్చన్నపేట - 56, నర్మెట్ట - 38, తరిగొప్పుల - 34, జనగామ రూరల్ - 167, లింగాల ఘనపురం - 54, రఘునాథపల్లి - 84, చిల్పూర్ - 42, ఘనపూర్ స్టేషన్ - 38, జఫర్‌గడ్ - 46, పాలకుర్తి - 80, కొడకండ్ల - 46, దేవరుప్పుల - 68.

ఈ సమావేశంలో డీపీఓ వెంకట్ రెడ్డి, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, పోలీసు అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలను పెంచడంలో వెదురు సాగు కీలక పాత్ర పోషిస్తుంది



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**


**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 18(వుదయం జిల్లా ప్రతినిధి):**

పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి ఉపాధి అవకాశాలను పెంచడంలో వెదురు సాగు కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. వెదురును పచ్చని బంగారంగా అభివర్ణిస్తూ, దాని సాగు వినియోగం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు వేగంగా అభివృద్ధి చెందే సహజ వనరుగా ఉండటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహద పడుతుందన్నారు.వెదురుతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా సంప్రదాయ వృత్తిదారులు, మేదర సంఘాల సభ్యులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు.వెదురు సాగును ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వెదురు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు, ఆధునిక డిజైన్‌లు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారిస్తే సంప్రదాయ వృత్తిదారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మేదర సంఘ నాయకులు గైని చంద్రశేఖర్, బూర పద్మ, చందా ప్రసాద్, కుంచనపల్లి శ్రీధర్, రాజయ్య, శంకరయ్య, సంపత్, మస్కు జయ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా మేదర సంఘ నాయకులకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇ. ఇందిర కృతజ్ఞతలు తెలిపారు.

## వాడి వేడిగా సర్వ సభ్య సమావేశం

## ప్రభుత్వ అధికారుల పనితీరుపై ప్రజాప్రతితులు ఆగ్రహం

**నర్సింహులపేట సెప్టెంబర్ 18 ( వుదయం ప్రతినిధి ):**



వేడివేడిగా సర్వసభ్య సమావేశం.ప్రభుత్వ అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించగా వివిధ గ్రామాలకు సర్పంచులు మండల ప్రభుత్వ అధికారులు హాజరై నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ అధికారుల పనితీరుపై సర్పంచులు మండిపడ్డారు. వంతడబల సర్పంచ్ బాలు నాయక్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు కలుషితమై గ్రామాలలో విష జ్వరాలు విజృంభిస్తుంటే మండలంలోని ఏ గ్రామంలోనైనా వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారా అని మండిపడ్డారు. కౌసల్యదేవుపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్తును సక్రమంగా సరఫరా చేయడంలో విద్యుత్ అధికారులు విఫలమయ్యారని బోరు, బావుల కింద వేసిన పంట పొలాలు వెండి పోతున్నాయని ఆయన భావోద్వేగంతో అన్నారు.గ్రామ పంచాయితీల విద్యుత్ పెండింగ్ బిల్లులు ఏ విధంగా కట్టాలో తెలుపగలరని గ్రామ పంచాయితీకి వచ్చే నిధుల కంటే విద్యుత్ బకాయి ఎక్కువ ఉన్నదని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికారులు పనితీరు మార్చుకొని ప్రజా ప్రతినిధులకు సహకరించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ ఎంపీడీవో అంజలి తహసిల్దార్ రమేష్ బాబు, రాంప్రసాద్, ఏవో వినయ్ కుమార్ వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేద్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**– జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

**ఎస్సీ, ఎస్టీలకు ఉచిత వైద్య సాయం!**

**ములుగు, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి) :**

తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల రోగులు 'డాక్టర్ అంబేద్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్' ద్వారా ఉచిత వైద్య సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు కోరారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పథకం అమలువుతోంది. పథకం దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదు. కవర్ అయ్యే చికిత్సలు గుండె శస్త్రచికిత్సలు, కిడ్నీ డయాలసిస్, క్యాన్సర్ కీమో/రేడియోథెరపీ, మెదడు శస్త్రచికిత్సలు, కాలేయం/కిడ్నీల అవయవ మార్పిడి, వెన్నెముక ఆపరేషన్లు. నిబంధనల ప్రకారం గరిష్ట పరిమితికి లోబడి చికిత్స వ్యయంలో 100% సహాయం అందిస్తారు. ఈ మొత్తాన్ని నేరుగా ఆసుపత్రి బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తారు. అనుబంధ ఆసుపత్రులు, ఎయిమ్స్, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, CGHS గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స పొందే వారు అర్హులు.

దరఖాస్తు విధానం:

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డులు, రోగి ఫొటోతో పాటు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ధ్రువీకరించిన చికిత్స అంచనా వ్యయం ప్రతిపాదనలను జత చేయాలి. అవయవ మార్పిడికి దాత వివరాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. చికిత్స లేదా శస్త్రచికిత్స తేదీకి కనీసం 15 రోజుల ముందుగా దరఖాస్తులను 'డైరెక్టర్, డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్, 15, జన్పథ్, న్యూఢిల్లీ-110001' చిరునామాకు పంపించాలి. పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం dosje.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## సర్ హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**



ఓటు కోల్పోయిన ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, గడువులోగా పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన విచారణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓటర్ల ధ్రువపత్రాల పరిశీలన సక్రమంగా జరిగేలా సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ధ్రువపత్రాల వివరాలను నమోదు చేస్తున్న విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ సిబ్బందితో మాట్లాడి ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కొత్తగూడెం మండలంలోని ప్రధానమంత్రి పాఠశాలగా ఎంపికైన కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ అంకిత్ సందర్శించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించిన ఆయన ఆరో తరగతి విద్యార్థులతో ఆంగ్ల పాఠ్యాంశాలను చదివించి వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో విద్యాబోధన అందించాలని, ఆంగ్లంతో పాటు అన్ని విషయాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

పాఠశాల వంటశాలను పరిశీలించిన కలెక్టర్ 160 మంది విద్యార్థులకు సిద్ధం చేసిన అన్నం, పప్పు, కూర తదితర ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ప్రధానోపాధ్యాయుడు లాలు రాథోడ్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు భరోసా కల్పించాలి

పాల్వంచ ఏరియా ఆసుపత్రిని కూడా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజారోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలు సకాలంలో రోగులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కటేశ్వరరావును ఆదేశించారు.

ఆసుపత్రిలోని పురుషుల వార్డు, మహిళల వార్డు, అత్యవసర విభాగం, రోగుల అత్యవసర సేవల విభాగం, మూత్రపిండాల శుద్ధి కేంద్రం, రక్త నిల్వ కేంద్రం, శస్త్రచికిత్స గది తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. అంతర్గత రోగుల విభాగంలోని రికార్డులను పరిశీలించి, జ్వరంతో బాధపడుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 17 మంది జ్వర బాధితులను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఆసుపత్రిలోని ఒక పడకపై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 80 పడకలు అందుబాటులో ఉన్నాయని, మరో 50 పడకలు మంజూరు చేయాలని సూపరింటెండెంట్ కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందిస్తూ ప్రభుత్వ వైద్యంపై భరోసా కల్పించేలా సేవలను మరింత విస్తృతం చేయాలని వైద్యాధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జూలూరుపాడు మండలానికి చెందిన కొంతమంది రోగుల కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి, మండలంలో మూత్రపిండాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఆసుపత్రి ఆర్ఎంఓ సోమరాజు దొర, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చండూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

**చండూరు, సెప్టెంబర్ 18 (వుదయం):**



ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు అంకితభావంతో పని చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. చండూరు పోలీస్ స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, సీసీటీవీల పనితీరు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి మరియు పోలీసు సేవలపై ఆయన క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు.బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా, నాణ్యమైన దర్యాప్తుతో పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ సూచించారు. రౌడీషీటర్లు, అలవాటు పడిన నేరస్థులు, అనుమానితులపై కఠిన నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత తీవ్రతరం చేయాలని స్పష్టం చేశారు. అలాగే మాదకద్రవ్యాల అక్రమ రవాణాను గట్టిగా అరికట్టడంతో పాటు, రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని నొక్కి చెప్పారు.పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని అడిగి తెలుసుకున్న ఎస్పీ, చండూరు పరిధిలో శాంతిభద్రతలు, ప్రజాభద్రతను కాపాడేందుకు అధికారులు, సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## ఫిరాయింపుల ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు



**దానం నాగేందర్ అనర్హతపై తీర్పు.. ఇకనైనా ప్రజాతీర్పును గౌరవించాలి.**

**ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఇదే గుణపాఠం:**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**పర్వతగిరి సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**

సత్యమేవ జయతే.. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న విధానానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి.. అనంతరం కాంగ్రెస్‌లో చేరి, అదే పార్టీ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు కీలక పరిణామమని దయాకర్‌రావు అన్నారు. అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టిందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ఈ తీర్పు వచ్చిందని తెలిపారు.

ప్రజాతీర్పును అవమానిస్తే చట్టం చూస్తూ ఊరుకోదు

ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి ప్రజల ఓట్లతో గెలిచిన తర్వాత పార్టీ మారడం ప్రజాతీర్పును అవమానించడమేనని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని విమర్శించారు.“పార్టీ మారితే పదవులు పదిలంగా ఉంటాయని భావించే వారికి హైకోర్టు తీర్పు స్పష్టమైన సందేశం. ప్రజలు ఇచ్చిన తీర్పును తేలిగ్గా తీసుకుంటే న్యాయస్థానంలో సమాధానం చెప్పాల్సిందే” అని అన్నారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోందని, ఈ తీర్పు నేపథ్యంలో ఆయా కేసుల్లో చట్టపరమైన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని దయాకర్‌రావు పేర్కొన్నారు.

ఇకనైనా ఫిరాయింపులకు ఫుల్‌స్టాప్ పెట్టాలి

పార్టీ ఫిరాయింపులతో అధికారాన్ని బలోపేతం చేసుకోవచ్చనే ధోరణిని కాంగ్రెస్ ప్రభుత్వం విడనాడాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

“హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి న్యాయస్థానాలు అండగా నిలుస్తాయని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది” అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి 22A నుంచి తప్పించుకోలేవు

## దొరికిన దొంగవు నువ్వు!

**మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సంచలన ఫైర్**



**సూర్యాపేట, సెప్టెంబర్ 18, (వుదయం ప్రతినిధి):**

సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. "రేవంత్… ఎన్ని డ్రామాలు చేసినా 22A నుంచి తప్పించుకోలేవు. ఇతరులపై ఆరోపణలు చేసి తప్పించుకోవాలనుకోవడం తెలివితక్కువ వేషాలు. 22A పై ప్రజల నుండి శిక్ష తప్పదు. నిండు శాసనసభలో అబద్ధాలు చెప్పి దొరికిన దొంగ రేవంత్!"

"దమ్ముంటే మమ్మల్ని శాసనసభకు అనుమతించి చర్చ పెట్టాలి. మమ్మల్ని బయటకు పంపి బ్యాట్స్ మెన్ లేకుండా బౌలింగ్ చేస్తున్నావ్. మాకు అవకాశం ఇచ్చి చూడు.. అసెంబ్లీలో సిక్సులతో బౌండ్రీల మోత మోగిస్తాం!"

ఎర్రవల్లి భూములపై ఫైర్:

ఎర్రవల్లి భూముల సర్వేలో రేవంత్ ప్రభుత్వానికి దళితుల నుండి చుక్కెదురైంది. కెసిఆర్ దగ్గర ఏందో చేస్తామని నోటికొచ్చినట్టు వాగితే తగిన శాస్తి జరిగింది. డ్రామా పొడిగింపు కోసమే ఎమ్మెల్యేలు, ఎంపీలను పంపుతామంటున్నారు. 22A భూ బాధితులు రేవంత్ వెంట పడటం ఖాయం!" "కాలయాపన, డైవర్షన్ చేయడానికే హైలెవెల్ కమిటీ. రేవంత్ ఆయన కుటుంబ సభ్యులు విలువైన భూములన్నీ గుంజుకుంటున్నారు. రకరకాల పేర్లతో తోడేళ్ళలా జనాన్ని భయపెట్టి 30%, 40% భూములు లాగేసుకుంటూ దందా చేస్తున్నారు!"

"సాగర్ రైతులు ఇప్పటికైనా మేల్కోవాలి! మన జిల్లా మంత్రుల చేతగానితనం అందరికీ అర్థమైంది. ఎడమ కాలువ రైతులను అన్యాయం చేస్తూ ఈఎన్సీ స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చింది. తూములన్నీ బంద్ పెట్టమని ఆర్డర్ ఇవ్వడంలో ఆంతర్యం ఏంటి?

ఇక్కడ రైతులను ఎండబెట్టి ఖమ్మం వైరాకు నీటిని పంపే కుట్ర! ఇరిగేషన్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఈఎన్సీ ఉత్తర్వులు అని రాసుకోవడం సిగ్గుచేటు!" ఒక్క ఎకరం ఎండినా ఆ బాధ్యత పూర్తిగా ఉత్తమ్, కోమటిరెడ్డిలదే. పొలాలు ఎండబెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. రైతుల పక్షాన పోరాటం చేసి పంటలను బ్రతికిస్తం !"ఎల్నినో పేరిట డ్రామాలాడి నీటిని ఆంధ్రాకు పంపుతున్నావ్. సాగునీరు, కరెంట్, తాగునీరు పై పట్టింపు లేదు, సర్వేల పేరుతో డైవర్షన్ చేస్తున్నరు. నువ్వు కాదు.. మేము ఇన్నింగ్స్ మొదలుపెడతాం..

ఎవర్నీ వదిలిపెట్టం.. మీ భూ బాగోతాలు మొత్తం బయటపెడతాం!" అంటూ జగదీష్ రెడ్డి ఘాటుగా హెచ్చరించారు.

## జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వకపోవడం దారుణం

## సీపీఐ ఎంఎల్‌సీ నెల్లికంటి సత్యం



**నల్లగొండ,సెప్టెంబరు 18(వుదయం):**

సమాజంలో ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులకు సొంతింటి కలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని సీపీఐ ఎంఎల్‌సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (TUWJ IJU) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ...

సమాజంలో నాలుగో స్తంభంగా ఉంటూ, పగలు రాత్రి తేడా లేకుండా ప్రజా సమస్యలను వెలికితీసే జర్నలిస్టులు సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన ప్రతి విలేకరికి ఇంటి స్థలం కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, ఈ విషయాన్ని శాసనమండలిలో కూడా లేవనెత్తుతానని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో TUWJIJU జిల్లా నాయకులు, యూనియన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వరంగల్ జిల్లా సెప్టెంబర్ 18(వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, పారిశుధ్యం తదితర పనుల పురోగతిని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. అందువల్ల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు రాం కుమార్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (జె డబ్ల్యూ ఎం సి) రాజకుమార్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఆనందం, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, ఆర్డీఓ సుమ, ఎల్అండ్‌టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సర్వాణన్, తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## స్టెనో టైపిస్ట్ ఒక్క ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 18(వుదయం ప్రతినిధి):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ లో ఖాళీగా ఉన్నటువంటి స్టెనోటైపిస్ట్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ చైర్ పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే.జీవన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ తో పాటు స్టెనోగ్రఫీ అర్హత వున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18.09.2026 నుండి 28.09.2026 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు వారు తెలిపారు. నిరుద్యోగులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని వెల్లడించారు. పూర్తి వివరాలు కోసం జిల్లా ఈ కోర్టు భూపాలపల్లి వెబ్సైటు ను చూడవలిసిందిగా వారు సూచించారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



### నిమజ్జన ఏర్పాట్లపై

## అధికారుల నజర్

- పెన్‌గంగా, చాందా-టి వద్ద కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్ల పరిశీలన

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**
గణేశ్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులతో కలిసి పెన్‌గంగా నది తీరం, చాందాటి వద్ద పర్యటించి ఘాట్ల వద్ద భద్రత, విగ్రహాల నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారీ గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేక క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు నదిలో భద్రత కోసం డైవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.
ప్రజలు, భక్తులు పోలీసులకు సహకరించి నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. పరిశీలనలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక భరోసా

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- హార్టికల్చర్ శాఖ సబ్సిడీకి అదనంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఆర్థిక సహాయం
- 1 నుంచి 5 ఎకరాల భూమి కలిగిన అర్హులైన మహిళా రైతులకు అవకాశం
- అంతర పంటల సాగుతో మొదటి నాలుగేళ్లలోనూ ఆదాయం పొందే అవకాశం

**పెద్దపల్లి, సెప్టెంబర్-18 (వుదయం ప్రతినిధి)**
పెద్దపల్లి జిల్లాలోని ఒంటరి మహిళా రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించి, వారి జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.హార్టికల్చర్ శాఖ ద్వారా ఆయిల్‌పామ్ మొక్కలు, అంతర పంటలు, డ్రిప్ పరికరాలపై నాలుగు సంవత్సరాలకు గాను ఎకరానికి రూ.16,800 రాయితీ అందించబడుతుందని తెలిపారు. దీనికి అదనంగా రైతు వాటాగా చెల్లించాల్సిన మొత్తం లేదా రైతుకు అదనంగా అయ్యే ఖర్చును జిల్లా యంత్రాంగం ప్రత్యేక సహాయం కింద భరించనున్నట్లు పేర్కొన్నారు.భర్తను కోల్పోయిన లేదా ఇతర



కారణాలతో ఒంటరిగా జీవిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన మహిళా రైతులు, 1 ఎకరం నుంచి 5 ఎకరాల వరకు భూమి కలిగి ఉన్న వారు ఈ అదనపు ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు.అర్హత కలిగిన మహిళా రైతులు తమ గ్రామంలోని హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (HEOs), హార్టికల్చర్ అధికారులు (HOs), ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాల (SHGs) ద్వారా లేదా ఐడీఓసీలోని జిల్లా హార్టికల్చర్ అధికారి కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.ఆయిల్‌పామ్ మొక్కలు పక్వానికి వచ్చే మొదటి నాలుగు సంవత్సరాల్లో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూరగాయలు వంటి పంటలను సాగు చేసుకోవడం ద్వారా రైతులు తరచుగా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ దిగుబడికి వచ్చిన అనంతరం నాలుగో సంవత్సరం నుంచి ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2.00 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒంటరి మహిళా రైతులు తమకు ఉన్న భూమిని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల సాగు ద్వారా స్థిరమైన ఆదాయం పొందుతూ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్నదే ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు.అర్హులైన మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగు ద్వారా తమ కుటుంబ జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## విప్ ఆది శ్రీనివాస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా,సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి)**
రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో శుక్రవారం ఆది శ్రీనివాస్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో మరింతగా కొనసాగుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా పాలనకు ఆయన తన వంతు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆది శ్రీనివాస్‌కు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## సచిన్ సవంత్‌కు.. ఆడే గజేందర్ ఘన స్వాగతం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**
ఆదిలాబాద్‌లో RGPRS ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సవంత్‌కు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, RGPRS జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సచిన్ సవంత్‌ను శాలువాతో సన్మానించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్‌లకు గ్రామ పాలన, స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, RGPRS ప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్...

- ఉన్నత స్థాయి అధికారులు యండి గణపతి రెడ్డి సిఈ లక్ష్మారెడ్డి తో కలిసి స్థల పరిశీలన...
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

**జగిత్యాల సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయగా జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి శివారులో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ శుక్రవారం సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు యండి గణపతి రెడ్డి సిఈ లక్ష్మారెడ్డి ప్రజా ప్రతినిధులతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను స్థలాన్ని పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి భోజనం క్రీడలు నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడం ముఖ్య ఉద్దేశం అన్నారు 2500 మంది విద్యార్థులకు 300 మంది స్టాఫ్ కు ఆధునిక విద్యా సదుపాయాలు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య హాస్టల్ భోజనం వంటి వసతి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించబోతుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు అధికారులు సైట్ ఇంజనీర్లతో మాట్లాడి యండి గణపతి రెడ్డి ఆలోచనకు అనుగుణంగా జి+3 లో నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు క్రీడా మైదానం పాఠశాల బ్లాక్ వసతి గృహాలు నిర్మాణ స్థలాన్ని సంబంధిత మ్యాప్ ను పరిశీలించారు కొందరు సీనియర్ నాయకులు కావాలని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మోరం అమ్మే అవసరం ఎవరికి లేదని అభివృద్ధి పనులకు అడ్డం పడవద్దని హితవు పలికారు ఇందిరమ్మ రాజ్యంలో 2008 లో అర్బన్ హౌసింగ్ కాలని లో ఇండ్లు ఇస్తే ఇప్పటి ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 8నెలల్లో ఒక్కరు ఒక్క కరెంట్ కనెక్షన్ తీసుకోలేదని వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు





నేడు 1500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్ ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి కట్ట రాజేందర్ నోముల శేఖర్ రెడ్డి తహసీల్దార్ హాకీం ఏఈ శశి
జగిత్యాల అసెంబ్లీ కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు కర్నె భూమరెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముఖీద్ అబ్బూరి మల్లేశం గౌడ్ నలువాల సురేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి సదానందం స్వామి రెడ్డి తంగెళ్ల రమేష్ ఏనుగు మల్లారెడ్డి శేఖర్ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కామారెడ్డి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్
- వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న షబ్బీర్ అలీ
- పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**కామారెడ్డి, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):-**
కామారెడ్డి పట్టణంలోని 15, 16వ వార్డుల్లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా వార్డుల్లో ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
అనంతరం 15, 16వ వార్డుల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు, ముఖ్యంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణ అభివృద్ధి నా వ్యక్తిగత బాధ్యత. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తాను.అభివృద్ధి అనేది కేవలం పెద్ద ప్రాజెక్టులతోనే కాదు.. ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు మెరుగుపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అని అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేసిన సమయంలో ఈ ప్రాంత ప్రజలతో ఏర్పడిన అనుబంధం కారణంగా కామారెడ్డి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని షబ్బీర్ అలీ తెలిపారు. కామారెడ్డి ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇచ్చిన ప్రేమ, ఆదరణను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు. అందుకే కామారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, చెరువుల అభివృద్ధి, విద్య, వైద్యం, క్రీడా



మౌలిక వసతులు వంటి అనేక రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం అని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందని షబ్బీర్ అలీ అన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, అర్హులైన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు ఇచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం కలిగేలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతులకు మద్దతు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నాం. పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, విద్యా-వైద్య రంగాల బలోపేతం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు అని షబ్బీర్ అలీ అన్నారు.కామారెడ్డి పట్టణానికి అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం వద్ద నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డుల్లో



ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను మా దృష్టికి తీసుకురావాలి. ప్రజల మధ్యకు వచ్చి సమస్యలను తెలుసుకోవడం, వాటికి పరిష్కారం చూపించడం మా బాధ్యత. 15, 16వ వార్డుల్లో ప్రారంభించిన ఈ అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు..అని అధికారులకు సూచించారు.కామారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు.కామారెడ్డి అభివృద్ధి ఆగదు.. ప్రజల సమస్యల పరిష్కారం ఆగదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కామారెడ్డిని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పనిచేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్లు ప్రియాంక సంతోష్, వనిత రామ్మోహన్, కౌన్సిలర్లు అంజాద్, వాజీద్, మజీద్, సిద్ధికి, గణేష్, చిట్టిబాబు, భూపతి, సత్యం, సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, పండ్ల రాజు, అశోక్ రెడ్డి, మోహన్ రెడ్డి, వైద్య కిషన్, నౌసిలాల్, గణేష్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, మాజీ గ్రంధాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్, వార్డ్ ప్రజలు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS

**నిర్మల్ జిల్లా 18 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**
అబ్దుల్లాపూర్‌లో మోక్ష (కర్ర) గణపతి, మాటేగాంలో స్వయంభూ కొరడి గణపతిని దర్శించుకున్న జిల్లా ఎస్పీనిర్మల్ జిల్లా అబ్దుల్లాపూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన మోక్ష (కర్ర) గణపతిని శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామానికి చేరుకున్న జిల్లా ఎస్పీకి గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానించి, మోక్ష (కర్ర) గణపతి ప్రత్యేకతలను వివరించారు.గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో కలిసి ఒకే ఒక్క గణపతిని ప్రతిష్టించి, ఎలాంటి డీజేలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా గణేష్ ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తూ సోదరభావం, ఐక్యతను చాటుతున్నామని గ్రామ పెద్దలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మోక్ష (కర్ర) గణపతిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న విధానం అభినందనీయమని తెలిపారు. గణేష్ ఉత్సవాలను శోభాయమానంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తూ పోలీసులకు సహకరిస్తున్న అబ్దుల్లాపూర్ గ్రామ ప్రజలను జిల్లా ఎస్పీ అభినందించారు.అనంతరం జిల్లా ఎస్పీ గ్రామ ప్రజలతో కలిసి సెల్ఫీ తీసుకుని, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.



మాటేగాంలో స్వయంభూ కొరడి గణపతి దర్శనంతదుపరి జిల్లా ఎస్పీ మాటేగాం గ్రామంలోని స్వయంభూ కొరడి గణపతి దేవాలయాన్ని దర్శించుకుని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత, గణపతి ప్రత్యేకతలను స్థానికులు జిల్లా ఎస్పీకి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPSతో పాటు భైంసా ASP సాయి కిరణ్, IPS, CIలు రవీందర్ నాయక్, మల్లేష్, , ప్రవీణ్, WSI సుప్రియ, SI ప్రదీప్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్య సంస్థలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల /చెన్నూర్ సెప్టెంబర్ 18(వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.
అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ రాఘవేంద్ర తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులముల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి భవనం శిథిలావస్థలో ఉన్నందున నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో గల జి. పి. కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన హియరింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో స్పష్టంగా ఉండేలా జాబితా రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా చెట్లు నరికితే కఠిన చర్యలు

- అటవీ శాఖ అధికారి బాలమణి.

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి)**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం, అటవీ ఉత్పత్తులను అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీమతి సిహెచ్ బాలమణి అన్నారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు వర్షపాతం, భూగర్భ జలాల సంరక్షణ, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్క చెట్టును నరికివేయడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా, వన్యప్రాణుల నివాస ప్రాంతాలపై కూడా ప్రభావం పడుతుందని



పేర్కొన్నారు.అటవి శాఖ అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం, కలపను అక్రమంగా రవాణా చేయడం, నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు.
అక్రమంగా చెట్లు నరికివేస్తున్నట్లు గమనించినట్లయితే సమీపంలోని అటవీ శాఖ కార్యాలయం లేదా సంబంధిత అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ అటవీ సంపదను సంరక్షించడంలో అటవీ శాఖకు సహకరించాలని జిల్లా అటవీ శాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

## మహిళ శక్తి ఉత్సవ్ ..పాల్గొన్న అదనపు కలెక్టర్



**నిజామాబాదు, ,సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**
నిజామాబాద్ నగరంలోని కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన Women Acceleration Programme - "District Mahila Shakti Utsav" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు పాల్గొన్నారు ,
ఈ సందర్భంగా ఈ నెల 27న నిర్వహించనున్న ఉల్లాస్ కార్యక్రమం లో 31,702 నిరక్షరస్యులని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుటకు FLNAT/NIOS పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ACLB భుజంగరావు సమీక్షించారు. అభ్యాసకుల సమీకరణ, పరీక్షకు హాజరు, లక్ష్య సాధన మరియు పరీక్షను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు మరియు ఫీల్డ్ సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లాకి కేటాయించిన 31,702 లక్ష్యాన్ని సాధించే విధంగా అందరు కృషి చెయ్యాలి అని సూచనలు జారీ చేశారు.

### గునుకులపల్లి చిగురుమామిడి రోడ్డు మార్గం

## పరిశీలించిన కలెక్టర్

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

**కరీంనగర్ ,సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**
చిగురుమామిడి మండల కేంద్రం నుంచి గునుకులపల్లి వరకు లంబాడి పల్లి మీదుగా నిర్మించే ఇంటర్మీడియట్ రోడ్డు(5.5 మీటర్లు) మార్గాన్ని శుక్రవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, కరీంనగర్ ఆర్డీఓ షర్మిలతో కలిసి పరిశీలించారు. ఏడున్నర(7.5)కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఇందులో ఆరున్నర (6.5)కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి హ్యామ్ పథకం కింద నిధులు మంజూరవగా ఈ ప్రక్రియ టెండర్ దశలో ఉంది.మిగతా ఒక కిలోమీటర్ మేర రోడ్డు నిర్మించేందుకు ఈ రూట్ ను గ్రామాల వారీగా కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ కనకయ్య, ఇంజనీరింగ్ అధికారులు జనార్ధన్ ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్



అధికారులను ఆదేశించారు.గునుకులపల్లి చిగురుమామిడి వరకు లంబాడి పల్లె మీదుగా నిర్మించే ఈ రోడ్డుఇందుర్తి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి గ్రామాలను కలుపుతుంది.ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గనుంది.వారి వెంట డీపీఆర్ఈ జనార్ధన్, పీఆర్ ఏఈ నిరంజన్ తదితరులున్నారు.

## జుక్కల్ సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

- లెండి, నాగమడుగు ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి..
- లెండికి రూ.106 కోట్లు, నాగమడుగుకు రూ.3.66 కోట్ల పెండింగ్ నిధుల ప్రస్తావన..
- వైద్య సిబ్బందికి డిజిటల్ అటెండెన్స్ అమలు చేయాలని కోరిన ఎమ్మెల్యే

**నిజాంసాగర్ సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి):**
జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శుక్రవారం శాసనసభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గానికి కీలకమైన లెండి అంతర్రాష్ట్ర ప్రాజెక్టు, నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. లెండి ప్రాజెక్టుకు అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేయడంతో పాటు నాగమడుగు ప్రాజెక్టుకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ వైద్య సిబ్బంది హాజరును క్రమబద్ధీకరించేందుకు డిజిటల్ లేదా బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

### లెండి ప్రాజెక్టుకు రూ.106 కోట్లు



ఎనభైవ దశకంలో ప్రారంభమైన లెండి అంతర్రాష్ట్ర ప్రాజెక్టు పనులు చాలా కాలంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే సభలో పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తి చేసిందని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి నిధులు అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.106 కోట్లను మహారాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ఆ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సభ దృష్టికి తీసుకెళ్లారు. లెండి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కూడా .475 కోట్ల అవసరమైన ఫీజు చెల్లిస్తే కొత్త డిజైన్లను అందించేందుకు ఐఐటీ రూర్కీ సిద్ధంగా ఉందని సభలో వివరించారు. డిజైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నాగమడుగు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### వైద్య సిబ్బందికి డిజిటల్ అటెండెన్స్

జుక్కల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సేవల సమస్యను కూడా ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో నియోజకవర్గంలో వైద్య సిబ్బంది కొరత ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అవసరమైన మెడికల్ స్టాఫ్ అందుబాటులోకి వచ్చారని తెలిపారు. అయితే వైద్య సిబ్బంది హాజరును క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది సమయానికి విధులకు హాజరయ్యేలా బయోమెట్రిక్ లేదా డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఎమ్మెల్యే కోరారు.జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, వైద్య సేవల సమస్యలను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శాసనసభ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. లెండి ప్రాజెక్టుకు అవసరమైన రూ.106 కోట్ల నిధులు, అనుమతులు, నాగమడుగు ప్రాజెక్టుకు సంబంధించిన రూ.3.66 కోట్ల పెండింగ్ నిధులతో పాటు ఐఐటీ రూర్కీ డిజైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అలాగే వైద్య సిబ్బంది హాజరును పర్యవేక్షించేందుకు డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## మారుమూల ప్రాంతాలకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 18 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలోని ప్రతి మారుమూల ప్రాంతానికీ మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించాలని, నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు జిల్లా వ్యాప్తంగా కమ్యూనికేషన్ విస్తరణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సబ్ కలెక్టర్ [illegible], అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.నల్లమల్ల, కలెక్టరేట్, మారుమూల చెంచు గిరిజన ప్రాంతాల్లో 4జీ సాచురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి నెట్ వర్క్ సేవలు మెరుగుపరచాలని సూచించారు. టవర్ల ఏర్పాటు వల్ల వన్య ప్రాణులకు ఇబ్బంది కలగకుండా అటవీ నిబంధనలు పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భూసేకరణ, అనుమతుల ప్రక్రియను అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వేగవంతం చేయాలని, టవర్ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సేవలు, డిజిటల్ సేవలు ప్రజలకు సులభంగా అందుతాయని తెలిపారు.సమావేశంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు వాసు మణికంఠ, సుధీర్, సురేష్ నరసయ్య, సూపరింటెండెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు ఆధారిత వృత్తులను ప్రోత్సహించాలి

- ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన అదనపు కలెక్టర్లు సంగీత ,పాండు .

**సంగారెడ్డి, సెప్టెంబర్ 18. వుదయం**



: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువుల ప్రదర్శనను అదనపు కలెక్టర్లు తిలకించారు. వెదురు ఉత్పత్తుల తయారీ, వాటి వినియోగం, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో వెదురు మొక్కలు, వెదురు ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు వెదురు ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు వెదురు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మేదర సామాజిక వర్గానికి చెందిన అనేక మంది వెదురు ఆధారిత వృత్తిని జీవనాధారంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ వృత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. వెదురుతో వివిధ రకాల ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందించడం ద్వారా మరింత ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వెదురు ఉత్పత్తుల తయారీకి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అదనపు కలెక్టర్లు అన్నారు. విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కాలానుగుణంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ. జగదీష్,అదనపు డి ఆర్ డి ఓ బాల్ రాజ్,మాజీ మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి రవి, మేదర మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, జిల్లా కోశాధికారి పులి రాజేష్ కుమార్, నాయకులు అంజనేయులు, రమేష్, నరేందర్, ప్రమోద్ కుమార్, సాయి మల్లేష్, శ్రీలత, జగదాంబ, సంతోష్, రజిని, మమత, భిక్షపతి, సిబ్బంది, మేదర సామాజిక వర్గ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా సమీక్షా సమావేశం



**వనపర్తి సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి)**

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించడం అధికారుల బాధ్యత : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సామాజిక, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు.శుక్రవారం వనపర్తి జిల్లాకు విచ్చేసిన ఆయనకు కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలకగా, పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు శాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తూ ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు చట్ట ప్రకారం వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, విద్యా, ఉపాధి పథకాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు, పబ్లిక్ స్కూళ్లలో సీట్లు, ఉన్నత విద్య, విదేశీ విద్యకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, భూమి ఆధారిత పథకాలు, ఇతర సంక్షేమ పథకాల వివరాలను అర్హులైన వారికి తెలియజేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలని సూచించారు.

**రిజర్వేషన్లు, రోస్టర్ విధానం పక్కాగా అమలు చేయాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ విధానం, రిజర్వేషన్ రిజిస్టర్లను నిబంధనల ప్రకారం నిర్వహించాలని చైర్మన్ ఆదేశించారు. రిజర్వేషన్ల అమలులో ఎలాంటి అవకతవకలకు, అన్యాయానికి అవకాశం లేకుండా జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించేలా అధికారులు పర్యవేక్షించాలని, నిధులు పక్కదారి పట్టేందుకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా నిధులను ఇతర సాధారణ అవసరాలకు లేదా సంబంధం లేని కార్యక్రమాలకు మళ్లించి ఖర్చు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన నిధులు పక్కదారి పడితే సంబంధిత అధికారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, నిధుల వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి కేటాయించబడే నిధులు, పథకాల ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా నిధులను సక్రమంగా వినియోగిస్తూ, అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులను సూచించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నియామకాల్లో ఎస్సీలకు కూడా తగిన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు, రక్షణ కల్పించడంతో పాటు వారికి జీతాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్మికులకు సంబంధించి ఏవైనా పెండింగ్ బకాయిలు ఉంటే వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

జిల్లాలో అటవీ భూములకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రితో సమావేశం ఉన్నందున, జిల్లాలోని అటువంటి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చైర్మన్ సూచించారు. ఆయా సమస్యలను సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వనపర్తిలో అంబేద్కర్ కళాభవనం ఏర్పాటు చేయాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపడతామని తెలిపారు.

జిల్లాలో స్వంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను సేకరించి, కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు, నివేదికలను సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వి బి జి రామ్ జి కింద కొత్త భవనాలు మంజూరయ్యేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత నిధుల ద్వారా నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి నెల తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఇందులో తహసీల్దార్లతో పాటు ఎస్ఐలు, ఇతర సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు, కేసుల పురోగతిని సమీక్షించాలని తెలిపారు.సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మణ్, రాంబాబు నాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్, సామాజికవేత్త గంధం నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గణిత శాస్త్రంలో కందుల రజనికి పీహెచ్.డీ.

**పటాన్చెరు (వుదయం):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కందుల రజని డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'సమీప బీజ గణితాలలో రఫ్ సెట్ల సిద్ధాంతానికి చేసిన కృషి'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. నరసింహస్వామి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.అనిశ్చితి, అసంపూర్ణ సమాచారాన్ని పరిష్కరించడంలో, డాక్టర్ రజని పరిశోధన రఫ్ సెట్ సిద్ధాంతం, సమీజ బీజగణిత నిర్మాణాల అధ్యయనాన్ని ముందుకు తీసుకువెళ్తుందని తెలియజేశారు. ఆమె కృషి రఫ్ సమీప బీజగణితాల భావనను పరిచయం చేస్తుందని, రఫ్ ఐడియల్స్, రఫ్ సబ్ స్ట్రక్చర్లు, వాటి బీజగణిత ధర్మాలు, పరస్పర సంబంధాలను పరిశీలిస్తుందని వివరించారు. ఇది అనిశ్చితిలో బీజగణిత నిర్మాణాలను అన్వేషించడానికి ఒక చట్రాన్ని అందిస్తుందన్నారు.ఆమె చేసిన గణనీయమైన పరిశోధన కృషి, ఆమె అకడమిక్ నైపుణ్యాన్ని, గణిత పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలనే ఆమె నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. దీనిని అనుబంధ రంగాలలో కూడా వినియోగించే అవకాశం ఉందన్నారు. డాక్టర్ రజని సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు, ఈ విశిష్ట విద్యా సాధనకు, గణిత శాస్త్ర రంగానికి ఆమె చేసిన విలువైన కృషిని అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కొత్త మొల్గర జడ్.పి.ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్**



పారిశుధ్యం, తాగునీరు, విద్యార్థుల వసతులపై పరిశీలన భూత్పూర్ మండల పరిధిలోని కొత్త మొల్గర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం, క్రీడా మైదానం, మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించి పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యం, గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు.అనంతరం విద్యార్థులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి లభ్యత, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ల పనితీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు.

పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించి ఏవైనా సమస్యలు, లోపాలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**నారాయణపేట సెప్టెంబర్ 18(వుదయం ప్రతినిధి)**



తల్లుల ఆరోగ్యమే ఆరోగ్య వంతమైన తరానికి పునాది అని జిల్లా కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామ రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అంగన్వాడీ కార్యక్రమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో కుటుంబంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు గర్భధారణ ప్రారంభం నుంచే తల్లి ఆరోగ్యం, పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అందించే ముర్రుపాలు (కొలస్ట్రం) ఎంతో విలువైనవని, మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఆరు నెలల లోపు శిశువులకు తేనె, నీరు తదితర ప్రత్యామ్నాయ ఆహారాలను ఇవ్వకూడదని తెలిపారు. బాలింతలు సంప్రదాయ నమ్మకాల పేరుతో కొన్ని ఆహార పదార్థాలను తీసుకోకుండా ఉండటం సరికాదని, వైద్యుల సూచనల మేరకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువుకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు.మహిళలు తమ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. గర్భధారణ సమయంలో, ప్రసవం అనంతరం, బాలింతగా ఉన్న సమయంలో తగిన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం తదుపరి తరాల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నడవడికను పిల్లలు అనుసరిస్తారని, అందువల్ల తల్లిదండ్రులు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించి పిల్లలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయకుండా చట్టపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ తెలిపారు. బాలికలు తగిన వయస్సు వచ్చే వరకు విద్యను కొనసాగిస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. చిన్నారులకు అధిక ఉప్పు, నూనెతో తయారైన ప్యాకేజ్డ్ స్నాక్స్, జంక్‌ఫుడ్ అలవాటు చేయకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇంట్లో లభించే పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలతో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు. మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.

**గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ**

గర్భిణీల ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందేలా ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీల్లో రక్తహీనతను నిరంతరం పర్యవేక్షించాలని, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి అవసరమైన వైద్యం అందేలా చూడాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపం లేదా తక్కువ బరువుతో ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి అందిస్తున్న అదనపు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ, వారు తీసుకుంటున్నదీ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

మహిళలు, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో నిరుగుర్తి గ్రామం ఆదర్శంగా నిలిచేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక కోరారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు.

ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, గ్రామ సర్పంచి రాములు, ఉప సర్పంచి సంతోష్ కుమార్,సీడీపీవో వెంకటేశ్వరమ్మ, సూపర్ వైజర్ అంజమ్మ, అంగన్ వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్**

పట్టణంలోని మెట్టుగడ్డ సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో బోర్‌లో భూగర్భ మట్టం తగ్గడంతో నీటి ప్రవాహం తక్కువగా ఉందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు వెల్లడించిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వసతి గృహ పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని శ్రద్ధగా చదివితే తమ లక్ష్యాలను సాధించవచ్చని ఆమె విద్యార్థులకు సూచించారు.అనంతరం వార్డెన్ కార్యాలయంలోని రికార్డులు, హాజరు రిజిస్టర్, సి.సి టీవీ కెమెరాల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ విషయంపై జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి (DTDO)తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని కలెక్టర్ వెంట ఉన్నారు.

## రేవంత్ గడ్డపై కవిత అడుగు.. కొడంగల్ ఎందుకు టార్గెట్?

- సీఎం సొంత నియోజకవర్గంలో కొత్త రాజకీయ సవాల్

**వికారాబాద్ 18 (వుదయం బ్యూరో)**

తెలంగాణ రాజకీయాల్లో కొడంగల్ మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారుతోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలోని తెలంగాణ రక్షణ సేన సభ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ పరిణామానికి రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ సభ పెట్టడం వెనుక రాజకీయ సందేశం స్పష్టంగా కనిపిస్తోంది.

ఒక రాజకీయ నాయకుడు ప్రత్యర్థి బలంగా ఉన్న ప్రాంతంలో సభ నిర్వహించడం కొత్త విషయం కాదు. అయితే ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాన్ని ఎంచుకోవడం మాత్రం సహజంగానే రాజకీయ చర్చకు దారితీస్తుంది. అందుకే కవిత కొడంగల్ అడుగును సాధారణ సభగా కాకుండా, కొత్త రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన అడుగుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.కవిత రాజకీయ ప్రయాణంలో ఇది మరో కొత్త మలుపుగా కూడా చూడవచ్చు. తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్ఎస్ రాజకీయాల వరకు కొనసాగిన తన రాజకీయ అనుభవం తర్వాత ఇప్పుడు ప్రత్యేక రాజకీయ వేదికను ముందుకు తీసుకెళ్తున్న కవితకు కొత్త సంస్థను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రధాన సవాలు.తెలంగాణ రక్షణ సేన విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం వంటి అంశాలను తన 'పాంచజన్యం'లో ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఈ అంశాలను ప్రజల సమస్యలతో అనుసంధానం చేస్తూ కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు పార్టీ కార్యక్రమాలు సూచిస్తున్నాయి.ఎవరు ఎవరిని ఎంత తీవ్రంగా విమర్శించారు అనేది ప్రజాస్వామ్యానికి అంత ముఖ్యమైన విషయం కాదు. ఎవరు ఏ సమస్యకు ఏ పరిష్కారం చూపుతున్నారు? ఆ పరిష్కారానికి ఆర్థిక వనరులు ఏమిటి? అమలు విధానం ఏమిటి? ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం రాజకీయ పార్టీల బాధ్యత.కవిత కొత్త రాజకీయ వేదిక కూడా ఇదే పరీక్షను ఎదుర్కోనుంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం, బీఆర్ఎస్‌పై భిన్నమైన రాజకీయ వైఖరిని ప్రకటించడం, బీజేపీని ప్రశ్నించడం—ఇవన్నీ రాజకీయ ప్రసంగంలో భాగం కావచ్చు. కానీ ప్రజల్లో కొత్త విశ్వాసం ఏర్పడాలంటే విమర్శలతో పాటు ప్రత్యామ్నాయ విధానాలను స్పష్టంగా చెప్పాలి. వికారాబాద్ జిల్లా రాజకీయాల్లో కూడా కొడంగల్ సభ చర్చకు దారితీయడం సహజం. కొడంగల్, వికారాబాద్, పరిగి, తాండూరు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు వేర్వేరుగా ఉన్నప్పటికీ భూమి, సాగునీరు, రోడ్లు, ఉపాధి, విద్య, వైద్యం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి.వికారాబాద్ జిల్లా ప్రజలకు ఈ రాజకీయ పోటీ నుంచి ఒక ప్రయోజనం కలగాలి. రాజకీయ నాయకులు ఒకరినొకరు విమర్శించుకోవడం కంటే జిల్లాకు ఏం చేయగలరో చెప్పాలి. ఎన్ని నిధులు వచ్చాయి? ఎక్కడ ఖర్చయ్యాయి? ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుంది? భూసేకరణలో ఎంతమందికి పరిహారం అందింది? ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? రైతులకు ఏ ప్రయోజనం కలిగింది? విద్యా, వైద్య రంగాల్లో ఏ మార్పు వచ్చింది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు ప్రజల ముందుకు రావాలి. రాజకీయ సభలు వస్తాయి, వెళ్తాయి. నినాదాలు మారుతాయి. నాయకులు మారవచ్చు. కానీ ప్రజల సమస్యలు మాత్రం కొనసాగుతాయి. అందుకే కొడంగల్ రాజకీయ పోరాటం వ్యక్తుల మధ్య పోటీగా కాకుండా విధానాల మధ్య చర్చగా మారాలి.రేవంత్‌రెడ్డి గడ్డపై కవిత అడుగు పెట్టడం రాజకీయంగా ప్రతీకాత్మకమైన పరిణామమే కావచ్చు. కానీ ఆ అడుగు ఎంత దూరం వెళ్తుందో నిర్ణయించేది సభలో వినిపించే




నినాదాలు కాదు—ప్రజా సమస్యలపై ఆ తర్వాత జరిగే పోరాటం, పార్టీ నిర్మాణం, విధానాల స్పష్టత, ప్రజలతో నిరంతర సంబంధం.

అందుకే కొడంగల్ ఇప్పుడు ఒక రాజకీయ వేదిక. ఆ వేదికపై ఎవరు ఏం మాట్లాడతారన్నది ఒక భాగం మాత్రమే. వారు చెప్పిన మాటలకు ఆధారాలు ఏమిటి? ప్రజల సమస్యలకు పరిష్కారాలు ఏమిటి? ప్రభుత్వ సమాధానం ఏమిటి? ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అమలు చేయగల కార్యాచరణ ఏమిటి? అనే ప్రశ్నలే అసలు పరీక్ష.

కొడంగల్ నుంచి వినిపించే రాజకీయ స్వరాలు వికారాబాద్ జిల్లా సరిహద్దులు దాటి తెలంగాణ రాజకీయ చర్చలోకి వెళ్లే అవకాశం ఉంది. కానీ ఆ స్వరాలకు విలువ తెచ్చేది నినాదాల తీవ్రత కాదు—ప్రజా సమస్యలపై ఆధారాలతో, స్పష్టమైన విధానాలతో మాట్లాడే సామర్థ్యం.

**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

## డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న ముఖ్యమంత్రి

- అంబటి బాలచందర్ గౌడ్

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి సెప్టెంబర్ 18**

ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా , అనవసరమైన చర్చలు కొనసాగిస్తూ ప్రజల దృష్టిని మరల్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ దుయ్యబట్టారు బిఆర్ఎస్ నాయకులు అంబటి బాలచందర్ గౌడ్. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చడానికి సిద్ధంగా లేని ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తుందన్నారు. మహిళలకు ఇస్తానన్నా 2,500 ఆర్థిక సహాయం, 500కే గ్యాస్ సిలిండర్ ఎంతమందికి ఇచ్చారో చెప్పమని ప్రశ్నించారు.వ్యవసాయ కూలీలకు ఏటా 12,000 ఇస్తామని చెప్పి ఇపుడు రైతుల కష్టాలకు నిలువెత్తు నిదర్శనముగా నిలుస్తున్న వచ్చి రాని కరెంట్, దొరకని మందు బస్తాలతో రైతులు పడుతున్న కష్టాలు చూస్తే కన్నీళ్లు ఆగడం లేవన్నారు. విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడుందో చెప్పాలన్నారు. వృద్ధులు, వితంతువులకు 4,000 పెన్షన్ కూడా మరిచిపోయింది ఈ ప్రభుతం అన్నారు. వీటన్నిటి నుండి ప్రజలం దృష్టి మరాల్చేందుకే ఎర్రవల్లి భూములపై రాజకీయ ఆరోపణలు మొదలు పెట్టాడు ముఖ్య మంత్రి అంటూ, పూర్తి రికార్డులతో వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి అంటూ ఘాటుగా ప్రశ్నించారు.

సర్వే నంబర్ 325లోని భూములను తమ తాతముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని, తమ జీవనాధారం ఆ భూములేనని ఎర్రవల్లి రైతులుచెబుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బిఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగు రాజేందర్ రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు పాండు గౌడ్, రేపాక యాదగిరి, సద్దుపల్లి గౌడ్, మర్మాండ్ల కిషన్, అర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.





# దొమ్మాట లో పందుల బెడద.. పట్టించుకోని అధికారులు

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 18(వు దయం):**
మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో పందుల సంచారం పెరిగిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల మధ్య, వీధుల్లో పందులు గుంపులుగా సంచరిస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల బెడదపై ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.పందులు మురుగు కాలువలు, చెత్తకుప్పల వద్ద సంచరిస్తూ చెత్తను ఇళ్ల పరిసరాల్లోకి లాగడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో దోమలు, ఈగలు పెరిగి పారిశుద్ధ్య సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందుల సంచారం వల్ల చిన్నారులు, వృద్ధులు వీధుల్లో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాహనదారులు సైతం పందులు అకస్మాత్తుగా రోడ్లపైకి రావడంతో ప్రమాదాల భయం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో పందుల సంచారం వల్ల పరిసరాల పరిశుభ్రత దెబ్బతినడంతో పాటు ప్రజారోగ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పందుల బెడదను అరికట్టేందుకు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి, చెత్తకుప్పలు తొలగించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, పందుల యజమానులకు నిబంధనలపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అధికారులు ఇకనైనా స్పందించి దొమ్మాట గ్రామంలో పందుల సంచారాన్ని నియంత్రించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా సిద్ధి వినాయక కళ్యాణ మహోత్సవం

- భక్తిశ్రద్ధలతో సిద్ధి బుద్ధి సమేత గణనాథుని కళ్యాణ క్రతువు
- లోక కళ్యాణార్థం శ్రీ భోలేనాథ్ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల

**సదాశివపేట సెప్టెంబర్ 18 (వు దయం):**



సదాశివపేట పట్టణంలో శ్రీ భోలేనాథ్ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత నేత్రపర్వంగా, వైభవంగా జరిగింది.

**శాస్త్రోక్తంగా కళ్యాణ క్రతువు:**
కళ్యాణోత్సవం సందర్భంగా ముందుగా ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా ఔషధి స్నానాలు ఆచరింపజేసి, నూతన పట్టు వస్త్రాలు సమర్పించి విశేషంగా అలంకరించారు. సాయంత్రం నిత్య పూజల అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరుని కళ్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**లోక కళ్యాణార్థం పూజలు:**
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మన ప్రాంతం, రాష్ట్రం, అలాగే దేశమంతా సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని, కరువు కాటకాలు రాకుండా ప్రజలంతా క్షేమంగా వర్ధిల్లాలనే ఉన్నత సంకల్పంతో ఈ కళ్యాణ క్రతువును జరిపించినట్లు తెలిపారు. సమస్త విఘ్నాలను తొలగించే గణపయ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలమని పేర్కొన్నారు. కరువు కాటకాలు ఏవీ రాకుండా కాపాడాలని భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి మహా మంగళహారతి సమర్పించి, విచ్చేసిన భక్తులకు మహా అన్నప్రసాద వితరణ గావించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు కాలనీవాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# భక్తి పారవశ్యం ఘనంగా కుంకుమార్చన



- హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో వినాయక మండపంలో కుంకుమార్చన
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- 25 ఏళ్లుగా నిర్విరామంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు
- భక్తి మార్గంలో ప్రజలు.. గ్రామంలో వెల్లివిరిసిన భక్తి వాతావరణం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 18, వుదయం:**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో గణనాథుడి వద్ద ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కుంకుమార్చనలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ భజన మండలి అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు భక్తి మార్గంలో ప్రజలు కొనసాగాలనే ఉద్దేశంతోనే ప్రతి ఏటా కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కుంకుమార్చన కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అన్న ప్రసాద వితరణకు అన్నదాతలుగా శెట్టి రామ రాజయ్య, రంజిత్ కుమార్ సహకరించారు. హనుమాన్ భజన మండలి మహిళా సభ్యులకు స్థానిక కౌన్సిలర్ నిరోషావెంకట్ స్వామిగౌడ్ చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తారా కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**సంగారెడ్డి, సెప్టెంబర్ 18:-వుదయం**
తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో డిగ్రీ విద్యార్థులకు బోధించుటకు వివిధ విభాగాలలో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడం జరుగుతున్నదని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.ప్రవీణ ఒక ప్రకటన లో తెలిపినారు.
తారా కళాశాలలో బీ.బీ.ఏ. రిటైల్ ఆపరేషన్స్ లో ఒకటి; BCA (computer Applications) ఒకటి; పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.అభ్యర్థులు ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కనీసం 55% మార్కులతో పాసై ఉండాలని, ఎస్సీ ,ఎస్టీ, అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని, అనుభవము మరియు నెట్, స్లేట్, పీహెచ్డీ అభ్యర్థుల కు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తారా కళాశాలలో ఈనెల 19వ తేదీన జరిగే డెమో మరియు ఇంటర్వ్యూ కు ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు ఒక జిరాక్స్ సెట్ కాపీల తో అటెండ్ కావాలని ఆమె పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

- వారు మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని అభిమానుల పూజలు....

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 18.....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్. హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్ద గౌని జిన్నారం శివకుమార్ గౌడ్ నేడు ఆయన పుట్టినరోజు వేడుకలను అభిమానులు వివిధ గుళ్ళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అభిమానులు మాట్లాడుతూ హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ అశోక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు పాఠశాల ఫీజులు వారికి అవసరమైన ఆర్థిక సాయం అందియ్యడం ఒక ఎత్తు. మరో సోదరుడు ప్రసాద్ గౌడ్ పేరా ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది తన సోదరుడి పేరు ప్రఖ్యాతలను స్థిరస్థాయిగా జనాల్లో ఉండేలా వివిధ గ్రామాల్లో వాటర్ ఫిల్టర్. సీసీ కెమెరాలు. వృద్ధులకు దుస్తులు. ఆర్థిక సాయం. కస్తూరిబా పాఠశాల బోరు వేయించి నీరు అందించడం. పాఠశాల చుట్టూ సోలార్ పెన్స్. దేవాలయాలకు తనకు తోచిన విధంగా సాయం చేస్తూ ఉంటారు. నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థులకు లాప్టాప్ లు అందజేయడం . తన స్వగ్రామం గూడూరులో తన గురువు శ్రీ శ్రీ శ్రీ విశ్వయోగి విశ్వంజి మహారాజ్ దివ్య ఆశీస్సులతో భారతదేశం లోనే ఎక్కడ లేని విధంగా గూడూరు గ్రామంలో శ్రీ గురు పీఠంలో దత్తాత్రేయ మహాస్వామి మందిరము శిరిడి సాయిబాబా మందిరాలు నిర్మించి భక్తులకి త్రిమూర్తుల రూపమైన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి భగవంతుని చూపిన శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్. ఆయన చేసిన సేవలు చెరిగిపోని వని కలియుగం ఉన్నంతవరకు ఆయన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని ఇలా అనేక సేవలు చేస్తున్న ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఇలా మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆయన సేవలు మరెందరికో అందేలా చూడాలని శ్రీ గురు పీఠంలోని శ్రీ దత్తాత్రేయ మహా స్వామికి షిరిడి సాయిబాబా దేవతామూర్తులతో పాటు చాకరిమెట్ల ఆంజనేయస్వామికి తిమ్మాపూర్ లో కొలువుదీరిన శ్రీ బంగారం మా తల్లికి శివంపేటలో కొలువుతీరిన శ్రీ భగలాముఖి శక్తిపీఠంలో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ పత్రిక ద్వారా వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్దగోని చిన్నారు శివకుమార్ గౌడ్ అయిన పుట్టినరోజు సందర్భంగా పలు కోశాలలో గోమాతలకు పండ్లు తిండి సామాగ్రిని ఆయన చేతుల మీదుగా గోమాతలకు అందజేశారు. వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జాతీయ స్థాయి అట్యా పట్యా పోటీలకు MSN విద్యార్థి ఎంపిక

- క్రీడా ప్రతిభతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థి

**అచ్చంపేట సెప్టెంబర్ 18: (వుదయం ప్రతినిధి )**



అచ్చంపేట పట్టణానికి చెందిన MSN గ్రామర్ స్కూల్ విద్యార్థి వి. హరీష్ సబ్‌జూనియర్ అట్యా పట్యా క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవలజరిగినసబ్‌జూనియర్ అట్యా పట్యా రాష్ట్ర స్థాయి పోటీలలోతనప్రతిభనుచాటుకున్న వి.హరీష్, అత్యుత్తమ ఆటతీరుతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ సి.ఎం. రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో హరీష్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం మా పాఠశాలకు ఎంతోగర్వకారణం. జాతీయ స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నామని అన్నారు.విద్యార్థి విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులు, PET ఉపాధ్యాయులు మరియు కోచ్‌లను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.ఈ విజయం పాఠశాల క్రీడా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది.
జాతీయ స్థాయిలో కూడా హరీష్ విజయభేరి మోగించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పాఠశాల కుటుంబం ఆకాంక్షిస్తోంది.

# మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి పితృవియోగం







- బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన నేతలు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన
- మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల హాజరు

**చిన్నంబావి మండలం 18 ( వుదయం రిపోర్టర్ )**
కొల్లాపూర్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతి చెందడంతో కొల్లాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. తమతో సన్నిహితంగా ఉన్న కుటుంబంలో జరిగిన ఈ విషాదం పట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**"అప్పుడిని కోల్పోవడం తీరని లోటు"**
బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ తీరని లోటు. ఈ విషాద సమయంలో బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం అంటూ పరామర్శకు వచ్చిన నాయకులు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ అంతిమ యాత్రలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో కొల్లాపూర్‌లో విషాద వాతావరణం నెలకొంది. బీరం లక్ష్మారెడ్డి భౌతికకాయాన్ని చివరిసారిగా దర్శించుకున్న నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అంతిమ క్రియల్లో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు.



# తిరుమల చెన్నై గొడుగులు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడసేవ కోసం చెన్నై నుండి గొడుగులు తిరుమలకు చేరుకున్నాయి. హిందూ ధర్మార్థ సమితి తరపున 9 గొడుగులు, విశ్వహిందూ పరిషత్ తరపున 11 గొడుగులు సమర్పించారు. రేపు సాయంత్రం జరిగే గరుడవాహన సేవకు ఈ గొడుగులను అలంకరించనున్నారు. విశ్వహిందూ పరిషత్ శతాబ్దాలుగా గొడుగులు అందిస్తుండగా, హిందూ ధర్మార్థ సమితి గడిచిన 21 సంవత్సరాలుగా చెన్నై నుండి పాదయాత్రగా గొడుగులను తిరుమలకు తీసుకొచ్చి స్వామివారికి సమర్పిస్తున్నారు. అలాగే ఈ కార్యక్రమంలో టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర , అదనపు ఈవో శ్రీ చ వెంకయ్య చౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు, చీఫ్ విజిలెన్స్ & సెక్యూరిటీ ఆఫీసర్ కెవి మురళి కృష్ణ, అలాగే ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ తో పాటు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. వాహన సేవ సందర్భంగా వివిధ సాంస్కృతిక బృందాలు ప్రదర్శించిన కార్యక్రమాలను అధికారులు వీక్షించారు. కళాకారుల భక్తి, క్రమశిక్షణ, అద్భుతమైన ప్రదర్శనను వారు అభినందించారు. బ్రహ్మోత్సవాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని మరింత ఇనుమడింపజేసేలా తమ సేవలను కొనసాగించాలని కళాకారులను ప్రోత్సహించారు. వాహన సేవను సజావుగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లను కూడా అధికారులు ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, సిబ్బందికి వారు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రధాని మోదీ నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశీర్వాద దీపాలు

**అచ్చంపేట, సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి)**
:భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా జాతీయ పార్టీ పిలుపు మేరకు ప్రతి ఇంట్లో ఆశీర్వాద దీపాలు వెలిగించాలని ఇచ్చిన పిలుపుతో రాష్ట్ర బీజేపీ ఓబీసీ నాయకులు మండికారి బాలాజీ, శ్రీమతి మండికారి భారతి దంపతులు తమ స్వగృహంలో ఆశీర్వాద దీపాలు వెలిగించారు.
దండాలయ్యా దండాలయ్యా చల్లంగ మీరు ఉండాలయ్యా" అని కోరుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉండటమే కాకుండా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని బాలాజీ అన్నారు.



మోదీ నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఫోటో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా తమ స్వగృహంలో ఆశీర్వాద దీపాలు వెలిగిస్తున్న బీజేపీ ఓబీసీ నాయకులు మండికారి బాలాజీ దంపతులు.

# నటి వర్ష చేతుల మీదుగా N4U Mobilesలో iPhone 18 Pro & 18 Pro Max లాంచ్




**హైదరాబాద్:**
ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ N4U Mobilesలో సరికొత్త iPhone 18 Pro, iPhone 18 Pro Max స్మార్ట్‌ఫోన్‌ల లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి వర్ష ముఖ్య అతిథిగా హాజరై కొత్త ఐఫోన్ మోడళ్లను లాంచ్ చేశారు.ఈ సందర్భంగా నటి వర్ష మాట్లాడుతూ.. N4U Mobilesలో సరికొత్త iPhone 18 Pro, iPhone 18 Pro Maxలను లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఐఫోన్ అభిమానులకు ఈ కొత్త సిరీస్ మరింత ఆకట్టుకుంటుందని తెలిపారు. N4U Mobiles వినియోగదారులకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ, సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో N4U Mobiles ప్రతినిధులు, సిబ్బంది, అభిమానులు, కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



**మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా***
వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు.ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు తదితర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తాచెదారాన్ని తొలగించడం, పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని అన్నారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరినీ స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు దేశం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛతను ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని ఆమె సూచించారు.

# గణపతిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

- "విఘ్నేశ్వరుని సేవలో సువర్ణ మల్లన్న పాటిల్"
- "అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు"
- "భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు"

**కోహీర్ సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి )**
కోహీర్ మండల పరిధిలోని కవేలి చౌరస్తా వద్ద గల సెంటు గోపి కంపెనీలో ఏర్పాటు చేసిన దుర్గా గణపతి ఆలయంలో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీ. సువర్ణ మల్లన్న పాటిల్ కంపిని లో గల దుర్గ మత గణపతి గుడిని సందర్శించారు. ఆలయంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.
విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు
ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.నాయకులు గణనాథునికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, మండలంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.మల్లన్న పాటిల్, విద్యాసాగర్, సంగన్న పాటిల్ తదితరులు భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఉత్సవాల ఏర్పాట్లపై అభినందనలు తెలిపారు వినాయకుని నామస్మరణతో సెంటు గోపి కంపెనీ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.గుడికి కి వచ్చిన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.వినాయక చవితి సందర్భంగా మండల ప్రజలకు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# చల్కీలో వినాయక చవితి వేడుకలు

- "శ్రీ మాణిక్ ప్రభు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు"
- "ఐదు రోజుల పాటు భక్తులకు అన్నదానం.. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు"

**కోహీర్ , సెప్టెంబర్ 18 (వుదయం ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం చల్కీ గ్రామంలో శ్రీ మాణిక్ ప్రభు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.
వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**భక్తుల కోసం ఐదు రోజుల పాటు అన్నదానం**
గొల్ల అశోక్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు భక్తులకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ప్రజలందరిపై గణనాథుడి కృపా కటాక్షాలు సంపూర్ణంగా ఉండాలని గొల్ల అశోక్ ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.వినాయక చవితి వేడుకల్లో ప్రభుత్వ పాఠశాల, శ్రీ సంగమేశ్వర స్కూల్ విద్యార్థులు పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో గొల్ల అశోక్‌తో పాటు శ్రీ మాణిక్ ప్రభు ఉత్సవ కమిటీ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. వేడుకలు విజయవంతంగా నిర్వహించడంతో నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.



# భక్తి సేవకు ఘన గౌరవం.. భజన కళాకారులకు ఘన సన్మానం

- ఐదు రోజులూ గణనాథుడి సేవలో అంకితభావంతో పాల్గొన్న కళాకారులకు సిద్ధి వినాయక యూత్ ఆత్మీయ సత్కారం


**ధరూర్ సెప్టెంబర్ 18 (వుదయం బ్యూరో)**



భక్తి భావం వెల్లివిరిసింది.. గణనాథుడి నామస్మరణతో ధరూర్ మండల కేంద్రం మార్మోగింది. తెలుగు సత్యన్న ఇంటి సమీపంలో ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వరుడి ఐదు రోజుల వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు స్వామివారి సేవలో అంకితభావంతో పాల్గొన్న భజన కళాకారులకు సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహిం చారు. ప్రతిరోజూ భజనలు, భక్తిగీతాలతో కార్యక్రమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా భక్తి సేవలో భాగస్వాములైన కళాకారుల సేవలను గుర్తించిన యూత్ సభ్యులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.భక్తి కార్యక్రమాలకు కళాకారుల సేవే వెన్నెముకగా నిలుస్తుందని, సంప్రదాయ భజనలను భావితరాలకు అందిస్తూ ఆధ్యాత్మికతను పెంపొందించడంలో వారి పాత్ర ప్రత్యేకమని ఈ సందర్భంగా యూత్ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం భక్తుల నామస్మరణలు, మంగళవాయిద్యాలు, భజనల నడుమ గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావర ణంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో సిద్ధి వినాయక యూత్ సభ్యులు, భజన కళాకా రులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చక్కని ఆరోగ్యం

## కాళ్ల కండరాలు బలంగా ఉండాలంటే ఏం చేయాలి..



కాళ్ల కండరాల బలం మనిషి రోజువారీ జీవితంలో ఎంతో కీలకమైనది. నడవడం, మెట్లు ఎక్కడం, కుర్చీ నుంచి లేవడం వంటి సాధారణ పనుల నుంచి క్రీడల్లో మెరుగైన ప్రదర్శన వరకు అన్నింటికీ బలమైన దిగువ శరీరం అవసరం. క్వాడ్రిసెప్స్, గ్లూట్స్ వంటి కాళ్ల కండరాలు శరీరంలోని అతిపెద్ద కండరాల సమూహాల్లో భాగం. ఇవి బలంగా ఉంటే కదలికలు సమర్థవంతంగా సాగడమే కాకుండా శక్తి వినియోగం మెరుగుపడి కీళ్లపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. కాళ్ల బలాన్ని పెంచుకోవాలంటే వ్యాయామంతోపాటు సరైన ఆహారం, జీవనశైలి అలవాట్లపైనా దృష్టి పెట్టాలి. కాళ్ల కండరాలను బలోపేతం చేయడంలో స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. క్వాడ్రిసెప్స్, హ్యామ్‌స్ట్రింగ్స్, కాల్ఫ్స్, గ్లూట్స్ వంటి ప్రధాన కండరాల సమూహాలను లక్ష్యంగా చేసుకునే వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయాలి. స్క్వాట్స్, లంజెస్, డెడ్‌లిఫ్ట్స్, లెగ్ ప్రెస్, కాల్ఫ్ రైజెస్ వంటి వ్యాయామాలు కాళ్ల బలాన్ని పెంచడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. వారానికి కనీసం రెండు నుంచి మూడు సార్లు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయడం మంచిది. కండరాలు బలపడాలంటే క్రమంగా బరువును లేదా రిపిటేషన్ల సంఖ్యను పెంచుతూ వెళ్లాలి. స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌తోపాటు కార్డియో వ్యాయామాలు కూడా కాళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. పరుగెత్తడం, సైక్లింగ్, ఈత, వేగంగా నడవడం వంటి కార్యకలాపాలు కాళ్ల కండరాలను టోన్ చేయడంతోపాటు రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. క్రమం తప్పకుండా కార్డియో వ్యాయామాలు చేయడం ద్వారా కాళ్ల సహన శక్తి పెరుగుతుంది. కాళ్ల బలం పెరగాలంటే ఫ్లెక్సిబిలిటీ, మొబిలిటీ కూడా ముఖ్యమే. కండరాలు గట్టిపడితే వ్యాయామాలు సరిగా చేయడం కష్టమవుతుంది. వ్యాయామానికి ముందు డైనమిక్ స్ట్రెచింగ్, తర్వాత స్టాటిక్ స్ట్రెచింగ్ చేయడం వల్ల కండరాల వశ్యత పెరుగుతుంది. యోగా సాధన కూడా శరీర సమతుల్యతను, కదలికల పరిధిని మెరుగుపరచి కాళ్ల పనితీరును పెంచుతుంది. సరైన ఆహారం లేకుండా కండరాల బలం పెరగడం సాధ్యం కాదు. వ్యాయామం సమయంలో కండరాల్లో సూక్ష్మస్థాయి చీలికలు ఏర్పడతాయి. వీటిని పునరుద్ధరించి మరింత బలంగా మార్చడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. కండరాల పెరుగుదల కోసం తగిన మోతాదులో ప్రోటీన్ అవసరం. లీన్ మాంసం, చేపలు, గుడ్లు, పాలు, పప్పుధాన్యాలు, మొక్కల ఆధారిత ప్రోటీన్ ఆహారాలను తీసుకోవాలి. వ్యాయామాలకు అవసరమైన శక్తిని అందించేందుకు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు కూడా అవసరం. సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు శరీరానికి దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అలాగే అవకాడో, నట్స్, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్ల ఉత్పత్తికి, శరీర ఆరోగ్యానికి తోడ్పడతాయి. శరీరంలో నీటి లోపం ఉంటే కండరాల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందుకే తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వ్యాయామం తర్వాత శరీరంలో కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడం అవసరం. కొన్ని సందర్భాల్లో ఎలక్ట్రోలైట్లు కలిగిన పానీయాలు కూడా ఉపయోగపడతాయి. కండరాల బలవృద్ధిలో విశ్రాంతి కూడా ముఖ్యమైంది. వ్యాయామం తర్వాత కండరాలు పునరుద్ధరించుకుని మరింత బలపడేందుకు సమయం అవసరం. ప్రతి రోజు కనీసం 7 నుంచి 9 గంటల నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వ్యాయామాల మధ్య విశ్రాంతి రోజులను కూడా తప్పనిసరిగా చేర్చాలి. శరీరం ఎక్కువ అలసటగా లేదా నొప్పిగా అనిపిస్తే అదనపు విశ్రాంతి తీసుకోవడం మంచిది. బలమైన కాళ్లు రోజువారీ పనులను సులభతరం చేయడమే కాకుండా గాయాల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

## గాజు స్ట్రా.. తేనె పూసిన కత్తి



ఇటీవల ఆన్‌లైన్ మార్కెట్లో గాజు స్ట్రాలు అతి తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయి. ఇలాంటి వాటిని వాడితే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. గాజు స్ట్రాలను వాడిన ప్రతిసారీ శుభ్రం చేసే సందర్భంలో ఎప్పుడో ఒకప్పుడు పగుళ్లు రావొచ్చు. అంచులు చిట్లి పోవచ్చు. వీటిని భద్రపరిచినప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా తాకినా చిట్లుతాయి. గాజు స్ట్రా పగుళ్ల వల్ల పెదవులు, నాలుకకు కనిపించని గాయాలు అయ్యే ప్రమాదం ఉంది. స్ట్రా అంచుల్లో ఉండే చిన్న చిన్న పగుళ్ల నుంచి సూక్ష్మంగా ఉండే గాజు పలుకులు పానియాలను పీల్చేటప్పుడు నోట్లోకి వచ్చేస్తాయి. అక్కడి నుంచి జీర్ణ వ్యవస్థలోకి జారుకుంటాయట. అవి జీర్ణ వ్యవస్థలోని మూలల్లో కొంతకాలం ఉండిపోయి గాయాలు చేసే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. 'ఏ రాయి అయితేనేం' అనే సామెతలో చెప్పినట్టు గాజు, ప్లాస్టిక్ స్ట్రాలు రెండూ ప్రమాదమే. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్టు కాకూడదు. కాబట్టి వీలున్నంత వరకు నోటితో పానియాలు తాగడమే ఉత్తమం. కుదరకపోతే పేపర్ స్ట్రా ఉపయోగించడం కొంత మెరుగు.

## కుదుళ్లకు 'మునగాకు పొడి'!

జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే కుదుళ్లు దృఢంగా ఉండాలి. ఇందుకోసం పోషకాహారం తీసుకోవడం, సహజసిద్ధమైన హెయిర్ ప్యాక్స్ వేసుకోవడం మనకు అలవాటే! అయితే ఈ జాబితాలో మునగాకు పొడిని కూడా చేర్చుకోమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో దీన్ని కూరల్లో భాగం చేసుకోవడంతో పాటు.. ఈ పొడితో హెయిర్ ప్యాక్స్/మాస్కులు తయారుచేసుకొని ఉపయోగించడం వల్ల కుదుళ్లు/జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని చెబుతున్నారు. మరి, అదెలాగో



తెలుసుకుందాం రండి..

మునగాకు పొడిలో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ 'సి', విటమిన్ 'బి6', ఐరన్, జింక్, క్యాల్షియం.. వంటి పోషకాలుంటాయి. ఇవి కుదుళ్లలో ఉన్న సమస్యల్ని దూరం చేసి.. జుట్టు ఆరోగ్యంగా ఎదిగేలా చేస్తాయట. అందుకే వీటిని చర్మ, జుట్టు సౌందర్యోత్పత్తుల తయారీలో విరివిగా వాడుతుంటారు. కుదుళ్లు జిడ్డుగా మారడం వల్ల చుండ్రు, దురద.. వంటి సమస్యలొస్తాయి. ఇవి జుట్టు రాలడానికి కారణమవుతాయి. మునగాకు పొడి వీటికి విరుగుడుగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే జింక్.. కుదుళ్లలోని నూనె గ్రంథులు విడుదల చేసే సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుందట. తద్వారా కుదుళ్లు తేమగా ఉండి.. జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయట. ప్రకాశవంతంగానూ కనిపించేలా చేస్తాయంటున్నారు. కొంతమందికి కుదుళ్లలో దురద, పొక్కుల్లా ఏర్పడడం.. వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి వారు మునగాకు పొడితో తయారుచేసిన హెయిర్ మాస్కులు ఉపయోగించడం, ఈ పొడిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. మునగాకు పొడిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కుదుళ్లలోని ఆయా సమస్యల్ని దూరం చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయట. శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ చర్మ ఆరోగ్యంపైనే కాదు.. కుదుళ్లపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. అందుకే వీటితో పోరాడే గుణాలున్న మునగాకు పొడిని మనం తీసుకునే ఆహారం, పాటించే బ్యూటీ రొటీన్‌లో భాగం చేసుకోవాలంటున్నారు. ఈ పొడిలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ 'సి' ఫ్రీరాడికల్స్‌తో పోరాడి ఒత్తిడిని తగ్గిస్తాయట. జుట్టు ఒత్తుగా పెరగడమే కాదు.. ప్రకాశవంతంగా ఉన్నప్పుడే దాని అందం ఇనుమడిస్తుంది. మునగాకులోని బెహెనిక్ ఆమ్లం ఈ పనుల్ని సమర్థంగా నిర్వర్తిస్తుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ ఆమ్లం జుట్టుకు సహజసిద్ధమైన కండిషనర్‌లా పనిచేస్తుంది. తద్వారా ఆశించిన ఫలితాల్ని పొందచ్చంటున్నారు. కుదుళ్లు ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నప్పుడే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. మునగాకు పొడిలోని ఓలియిక్ ఆమ్లం, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఇందుకు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. మునగాకు పొడితో కుదుళ్లు, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలంటే.. ఈ హెయిర్ మాస్క్ చక్కగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. టేబుల్ స్పూన్ చొప్పున మునగాకు పొడి, ఉసిరి పొడి ఒక బౌల్‌లోకి తీసుకొని కలుపుకోవాలి. దీనికి కొద్దికొద్దిగా పెరుగు జత చేస్తూ పేస్ట్‌లాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లు, జుట్టుకు పట్టించి అరగంట పాటు అలాగే ఉంచుకోవాలి. ఆపై శుభ్రం చేసుకుంటే.. ఆశించిన ఫలితాలు పొందచ్చట. మునగాకు పొడితో సహజసిద్ధమైన కండిషనర్‌ని కూడా తయారుచేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం రెండు కప్పుల నీటిలో టేబుల్‌స్పూన్ మునగాకు పొడి వేసి మరిగించాలి. చల్లారాక ఈ నీటిని వడకట్టి.. తలస్నానం చేశాక కుదుళ్లు, జుట్టు మొత్తం తడిసేలా తలపై నుంచి పోసుకోవాలి. కాసేపయ్యాక గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుందంటున్నారు నిపుణులు.

## చక్కెరకు చెక్ పెట్టొద్దు..!


చికాగోలో ఇటీవల నిర్వహించిన ఎండోక్రైన్ సొసైటీ వార్షిక సమావేశంలో ఈ అధ్యయనం చర్చకు వచ్చింది. దీని ప్రకారం.. కొవ్వు తక్కువగా ఉండే ఆహారం నుంచి చక్కెరను పూర్తిగా తొలగించడం వల్ల పేగుల ఆరోగ్యం, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌తోపాటు జీవక్రియలపైనా ప్రతికూల ప్రభావం పడుతుందట. ఇందుకోసం ఎలుకలపై చేపట్టిన ప్రయోగాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయని పరిశోధకులు తెలిపారు. ఎలుకలను రెండు గ్రూపులుగా విభజించి.. కొన్నిటికి చక్కెర లేకుండా, మరికొన్నిటికి చక్కెరతో కూడిన ఆహారాన్ని అందించారు. 16 వారాల తర్వాత వాటి పేగుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. అయితే, చక్కెరను పూర్తిగా పక్కన పెట్టేసిన ఎలుకల జీవక్రియల్లో కొన్ని ప్రతికూల మార్పులను గుర్తించారు. మితిమీరిన చక్కెర వినియోగం ఆరోగ్యానికి హానికరమే అయినప్పటికీ, కొన్ని రకాల చక్కెరలను పూర్తిగా తొలగించడం వల్ల ముఖ్యమైన జీవక్రియ ప్రక్రియలకు అంతరాయం కలగవచ్చని పరిశోధకులు చెప్పుకొచ్చారు.



చక్కెరను పూర్తిగా పక్కన పెట్టేస్తే.. రక్తంలో చక్కెర నియంత్రణ తగ్గడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం, పేగులలోని సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతినడం, పేగుల్లో వాపు/మంటతోపాటు ఫ్యాటీ లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. మన జీర్ణ వ్యవస్థలో ట్రిలియన్ల కొద్దీ ఉండే బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, ఇతర సూక్ష్మజీవులు.. జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, జీవక్రియ ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే సుక్రోజ్‌ను పూర్తిగా దూరం చేయడం వల్ల ఈ మంచి బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతింటుందని ఈ కొత్త అధ్యయనం తేల్చింది. కాబట్టి, చక్కెరను పూర్తిగా పక్కన పెట్టేయకుండా.. కొద్ది మొత్తానికి పరిమితం చేయాలి. అదే సమయంలో ఆహారంలో కార్బోహైడ్రేట్ల నాణ్యత, సమతుల్యతకూ ప్రాధాన్యం ఇవ్వాలి. తీవ్రమైన ఆహార నియంత్రణల కంటే సమతుల పోషకాహార విధానమే ఎక్కువ ప్రయోజనకరమని ఈ అధ్యయనం ఉద్ఘాటిస్తున్నది.

## ఆలుగడ్డలను తింటే మధుమేహం వస్తుందా..

పరిశోధన కాలంలో మొత్తం 22,299 మందికి టైప్-2 మధుమేహం నిర్ధారణ అయింది. వారానికి మూడు సార్లు ఆలుగడ్డలు తినేవారిలో మధుమేహం వచ్చే ప్రమాదం స్వల్పంగా 5



శాతం పెరిగినట్లు కనిపించింది. అయితే వంట విధానాన్ని బట్టి పరిశీలించగా మరింత స్పష్టమైన తేడాలు బయటపడ్డాయి. వారానికి మూడు సార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తినేవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 20 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. మరోవైపు అదే పరిమాణంలో ఉడికించిన, కాల్చిన లేదా మెత్తగా చేసిన ఆలుగడ్డలను తీసుకున్న వారిలో మధుమేహ ప్రమాదం పెరిగినట్లు ఎలాంటి గణాంక ఆధారాలు లభించలేదు. ఈ తేడాకు ప్రధాన కారణం డీప్ ఫ్రై చేసే ప్రక్రియ అని పరిశోధకులు చెబుతున్నారు. నూనెలో బాగా వేయించడం వల్ల ఆహారంలో కేలరీలు, అనారోగ్యకర కొవ్వులు పెరుగుతాయి. అలాగే ఆహార రసాయన నిర్మాణంలో మార్పులు చోటుచేసుకుని ఇన్సులిన్ నిరోధకతను పెంచే అవకాశం ఉంటుంది. పరిశోధకులు మరో ఆసక్తికర అంశాన్ని కూడా పరిశీలించారు.ఆలుగడ్డలకు బదులుగా ఇతర కార్బోహైడ్రేట్ ఆహారాలను తీసుకుంటే మధుమేహ ప్రమాదంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో అధ్యయనం చేశారు.
వారానికి మూడు సార్లు ఆలుగడ్డల స్థానంలో సంపూర్ణ ధాన్యాలను తీసుకున్న వారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 8 శాతం తగ్గినట్లు గుర్తించారు. అదే ఫ్రెంచ్ ఫ్రైస్‌కు బదులుగా సంపూర్ణ ధాన్యాలను తీసుకుంటే ఈ ప్రమాదం 19 శాతం వరకు తగ్గింది.

## ఒకే వంట నూనె కన్నా, వివిధ రకాల నూనెలను కలిపి వాడితే మంచిది..

పామ్ ఆయిల్ ఆహార పరిశ్రమలో విస్తృతంగా ఉపయోగించే నూనెలలో ఒకటి. అధిక ఉష్ణోగ్రతల వద్ద కూడా ఇది తక్కువగా దెబ్బతినడం వల్ల వేయింపులు, బేకరీ ఉత్పత్తులు, మార్జరిన్, స్ప్రెడ్లు, మిఠాయిల తయారీలో దీనికి మంచి ప్రాధాన్యం ఉంది. ఇందులో సహజంగా ఉండే టోకోఫెరాల్స్, టోకోట్రియెనాల్స్, కెరోటినాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు నూనె నాణ్యతను కాపాడడంలో సహాయపడతాయి. పామ్ ఆయిల్‌ను సోయాబీన్, రైస్ బ్రాన్, సన్‌ఫ్లవర్, ఫ్లాక్స్‌సీడ్ లేదా పెరిల్లా సీడ్ ఆయిల్స్‌తో కలపడం ద్వారా మరింత సమతుల్యమైన పోషక విలువలు కలిగిన నూనెను తయారు చేయవచ్చు. పామ్ ఆయిల్ వేడి తట్టుకునే స్థిరత్వాన్ని అందిస్తే, ఇతర నూనెలు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అదనపు యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (FSSAI) నూనె మిశ్రమాలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ఈ నిబంధనల ప్రకారం సాధారణంగా ఒక మిశ్రమంలో ఉండే ఏ ఒక్క నూనె శాతం 20 శాతానికి తక్కువగా ఉండకూడదు. అయితే ఆవాల నూనెకు కొన్ని ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. అదనంగా చియా లేదా ఫ్లాక్స్‌సీడ్ వంటి మూడో నూనెను మొత్తం మిశ్రమంలో 5 శాతం వరకు చేర్చేందుకు అనుమతి ఉంది.



నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏ ఒక్క వంటనూనె కూడా అన్ని రకాల పోషక అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతోంది. కొన్ని నూనెల్లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉంటే, మరికొన్నింటిలో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు లేదా యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఉదాహరణకు పామ్ ఒలీన్ అధిక ఉష్ణోగ్రతల వద్ద మంచి స్థిరత్వాన్ని అందిస్తే, రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఉండే ఫైటోస్టెరాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఫ్లాక్స్‌సీడ్, పెరిల్లా సీడ్ ఆయిల్స్ ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలకు మంచి మూలాలు కాగా, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్స్ పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులను అందిస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)సిఫారసుల ప్రకారం ఆహారంలో శాచురేటెడ్, మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వుల మధ్య సమతుల్యత ఉండటం అవసరం. అలాగే ఒమేగా-3, ఒమేగా-6 కొవ్వు ఆమ్లాల సరైన నిష్పత్తి కూడా ఆరోగ్యానికి కీలకమని నిపుణులు చెబుతున్నారు. నూనె మిశ్రమాలు ఈ సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయి.

## చెరకు రసాన్ని రోజూ తాగవచ్చా..

చెరకు రసంలో పొటాషియం, పాలీఫినాల్స్ వంటి కొన్ని పోషకాలు కూడా ఉంటాయి. పొటాషియం శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటానికి సహాయపడుతుంది. పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వేడి వాతావరణంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడతాయి. అయితే చెరకు రసాన్ని ప్రతిరోజూ తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం చెరకు ముక్కలో ఉండే పీచు పదార్థం రసంలో చాలా తక్కువగా ఉంటుంది. అలాగే ఇందులో ప్రోటీన్ కూడా దాదాపు ఉండదు. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది. రక్తంలో చక్కెర వేగంగా పెరగడం వల్ల కొంతసేపు అధిక శక్తి లభించినట్లు అనిపించినా, ఆ తర్వాత శక్తి స్థాయి అకస్మాత్తుగా తగ్గిపోతుంది. దీంతో అలసట, నిద్రమత్తు, బద్ధకం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్, మధుమేహం లేదా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలతో బాధపడుతున్న వారు చెరకు రసాన్ని తరచూ తీసుకోవడాన్ని నివారించడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయులపై ప్రభావం చూపిస్తుంది. చెరకు రసం విషయంలో మరో ముఖ్యమైన అంశం పరిశుభ్రత. రసం కంటే దానిని తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండటం మరింత ముఖ్యం. పరిశుభ్రత లేని ప్రాంతాల్లో తయారయ్యే రసంలో సూక్ష్మజీవులు చేరి ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల చెరకు రసాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు.



అయితే దానిని రోజువారీ ఆరోగ్య పానీయంగా కాకుండా అప్పుడప్పుడు తీసుకునే వేసవి శీతల పానీయంగా భావించడం మంచిది. పరిమిత మోతాదులో, పరిశుభ్రమైన ప్రదేశాల్లో తయారైన చెరకు రసాన్ని తీసుకుంటే దాని రుచి, తాజాదనాన్ని ఆస్వాదించడంతోపాటు ఆరోగ్యపరమైన ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## గుబాళించే గులాబీ నూనె!

మినిమలిజాన్ని ఇష్టపడుతోన్న జెన్‌జీలు... సహజసిద్ధమైన పద్ధతుల్లో చర్మాన్ని సంరక్షించుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. ఇలా ప్రస్తుతం వారి మనసు దోచుకుంటోంది గులాబీ నూనె. దీన్ని నేరుగా మార్కెట్‌లో కొనుక్కోవడమే కాదు... ఇంట్లోనూ సులువుగా తయారుచేసుకోవచ్చు. అదెలాగంటే... రోజ్ ఆయిల్ తయారీకి ముందుగా రసాయనాలు వాడని మొక్కల నుంచి గులాబీ పూలు సేకరించాలి. వాటి రేకలను విడదీసి శుభ్రం చేసుకుని తడి ఆరాక... వాటిని ఒక గాజు సీసాలో వేసుకోవాలి. ఇప్పుడు అందులో బాదం లేదా జోజోబా నూనెను పోయాలి. మూత పెట్టి ఈ మిశ్రమాన్ని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో వేడి చేయొచ్చు. లేదా కొన్ని రోజుల పాటు ఎండలో ఉంచొచ్చు.




అప్పుడు పూలలోని సారం అంతా నూనెలోకి చేరుతుంది. ఆపై దాన్ని వడకట్టుకుంటే సుగంధభరితమైన రోజ్ ఆయిల్ సిద్ధమవుతుంది. గులాబీనూనెలో సమృద్ధిగా ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతూ, వృద్ధాప్య ఛాయలు, ముడతలను సమర్థవంతంగా అరికడతాయి. ముఖ్యంగా పొడి చర్మం ఉన్నవారికి తేమను అందించి, మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ముఖంపై ఉన్న నల్లటి మచ్చలు, మొటిమల గుర్తులను క్రమంగా తగ్గిస్తూ చర్మ రంగును మెరుగుపరచడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. రోజూ రాత్రి నిద్రపోయే ముందు కొన్ని చుక్కల గులాబీ నూనెతో ముఖాన్ని మృదువుగా మసాజ్ చేసుకోవడం వల్ల, మరుసటి రోజు ఉదయానికి చర్మం ఎంతో కాంతిమంతంగా, కోమలంగా మారుతుంది. చర్మంపై వచ్చే మంట, అలర్జీలను తగ్గించే గుణాలూ ఇందులో ఉన్నాయి. అంతేనా, దీని సువాసన మనసునీ తేలికపరుస్తుందట. హాయి నిద్రనూ తెచ్చిపెడుతుంది.

## ప్రొఫీ తాగారా?

బరువు తగ్గాలి, హార్మోనుల్లో సమతుల్యత, మెటబాలిజం మెరుగ్గా పనిచేయాలి... కారణాలేవైతేనేం, ప్రొటీన్ తీసుకోవడంపై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు అమ్మాయిలు. అందుకు వాళ్లకి కనిపిస్తున్న తేలికైన మార్గం ప్రొటీన్ పౌడర్. చాలావరకూ దీన్ని ఉదయం తీసుకోవడానికి మొగ్గు చూపేవారే ఎక్కువ. కానీ మనలో చాలామందికి ఉదయాన్నే టీనో కాఫీనో తీసుకోనిదే ఏమీ తోచదు. మరెలా? అందుకే, ఫిట్‌నెస్



లవర్స్ దీనికి పరిష్కారంగా ఓ ట్రెండ్‌ని తీసుకొచ్చారు. అదే ప్రొఫీ! అంటే ప్రొటీన్+కాఫీ. కాఫీలో ప్రొటీన్ పౌడర్ కలుపుకోవడం లేదా ప్రొటీన్ షేక్‌కి కాఫీ జత చేసుకోవడం అన్నమాట. కెఫీన్ చురుగ్గా చేసి, ఏకాగ్రత పెరిగేలా చేస్తే... ప్రొటీన్ చాలాసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. చురుకుదనానికి ఆరోగ్యం జత అంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. క్విక్ బ్రేక్‌ఫాస్ట్‌గా, వ్యాయామం, అల్పాహారం తరవాత స్నాక్‌గా... ఇలా నచ్చినట్టుగా తీసుకుంటున్నారు. అయితే ఇది బరువు తగ్గించే పానీయం కాదు. ఆకలిని మాత్రం అదుపు చేయగలదు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్‌ని భర్తీ చేయగలదు. అంతేకానీ, పోషకాహారానికి ప్రత్యామ్నాయం మాత్రం కాదు అంటున్నారు నిపుణులు. మంచిది కదా అని కృత్రిమ చక్కెరలున్న ప్రొటీన్ పౌడర్‌లు తీసుకోవడం, ఎక్కువసార్లు తాగడమూ మంచిది కాదు. అదనపు చక్కెరలు శరీరానికి చేరతాయి. కెఫీన్ ఎక్కువైతే నిద్రకు సమస్య. కాబట్టి, ఒకటి రెండుసార్లకు మించి తీసుకోవద్దు అనీ చెబుతున్నారు. మరి మీరు ప్రయత్నించారా ఈ ప్రొఫీ?

### టీవీఎస్ నుంచి 18 మోటార్‌సైకిళ్లు




పండుగ సీజన్ కోసం టీవీఎస్ మోటార్ కంపెనీ, తన ప్రీమియం శ్రేణిలో అపాచీ ఆర్‌టీఆర్ 160, అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీ, అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ, ఆర్ఆర్ 310, రోనిన్ వంటి మోడళ్లతో పాటు మెరుగైన హంగులతో కూడిన 18 కొత్త మోటార్‌సైకిళ్లను గురువారం ఆవిష్కరించింది. ఈ సీజన్‌లో 18 కొత్త మోటార్‌సైకిళ్లను విడుదల చేయడం ఇదే తొలి సారని టీవీఎస్ మోటార్ కంపెనీ హెడ్ (ప్రీమియం బిజినెస్) విమల్ సంబ్లీ తెలిపారు. 150 సీసీ, అంతకంటే ఎక్కువ సీసీ ఉన్న ప్రీమియం మోటార్‌సైకిళ్ల అమ్మకాలు మొత్తం మోటార్‌సైకిల్ పరిశ్రమలో 27 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు.




# సెమీకాన్‌లోకి 1.14 లక్షల కోట్ల పెట్టుబడులు!



దేశీయంగా చిప్‌సెట్ల డిజైనింగ్ నుంచి తయారీ వరకు (సెమికాన్ 2.0) కింద సుమారు 11–12 బిలియన్ డాలర్ల (రూ.1.05–1.14 లక్షల కోట్ల) పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోందని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. సెమికాన్ ఇండియా 2026 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరికరాలు, మెటీరియల్స్, గ్యాసెస్, రసాయనాలు, అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) యూనిట్లు, సబ్‌స్ట్రేట్‌లు, వేఫర్లతో పాటు అనేక విభాగాల్లోకి పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. తమ బోర్డులు, వాటాదార్ల నుంచి ఆమోదాలు పొందాక, సంబంధిత కంపెనీలే పెట్టుబడి ప్రకటనలు చేస్తాయని మంత్రి చెప్పారు.
ఇందువల్ల సెమీకండక్టర్ వ్యవస్థలో సుమారు లక్ష కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని, భవిష్యత్తులో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని తెలిపారు.
కేంద్ర మంత్రి వర్గం జులైలో రూ.1,27,500 కోట్లతో సెమికాన్ 2.0కు ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమం చిప్ డిజైన్, యంత్రాలు, మెటీరియల్స్, సెమీకండక్టర్ ఫ్యాబ్స్, ఏటీఎంపీ/ఓఎస్ఏటీ పరిశోధన–అభివృద్ధి, ప్రతిభ అభివృద్ధి అనే 6 మూలస్తంభాలపై ఆధారపడి ఉంది. ఈ కార్యక్రమం కింద 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో మూడు ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాయి.
సెమికాన్ ఇండియా సదస్సులో ఐరోపా, జపాన్, సింగపూర్‌తో పాటు మన దేశంలోని సంస్థలతో టాటా ఎలక్ట్రానిక్స్ 16 ఒప్పందాలపై సంతకాలు చేయనుందని సీఈఓ రణధీర్ ఠాకూర్ తెలిపారు. ప్రభుత్వానికి తెలిపిన ప్రకారమే గుజరాత్‌లోని ధోలేరాలో ఉన్న కంపెనీ ఫ్యాబ్, అసోంలోని ప్యాకేజింగ్ సదుపాయంలో పనులు సరిగ్గా సాగుతున్నాయన్నారు. దేశంలో హరిత ఇంధన పర్యావరణ వ్యవస్థను వేగవంతం చేయడానికి, ప్రపంచ సరఫరా వ్యవస్థను ఏకీకృతం చేయడానికి పదేళ్లలో 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.47,500 కోట్ల) పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు సెమీ కండక్టర్ పరికరాల తయారీ సంస్థ అప్లైడ్ మెటీరియల్స్ ప్రెసిడెంట్ ప్రభు రాజా వెల్లడించారు.
వచ్చే ఏడాది తమ చిప్ అసెంబ్లింగ్, టెస్టింగ్ కేంద్రాన్ని భారీగా విస్తరించనున్నట్లు మైక్రాన్ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా పేర్కొన్నారు.
వాహన తయారీదార్లు, సెమీకండక్టర్ సంస్థల కోసం కస్టమ్ సిస్టమ్–ఆన్–చిప్ (ఎస్ఓసీ) డిజైన్ సేవలను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రారంభించింది. ఏజెంటిక్ ఏఐలో వృద్ధి, దేశీయంగా డిజైన్ నిపుణుల లభ్యత కారణంగా మన దేశం సెమీకండక్టర్ రంగంలో నాయకత్వం వహించడానికి కూడా సిద్ధమవుతోందని ఇంటెల్‌లో సెంట్రల్ ఇంజినీరింగ్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ శ్రీనివాసన్ అయ్యంగార్ వెల్లడించారు.

## మిశ్రమంగా ముగిసిన సూచీలు..




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడాయి. చివరికి సెన్సెక్స్ స్వల్ప నష్టాల్లో ముగియగా.. నిఫ్టీ లాభాల్లో స్థిరపడింది. మెటల్ స్టాక్స్ రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 74,575.24 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,314.59) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,294.96 – 74,728.44 మధ్య కదలాడింది. ఆఖరికి 19.63 పాయింట్ల నష్టంతో 74,294.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.80 పాయింట్ల లాభంతో 23,346.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.49గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103.10 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు 4378 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## నెస్లే ఇండియాపై FSSAI లీగల్ యాక్షన్

ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ నెస్లే ఇండియా లిమిటెడ్‌పై ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) చట్టపరమైన చర్యలకు దిగింది. చంటి పిల్లలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల విషయంలో నిబంధనలు పాటించడంలో విఫలమైనందున లీగల్ యాక్షన్ చేపట్టింది. నాన్ ఎక్సెల్లాప్రో స్టేజ్ 1, లాక్టోజన్ ప్రో 1, మరో ఫాలోఅప్ ఫార్ములా విషయంలో ఇ–కామర్స్ ప్లాట్‌ఫారాల్లో ప్రమోషనల్ మెటీరియల్‌ను గుర్తించినట్లు FSSAI తెలిపింది. నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్ 1లో 5HMOs, వే ప్రోటీన్ ఉంటుందని, లాక్టోజన్ ప్రో 1లో వే ప్రోటీన్ సులభంగా జీర్ణం అవుతుందని కంపెనీ పేర్కొనడాన్ని FSSAI తప్పుబట్టింది. ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ రెగ్యులేషన్–2020 కింద చంటిపిల్లల ఆహార ఉత్పత్తుల విక్రయాలను పెంచుకోవడానికి ఉద్దేశించిన ఇలాంటి ప్రకటనలు నిషిద్ధం. అలాగే, పిల్లల ఆహారానికి సంబంధించి ఎలాంటి ప్రకటనలూ ఇవ్వకూడదని 1992 నాటి మరో చట్టం చెబుతోంది. ఈ విషయంలో నెస్లే ఇండియా నిబంధనలు ఉల్లంఘించిందని FSSAI పేర్కొంది. దీంతో పాటు నెస్లే ఇండియా తయారు చేసిన ఫార్ములాలో బయోటిన్ పదార్థం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గుర్తించింది. మూడు వేర్వేరు అడ్జుడికేషన్ కేసులను నమోదు చేసింది. కంపెనీ నుంచి వివరణ తీసుకున్న అనంతరం ఈ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నెస్లే ఇండియా షేర్లు 2 శాతం నష్టంతో 1345 వద్ద ట్రేడవుతున్నాయి.

## ఏడాదికి ఒక్కసారి తీసుకునే హెచ్ఐవీ నిరోధక ఔషధం

అంతర్జాతీయ బయోఫార్మా సంస్థ గిలియడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. హెచ్ఐవీ నిరోధానికి ప్రీ–ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఆర్ఈపీ) రూపంలో ఏడాదికి ఒక్కసారి మాత్రమే తీసుకునే లెనాకాపావిర్ ఔషధానికి రాయల్టీ–రహిత, నాన్–ఎక్స్‌క్లూజివ్ స్వచ్ఛంద లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గురువారం డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. టెక్నాలజీ బదిలీ, తయారీ సన్నద్ధత, భవిష్యత్తు సరఫరా ప్రణాళికలు వేగవంతం చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. భారత్‌తో పాటు హెచ్ఐవీ తీవ్రత ఎక్కువగా ఉన్న 120 అల్పాదాయ, దిగువ మధ్య తరగతి దేశాలకు ఈ ఔషధాన్ని అందించే వీలు కలుగుతుంది. హెచ్ఐవీ నిరోధం, చికిత్స కోసం ఏడాదికి రెండుసార్లు తీసుకునే లెనాకాపావిర్ తయారీకి సంబంధించి 2024 అక్టోబరులో గిలియడ్‌తో చేసుకున్న ఒప్పందానికి ఇది కొనసాగింపు. ఏడాదికి ఒక్కసారి ఇచ్చే ఈ ఫార్ములేషన్, ప్రస్తుతం గిలియడ్ నిర్వహిస్తున్న ఫేజ్ 3 'పర్పస్ 365' క్లినికల్ అధ్యయనం.. పరిశోధనా దశలో ఉంది. ఇంకా తుది సమీక్షలో ఉన్నందున, ఈ ఔషధానికి ఏ నియంత్రణ సంస్థ నుంచీ ఆమోదం లభించలేదు. ఏడాదికి రెండుసార్లు తీసుకునే లెనాకాపావిర్ ఫార్ములేషన్‌కు ఇప్పటికే అమెరికా ఎఫ్‌డీఏ, యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ ఆమోదం దక్కింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్ఐవీ నివారణ మార్గదర్శకాల్లో దీన్ని సిఫారసు చేసింది. నియంత్రణ సంస్థల ఆమోదం లభిస్తే, ఏడాదికి ఒక్కసారి మాత్రమే తీసుకునే నూతన ఔషధం ఎంతోమందికి ఉపశమనం కలిగిస్తుందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొన్నారు.









## అమ్మాయిలకు ఎదురుందా!

ఆసియాకప్ గెలిచి జోరు మీదున్న భారత మహిళల క్రికెట్ జట్టు.. మరో సమరానికి సిద్ధమైంది. స్వర్ణాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగుతోంది. శుక్రవారం క్వార్టర్‌ఫైనల్లో ఆతిథ్య జపాన్‌తో డిఫెండింగ్ ఛాంపియన్ హర్మన్‌ప్రీత్ బృందం తలపడనుంది. ఆసియా కప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన ఓపెనర్ షెఫాలి వర్మ మరోసారి భారత్‌కు కీలకం కానుంది. మరో ఓపెనర్ స్మృతి మంధాన కూడా ఫామ్‌లోనే ఉంది. స్పిన్నర్లు దీప్తి శర్మ, శ్రీచరణి జోరు కొనసాగించాల్సి ఉంది. గాయాల నుంచి కోలుకుని రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్ జట్టులోకి రావడం జట్టు ప్రత్యామ్నాయాలను మరింత పెంచుతోంది. రేణుక, నందని, క్రాంతి గౌడ్‌లతో భారత పేస్ విభాగం కూడా బలంగా ఉంది. సొంతగడ్డపై జపాన్.. భారత్‌కు ఏమేర పోటీ ఇవ్వగలదో చూడాలి. ఎనిమిది టీమ్‌లు మాత్రమే ఆడుతున్న ఈ విభాగంలో.. పోటీలు క్వార్టర్‌ఫైనల్ నుంచి మొదలువుతున్నాయి.

## ఆసియా గేమ్స్.. సెమీస్‌లో అడుగు పెట్టిన భారత మహిళా జట్టు

ఆసియా గేమ్స్ మహిళా క్రికెట్‌లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. పసికూన జపాన్‌పై అలవోకగా విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (40 నాటౌట్: 15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలు) మెరుపులతో 58 పరుగుల లక్ష్యాన్ని రెండు వికెట్లను నష్టపోయి కేవలం 5 ఓవర్లలోనే ఛేదించింది. కమలిని (0) డకౌట్ కాగా.. భారతి (6) నిరాశపరిచింది. షఫాలీతో కలిసి రిచా ఘోష్ (12★) ఆటను ముగించింది. జపాన్ బౌలర్లలో నొనొహో, అయక చెరో



వికెట్ తీశారు. అంతకుముందు.. శ్రీచరణి 4 వికెట్లతో విజృంభించడంతో జపాన్ చిత్తయ్యింది. ఇక సెమీస్‌లో బంగ్లాదేశ్‌తో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ మ్యాచ్ ఆదివారం జరగనుంది. మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాపై శ్రీలంక విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లంక 160/4 స్కోరు చేయగా.. మలేషియా 74 పరుగులకే పరిమితమైంది. దీంతో ఆదివారం మరో సెమీస్‌లో పాకిస్థాన్‌తో శ్రీలంక తలపడనుంది. ఫైనల్, మూడో స్థానం కోసం మ్యాచ్‌లు మంగళవారం జరుగుతాయి.

ఆసియా గేమ్స్ మహిళల క్రికెట్ క్వార్టర్ ఫైనల్‌లో భారత్‌కు జపాన్ 58 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్ 19.5 ఓవర్లలో 57 రన్స్‌కే ఆలౌటైంది. తెలుగు అమ్మాయి శ్రీ చరణి (4/10) అద్భుతమైన స్పెల్‌తో ఆకట్టుకుంది. జపాన్ బ్యాటర్లలో ఓపెనర్ అయకా కటో (25) టాప్ స్కోరర్. ఆమెతోపాటు మరో ఓపెనర్ హరున ఇవాసాకి (10) మాత్రమే రెండంకెల స్కోరు సాధించడం గమనార్హం. మై యనగిడ (0), అఫ్లియా చందెల్ (0), ఎరికా టోగుచి (0), నొనొహ యసుమోటో (0) డకౌట్ కాగా.. ఎరిక ఓడా (5), షిమాకో కటో (3), అకరి కనో (2), హినాసె గోటో (1), అయుమి (4) పరుగులు చేశారు. భారత బౌలర్లలో చరణి 4, షఫాలీ 2.. శ్రేయాంకా పాటిల్, దీప్తి శర్మ తలో వికెట్ తీశారు.

## మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే రూమ్?




ఆసియా గేమ్స్ లో వసతి ఏర్పాట్లపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. భారత బృందం అక్కడ అడుగు పెట్టినప్పటి నుంచి.. వసతి కోసం గంటల తరబడి వేచి చూడటంతో అథ్లెట్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాజాగా మరో అంశం వెలుగులోకి వచ్చింది. మహిళా జిమ్నాస్టిక్ ప్రణతి నాయక్, ఆమె కోచ్ అశోక్ మిశ్రాకు ఒకే గది కేటాయించడం గమనార్హం. క్రూయిజ్ షిప్‌లో ఇద్దరికీ ఒకే గదిని కేటాయించినట్లు నిర్వాహకులు భారత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మహిళ–పురుషుడికి కలిపి ఒకే గదిని ఎలా ఇస్తారని తీవ్ర విమర్శలు వచ్చాయి. వెంటనే సమస్యను నిర్వాహకులకు తెలియజేసినా.. గంటల తరబడి పరిష్కారం చూపించలేదని భారత వర్గాలు పేర్కొన్నాయి. చివరికి భారత ఒలింపిక్ అసోషియేషన్ కలగజేసుకొని ఏర్పాట్లు చేసింది. అది అయ్యేసరికి అర్ధరాత్రి ఒకటిన్నర అయినట్లు సమాచారం. సమస్య పరిష్కారమైనట్లు భావించిన అశోక్ మిశ్రా (coach Ashok Mishra) తన రూమ్ తాళం కోసం వెళ్లినప్పుడు.. హోటల్ స్టాఫ్ అభ్యంతరం తెలిపారు. రిజిస్టర్‌లో పేరు నమోదు కాలేదని కాసేపు వేచి ఉండాలని చెప్పారు. అధికారిక పత్రంలో అశోక్ మిశ్రా పేరులోని 'ఐ' సిస్టమ్ రికార్డ్స్‌లో మిస్ కావడంతోనే సమస్య ఎదురైనట్లు ఆసియా గేమ్స్ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆ తప్పును సరిచేసి అతడికి అక్రిడేషన్ ఇచ్చేందుకు మరో 45 నిమిషాల సమయం పట్టింది. ఆఖరికి తన రూమ్‌కు వెళ్లేసరికి అర్ధరాత్రి 2 గంటలు దాటిపోయింది.
జాతీయ ఛానల్‌తో మాట్లాడిన జిమ్నాస్టిక్ అథ్లెట్ ప్రణతి .. ''మా ఇద్దరికి కలిపి ఒకే గదిని కేటాయించారు. ఆ తర్వాత సమస్యను పరిష్కరించారు. అప్పటికీ 2 గంటలు దాటిపోయింది'' అని వెల్లడించింది.
ఆసియా గేమ్స్ ప్రారంభోత్సవం సందర్భంగా దేశాల జాతీయ జెండాలను ఆవిష్కరిస్తారు. వసతి ఏర్పాట్లలో తీవ్ర జాప్యం కావడంతో.. జాతీయ జెండాల ఆవిష్కరణ కార్యక్రమం కూడా ఆలస్యమైంది. చివరికి ప్రశాంతంగా ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. భారత్ తరఫున చెఫ్ ది మిషన్ సహదేవ్ యాదవ్, డిప్యూటీలు శరత్ కమల్, అలకనంద అశోక్, అంజలి భగవత్, డేవిడ్ తొట్టన్ పాల్గొన్నారు. ఇక ఆసియా గేమ్స్ పతాకధారులుగా మను బాకర్, తజీందర్ సింగ్ ముందుండి నడిపించారు.

## అద్దం ముందు ఎక్కువ నిలబడేది అతడే: అభిషేక్ శర్మ

అఫ్గానిస్థాన్‌తో మూడో టీ20లో భారత డ్యాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సెంచరీతో అదరగొట్టాడు. కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించి అద్భుత రికార్డు నమోదు చేశాడు. దీంతో ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్ అలవోకగా గెలిచి.. సిరీస్‌నూ క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, అంతకు ముందు అఫ్గాన్ బోర్డు ఆతిథ్యం ఇచ్చిన ప్రత్యేక ఈవెంట్‌లో ఇరు దేశాల క్రికెటర్లు, అధికారులు, కోచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్.. అఫ్గాన్ ప్లేయర్లు ఇబ్రహీం జద్రాన్, మహ్మద్ నబి, గుల్బాదిన్ నైబ్ ఒకే స్టేజ్‌ను పంచుకున్నారు. ఈ సందర్భంగా అభిషేక్ శర్మకు ఎదురైన ఓ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం ఇచ్చాడు.
అద్దం ముందు ఏ భారత ఆటగాడు ఎక్కువ సేపు సమయం గడుపుతారు?
అభిషేక్: భారత క్రికెటర్లు ఎవరనే దానిపై నేను కచ్చితంగా సమాధానం ఇవ్వలేను. అఫ్గాన్ ప్లేయర్లలో మాత్రం ఒకరి పేరు చెప్పగలను. ఫజల్‌హక్ ఫరూఖి ఎక్కువ సమయం గడుపుతాడు. ఇక భారత శిబిరంలోనూ ఓ ప్లేయర్ ఉన్నాడనుకుంటా. అతడు శివమ్ దూబే. భారత క్రికెటర్లలో ఎక్కువగా అల్లరి చేసేది ఇషాన్ కిషన్ అని కెప్టెన్ శ్రేయస్‌తోపాటు అభిషేక్ తెలిపాడు. కానీ, ఇషాన్ మాత్రం రవి బిష్ణోయ్ పేరు చెప్పాడు. దీంతో అంతా నవ్వులు చిందించారు.




## అదరగొట్టిన 'లక్ష్య' శ్రీతేజ

సౌత్‌జోన్ జూనియర్ జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 'ఈనాడు' సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' అథ్లెట్లు సత్తా చాటారు. తెలంగాణ అమ్మాయి తోలెం శ్రీతేజ 32 ఏళ్ల నాటి సౌత్‌జోన్ రికార్డును బద్దలు కొడుతూ స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. పుదుచ్చేరిలో జరిగిన పోటీల్లో మహిళల హెప్టాథ్లాన్ లో ఆమె 4964 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. సుమవతి (4817 పాయింట్లు, 1994 లో) రికార్డును శ్రీతేజ అధిగమించింది. ట్రయాథ్లాన్‌లో వర్షా ప్రదీప్ (తెలంగాణ) పసిడి గెలుచుకున్నాడు. అతడు 2743 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. లాంగ్‌జంప్‌లో కంచు లవ్లీత్ (తెలంగాణ, 4.71 మీటర్లు) జాతీయ రికార్డు సృష్టిస్తూ పసిడి కొల్లగొట్టాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో మహ్మద్ కైఫ్ (తెలంగాణ, 10.66 సెకన్లు), 200 మీటర్ల పరుగులో దుద్దు శేషు (ఆంధ్రప్రదేశ్, 21.63 సెకన్లు) రజతాలు గెలుచుకున్నారు. మహిళల లాంగ్‌జంప్‌లో తెలంగాణ అమ్మాయి శ్రీవిద్య దోరా (3.82 మీటర్లు) కాంస్యం సొంతం చేసుకుంది.



# ఎమోషన్స్ మూవీ 'ది ప్యారడైజ్'



**వుదయం సినిమా:** న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ బెంగళూరు లో ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బెంగళూరు ఎప్పుడు వచ్చినా సరే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ ప్రేక్షకులు ఎంతగానో ప్రేమ, ఆదరణ చూపిస్తారు. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణకు నేను ఎప్పుడూ కృతజ్ఞతలు ఉంటాను. 'ప్యారడైజ్' నా కెరీర్‌లో చాలా ప్రతిష్టాత్మక చిత్రం. నా కెరీర్‌లో ఎక్కువ రోజులు షూటింగ్ చేసిన సినిమా ఇదే. అలాగే ఎక్కువ హార్డ్ వర్క్ చేసిన సినిమా కూడా ఇదే. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతి అందించడానికి మేము ఎక్కడా రాజీ పడకుండా వర్క్ చేశాం. తప్పకుండా మీరు బిగ్ స్క్రీన్ మీద చాలా ఎంజాయ్ చేస్తారు. ఇది యాక్షన్ డ్రామా. ఈ జానర్ లో చాలా సినిమాలు వచ్చి ఉండొచ్చు. కాకపోతే 'ప్యారడైజ్' లాంటి ఇంటెన్సిటీ, వరల్డ్ బిల్డింగ్, ఎనర్జీ, ఎమోషన్స్ ఉన్న సినిమా ఇప్పటివరకు రాలేదు. అలాగే అనిరుధ్ అద్భుతమైన స్కోర్ చేశారు. మోహన్ బాబు గారు, సోనాలి కులకర్ణి గారు, రాఘవ్.. ఇలా అందరూ కూడా అద్భుతమైన పర్ఫార్మెన్స్ ఇచ్చారు. వాళ్లందరితో కలిసి నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నాను.గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నాం. ఇందులో ఉండే హై మూమెంట్స్ అన్నీ కూడా మీరు ఎంజాయ్ చేస్తారు. ఇందులో ఉండే ఎమోషన్ మీ అందరినీ కదిలిస్తుంది. కొన్ని యాక్షన్ ఎపిసోడ్స్ ఒక స్పెక్టక్యులర్‌గా ఉంటాయి. 'ప్యారడైజ్' ఒక తల్లి, కొడుకుల కథ. అది అన్నిటికంటే గొప్ప ఎమోషన్. చాలా మంచి కమర్షియల్ ఎక్స్‌పీరియన్స్ సినిమా అవుతుంది. సెప్టెంబర్ 24న మీ అందరి ప్రేమ దొరుకుతుందని ఆశిస్తున్నాను. ఇంత ప్రేమ చూపిస్తున్న మీ అందరికీ సెల్యూట్ చేస్తున్నాను. ఈ సినిమా జడల్ లుక్ కనుక ఒక మంచి ఉద్దేశం ఉంది. జడలు కథలో భాగంగా ఉంటుంది. మీ అందరి రెస్పాన్స్ చూడడానికి ఎదురుచూస్తున్నాను. మదర్–సన్ ఎమోషన్‌తో చాలా సినిమాలు వచ్చాయి. కాకపోతే ఇందులో ఉండే మదర్–సన్ కాన్ఫ్లిక్ట్‌ను మీరు ఎప్పుడూ చూసి ఉండరు. కన్నడలో నా క్యారెక్టర్‌కు దీక్షిత్ డబ్బింగ్ చెప్పాడు. తను నటుడిగా చాలా బిజీగా ఉన్నప్పటికీ మా అందరి మీద ప్రేమతో వచ్చి డబ్బింగ్ చెప్పాడు.


## వుదయం సినిమా MOVIE TIME!

# 'సీన్' యాటిట్యూడ్ & మ్యాడ్‌నెస్ టైటిల్ గ్లింప్స్



**వుదయం సినిమా:** వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకెళ్తున్న స్టార్ హీరో సూర్య.. మలయాళ దర్శకుడు జితు మాధవన్‌తో కలిసి తన 47వ చిత్రాన్ని చేస్తున్నారు.'ఆవేశం' ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో నజ్రియా నజీమ్ కథానాయికగా నటిస్తుండగా.. ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియాన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.యాక్షన్–కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని జఘరం స్టూడియోస్, 2D ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై జ్యోతిక, సూర్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ కో–ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా 'సీన్' టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. అలాగే ఈ సినిమాను దీపావళి సందర్భంగా నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు.టైటిల్ గ్లింప్స్ ప్రారంభంలో సూర్య ఓ విచిత్రమైన పోలీ ఆఫీసర్‌గా వాయిస్ ఓవర్ ద్వారా పరిచయం చేశారు. అక్కడి నుంచే ఆసక్తికరమైన, ఫన్నీ టోన్‌ను సెట్ చేశారు.

# 'జాంబీ రెడ్డి 2 NXT LVL' ఫస్ట్ లుక్ రిలీజ్



**వుదయం సినిమా:** 'హనుమాన్', 'మిరాయ్' చిత్రాలతో పాన్–ఇండియా విజయం సాధించిన సూపర్ హీరో తేజ సజ్జ, ప్రస్తుతం 'జాంబీ రెడ్డి 2 NXT LVL' గా వస్తున్న 'జోంబీ రెడ్డి' సెకెండ్ పార్ట్ లో నటిస్తున్నారు. 'జాంబీ రెడ్డి' క్రియేటర్ ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు క్రియేటర్ గా, సుపర్ణ్ ఎస్ వర్మ దర్శకుడిగా చేస్తున్నారు. 'హక్', 'రానా నాయుడు', 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వంటి ప్రశంసలు అందుకున్న ప్రాజెక్ట్స్‌తో పాటు పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లకు రచయితగా పనిచేసిన సుపర్ణ్ ఎస్. వర్మ.. ఈ ఫ్రాంచైజ్‌కు తనదైన ఇంటెన్స్ టచ్‌ను తీసుకొస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.తేజ సజ్జా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. గతంలో వీరి కాంబినేషన్‌లో 'మిరాయ్' బ్లాక్ బస్టర్ అయ్యింది. తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'జాంబీ రెడ్డి 2' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోకు సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తుండగా.. షనాయా కపూర్ ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కానున్నారు.ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఉపేంద్రను ఇంతకుముందెన్నడూ చూడని వైల్డ్, ఫియర్స్, లార్జర్ దెన్ లైఫ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. భారీ చెట్టు కొమ్మకు తలకిందులుగా వేలాడుతూ.. ఒక చేతిలో పొడవైన ఆయుధాన్ని పట్టుకుని కనిపించారు. రఫ్ లుక్, విరబోసుకున్న జుట్టు, ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో ఈ క్యారెక్టర్ ఎవరు? అనే ఆసక్తిని పెంచుతున్నారు.డార్క్ కాస్ట్యూమ్, ట్రైబల్ ఇన్‌స్పైర్డ్ ప్యాటర్న్స్ ఈ క్యారెక్టర్ రా అండ్ యూనిక్ లుక్‌ను మరింత ఎలివేట్ చేస్తున్నాయి. దట్టమైన అడవి, వెలుగుతున్న కాగడాలు, మిస్టీరియస్ సిల్హౌట్స్‌తో పోస్టర్‌కు ఒక డిఫరెంట్ ఫాంటసీ–యాక్షన్ వాతావరణాన్ని క్రియేట్ చేశారు.ఇక పోస్టర్‌పై ఉన్న "READY TO TURN THE WORLD UPSIDE DOWN" అనే ట్యాగ్ లైన్.. ఉపేంద్ర పోజ్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. ప్రతిపాత్ర కోసం తనను తాను పూర్తిగా మార్చుకునే వెర్సటైల్ యాక్టర్‌గా పేరున్న ఉపేంద్ర.. ఈ సినిమాలో తన కెరీర్‌లోనే అత్యంత వైవిధ్యమైన, స్ట్రైకింగ్ లుక్‌లలో ఒకటిగా కనిపించనున్నారు.

# నవంబర్ 20న 'ఆకాశంలో ఒకతార'



**వుదయం సినిమా:** వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ మూవీ 'ఆకాశంలో ఒకతార' సినిమాకు సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ ఈరోజు అనౌన్స్ చేశారు. ఈ మూవీలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పవన్ సాధినేని దర్శకుడు. ఈ చిత్రాన్ని లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.'ఆకాశంలో ఒక తార' సినిమాను నవంబర్ 20న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ అందమైన సినిమాను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేలా టీమ్ భారీ స్థాయిలో డిఫరెంట్ స్టైల్ ప్రమోషన్స్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చిట్టి చిట్టి చీమ' పాటకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ పాట మ్యూజిక్ లవర్స్‌కు అడిక్షన్‌గా మారుతోంది. నేషనల్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ తో మూవీపై పాజిటివ్ వైబ్స్, ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సినిమా నుంచి వచ్చే అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ వరుస విజయాలతో దూసుకెళ్తున్న దుల్కర్ సల్మాన్.. దర్శకుడు పవన్ సాధినేని క్రియేటివ్ విజన్‌తో తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటంతో.. ఈ సినిమా ప్రత్యేకమైన, గుర్తుండిపోయే ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది.టాలెంటెడ్ సినిమాటోగ్రాఫర్ సుజిత్ సారంగ్ ఈ సినిమాకు కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు. శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతటి బలమైన టెక్నికల్ టీమ్, మంచి నటీనటులతో తెరకెక్కుతోన్న 'ఆకాశంలో ఒక తార' సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతోంది.

# 'ప్రేమనే ఊరిలో' సాంగ్ లాంచ్ ఈవెంట్



**వుదయం సినిమా:** మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు విడుదల చేసిన పాటలు, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక శనివారం నాడు మరో పాటను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన సాంగ్ లాంచ్ ప్రెస్ మీట్‌లో కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ .. ''ప్రేమనే ఊరిలో' అనే టైటిలే చాలా బాగుంది. టీజర్‌లో శ్రీకాంత్ గారి వాయిస్ ఓవర్ బాగుంది. తణికెళ్ల భరణి గారు రిలీజ్ చేసిన పాట కూడా బాగుంది. ఈ ప్రమోషన్స్‌లో నన్ను భాగస్వామిని చేసిన సురేష్ గారికి థాంక్స్. ఈ సినిమాతో శ్రీనివాస్ గారికి మంచి విజయం దక్కాలి. ఆర్టిస్టులు తెరపై అద్భుతంగా కనిపించారు. 'ప్రేమనే ఊరిలో' సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు రావాలని, నిర్మాతకు మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.చందు శ్రీనివాస్ మాట్లాడుతూ .. ''ప్రేమనే ఊరిలో' సినిమాతో నిర్మాతగా అడుగు పెడుతున్నాను. చిన్నతనం నుంచీ సినిమాలంటే ఇష్టం. ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలు పెట్టి ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నాను. దేవేందర్ గారు నాకు బిజినెస్‌లో హెల్ప్ చేశారు.

# 'ఓ నా సిద్ధయ్య' టైటిల్ పోస్టర్ లాంచ్



**వుదయం సినిమా:** సిద్ధు రెడ్డి, కాత్యాయని జగన నటించిన 'ఓ నా సిద్ధయ్య' పాటకు సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. రామ్ అద్నాన్ ఈ పాటను రాసి అందంగా తెరకెక్కించారు. కళ్యాణ్ కీస్ సంగీత సారథ్యంలో రామ్ అద్నాన్, శ్రీనిధి ఈ పాటను ఆలపించారు. అరుణ్ కొలుగూరి కెమెరా, ఎడిటింగ్ బాధ్యతల్ని నిర్వర్తించారు. కందకట్ల క్రియేషన్స్ బ్యానర్ మీద నిర్మించిన ఈ 'ఓ నా సిద్ధయ్య' పాటకు సంబంధించిన టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని శుక్రవారం నాడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, చంద్రబోస్, కాసర్ల శ్యాం, నల్గొండ గద్దర్ మరియు గీతా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ .. 'నా సోదర సమానుడైన సిద్ధు రెడ్డి 'ఓ నా సిద్ధయ్య' పాటను చేయడం ఆనందంగా ఉంది. సిద్ధు రెడ్డి ప్రభుత్వ పాఠశాల్ని నిర్మించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుంటాడు. అడగకముందే అందరికీ సాయం చేస్తుంటాడు. మూడు వందల మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ చేయించాడు. అలాంటి మంచి మనిషి చేసిన ఈ పాట పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్ మాట్లాడుతూ .. 'సిద్ధుతో నాకు ఆరేడు నెలల పరిచయమే అయినా ఆరేడు జన్మల బంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. నా సోదర సమానుడైన సిద్ధు కోసం ఓ మంచి పాట రాశాను. అది కూడా త్వరలో రాబోతోంది. రామ్ చేసిన 'ఓ నా సిద్ధయ్య' పాట ముందుగా రిలీజ్ అవుతుండటం ఆనందంగా ఉంది. రామ్ మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాను. ఈ పాటలో సిద్ధు గొప్పగా నటించాడు. తెరపై, తెర వెనుక సిద్ధు ఒకటేలా ఉంటారు. సిద్ధు చేసే సేవా కార్యక్రమాల గురించి వింటూ ఉన్నాను. సిద్ధు ఇలానే ముమ్ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.కాసర్ల శ్యాం మాట్లాడుతూ .. 'ఒక్క పూట పరిచయంతోనే సిద్ధు సోదరుడు నాకెంతో అనుబంధం ఏర్పడింది. సిద్ధు భయ్యా ఈ పాటలో గొప్పగా నటించాడు. రాము ఈ పాటను అద్భుతంగా తెరకెక్కించాడు. 'ఓ నా సిద్ధయ్య' పాట సిద్ధు భయ్యాని ఓ మెట్టు పైకి ఎక్కించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.సిద్ధు రెడ్డి మాట్లాడుతూ .. ''ఓ నా సిద్ధయ్య' ఈవెంట్ కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. రామ్, లక్ష్మణ్ పాటలు ఖండాంతరాలు దాటాయి. వారు పాడే పాటలు, రాసే అక్షరాలు జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. మూడు వందల మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ ఇవ్వడం వెనుక ఓ పెద్ద కారణం ఉంది.

# హీరో శ్రీ నందు నటించిన మగాళ్లు జిందాబాద్ టైటిల్ లాంచ్

**వుదయం సినిమా:** గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్ బ్యానర్ పై ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు నిర్మాతలుగా యంగ్ హీరో శ్రీ నందు, స్టార్ కమెడియన్స్ వెన్నెల కిషోర్, వైవాహర్ష నటిస్తున్న తాజా చిత్రం మగాళ్లు జిందాబాద్. నార ప్రవీణ్ రచన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం టైటిల్ అనౌన్స్మెంట్ ఈవెంట్ ఘనంగా జరిగింది. తెలుగు స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి శిష్యుడిగా నారా ప్రవీణ్ సినిమా టైటిల్‌తోనే తన ప్రత్యేకతను చాటుకున్నారు. కామెడీ కంటెంట్ లకు మంచి ఆదరణ దక్కుతున్న ఈ సమయంలో అద్భుతమైన టైటిల్, అంతే వినోదపరితమైన కంటెంట్ తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు త్వరలో వస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది.డైరెక్టర్ నార ప్రవీణ్ మాట్లాడుతూ.. ఇదొక సెటైరికల్ కామెడీ ఫిలిం అని అందుకోసమే మగాళ్లు జిందాబాద్ అనే టైటిల్ పెట్టామని పేర్కొన్నారు. సొసైటీలో ఆడవారికి దక్కే కంఫర్ట్ గాని, న్యాయం కానీ, సింపతీ కానీ మగాడికి దక్కట్లేదు అనే టాపిక్ ను సెటైరికల్ టోన్ లో డీల్ చేస్తూ ఔట్ అండ్ ఔట్ కామెడీ జెనరేట్ చేశాం అని ,ఇది ఒక సోషల్ సెటైరికల్ మూవీ అని చెప్పారు.



# 25న "కళ్యాణం కమనీయం జీవితం"

**వుదయం సినిమా:** వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్స్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". ఈ సినిమా ఈ నెల 25న గ్రాం థియేట్రిక రిలీజ్ కు రెడీ అయ్యింది . తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా "కళ్యాణం కమనీయం జీవితం" సినిమా టీమ్ సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహి చారు నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ; రీసెంట్ గా మా కళ్యాణం కమనీయం జీవితం సినిమాని మా ఫ్రెండ్స్ కి , శ్రేయోభిలాషుల కు కొంతమంది మీడియా మిత్రులకు చూపించడం జరిగింది. సినిమాని చూసిన తర్వాత సినిమా చాలా బాగుంది అని మెచ్చుకున్నారు. మంచి వ్యక్తులతో ఈ సినిమా ప్రారంభమైంది. లెజెండరీ రైటర్ విజయేంద్రప్రసాద్ గారు సినిమా పోస్టర్ ను, చంద్రబోస్ గారు పాటను విడుదల చేశారు వి వి వినాయక్ గారు కూడా మా ఈవెంట్ కు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. ఈ మూవీ మంచి ఫ్యామిలీ, యూత్ ఓరియంటెడ్ మూవీ గా మా డైరెక్టర్ తీర్చిదిద్దారు. ఈ మూవీలో నటించిన నటి నటులు ది బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఇచ్చారు. శ్రీ మురళి కార్తికేయ మంచి పాటలను, సంగీతాన్ని అందించారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.